
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి



సజల శ్రద్ధ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః


సంకల్పం
సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 6**
**సంచిక 7**
**అక్టోబర్ 2005**
పార్థివ ఆశ్వయుజం
విడిప్రతి రూ॥ 8.00
సం॥ చందా రూ॥ 85
3సం॥ చందా రూ॥ 250
10 సం॥ చందా రూ॥ 750
కూర్పు


## శక్తిపూజ రహస్యం

శక్తిపూజకు శక్తి సమీకరణ ఆవశ్యకం. ఆ సమీకరణ లేనిదే శక్తిపూజ సాధ్యం కాదు. జీవితంలో దాని ఫలితమూ అందదు. శక్తి సమీకరణ జరిగిన చోట సుఖ సత్కారాలూ, శాంతీ అనే పుష్పాలు వర్షిస్తాయి. శక్తి సమీకరణ చేసిన వ్యక్తియే సమర్థవంతుడూ, బుద్ధికుశలుడూ, అదృష్టవంతుడూ అవుతాడు.

శక్తిపూజ చేయగోరేవారు శక్తి సమీకరణకై నడుం బిగించాలి. మహాశక్తి పూజ కోసమై ఈ క్షణం నుండే ఈ పంచోపచారాలకు సన్నాహాలు చేయాలి. శారీరిక శక్తి, మానసిక శక్తి, భావనాత్మక శక్తి, ఆర్థిక శక్తి, ఆధ్యాత్మిక శక్తి – ఈ అయిదు శక్తులనూ సమీకరించడం ద్వారా వ్యక్తిలోని ప్రసన్నత వందరెట్లు పెరుగుతుంది. అది సత్కర్మలకు సద్వినియోగం అవుతుంది. ఫలితంగా వ్యక్తి సాఫల్యపు శిఖరాగ్రాన్ని చేరుకుంటాడు.

శరన్నవరాత్రిలోని తొమ్మిది రోజులు శక్తిపూజలోని ఈ రహస్యాన్ని తెలుసుకునే రోజులు. ఈ తొమ్మిది రోజులూ సమీకరించిన శక్తితో మనం మాత భగవతిని పూజిస్తాము. ఈ తొమ్మిది రోజులలో ఎన్నెన్నో రహస్యాలు ఇమిడి ఉన్నాయి. ప్రధాన రహస్యాల సంఖ్య తొమ్మిది. తత్, సవితుః, వరేణ్యమ్, భర్గో, దేవస్య, ధీమహి, ధియో, యోనః, ప్రచోదయాత్ – అనే గాయత్రీ మంత్రంలోని తొమ్మిది శబ్దాలలో ఇవి ఇమిడి ఉన్నాయి. ఈ తొమ్మిది శబ్దాల మహిమవల్ల భూ, భువః, స్వః రూపంలో స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలోని శక్తులన్నీ మేలుకొంటాయి. ఫలితంగా ఓంకార పరమ పదం లభిస్తుంది.

తన జీవితంలోని క్షణ క్షణమూ శక్తిలోని కణకణాన్నీ సమీకరించి, దానిని సత్కర్మల కోసం సద్వినియోగం చేసి, తద్వారా విశ్వవ్యాపి అయిన మాత జగదంబ గాయత్రిని అర్చన, ఆరాధన చేసే వ్యక్తి జీవితం ఆ పరమపదాన్ని పొందుతుంది.

H H H

**సత్కర్మలో గడిపే క్షణం జీవితాన్ని వెలుగుతో నింపే క్షణం.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : యుగఋషి**


| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం :** | |
| | శక్తిపూజ రహస్యం | 1 |
| 2. | **విషయ సూచిక** | 2 |
| 3. | **వేద మంత్రం** | |
| | ఆత్మశక్తి సద్వినియోగం | 3 |
| 4. | **ముఖచిత్ర కథనం - 1** | |
| | స్వరాజ్య సమర సేనానిగా పరమపూజ్య గురుదేవులు | 4 |
| 5. | **ముఖచిత్ర కథనం - 2** | |
| | బుద్ధావతారానికి పూరకం ప్రజ్ఞావతారం | 6 |
| 6. | **ముఖచిత్ర కథనం - 3** | |
| | గురుదేవుల స్మృతులు - అద్భుత అనుభూతులు | 8 |
| 7. | **మనం-మన ఆరోగ్యం** | |
| | ఆరోగ్యానికి, దీర్ఘాయువుకూ దివ్య ఔషధం - తేనె | 13 |
| 8. | **గాంధీ జయంతి వ్యాసం** | |
| | వర్ణాశ్రమ ధర్మాలను జీర్ణించుకున్న యుగపురుషుడు | 16 |
| 9. | **సోదరి నివేదిత జయంతి వ్యాసం** | |
| | త్యాగానికీ సేవకూ మహోజ్వల ప్రతీక | 20 |
| 10. | **దేవతా విజ్ఞానం** | |
| | దేవతల వాహనాల రహస్యాలు | 27 |
| 11. | **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం - 5** | |
| | అన్నమయ కోశాన్ని క్షాళనచేసే ఉపవాసం | 28 |
| 12. | **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 22** | |
| | హిమాలయం నుండి ఆహ్వానం - 2 | 33 |
| 13. | **నావారితో నామాట: మహోద్యమం విరాట్ యాత్ర-9** | |
| | 2012 నాటికి లక్షమంది యువ కార్యకర్తలు | 37 |
| 14. | **విశ్వవిద్యాలయ విశేషాలు** | |
| | ధ్యాన గంగలో నిరంతర స్నానం | 41 |
| 15. | **శాంతికుంజ్ సమాచారం** | |
| | భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష బహుముఖ విస్తరణ | 43 |
| 16. | **వార్తలు :** | |
| | విశాఖలో 51 లక్షల సామూహిక గాయత్రీమంత్రజపం | 45 |


# చందాదారులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాను

ఐప్త్ర జూఈజుఖజుఊజు స్త్రజుఖజుఊప్త్ర ఊప్త్రఏఐఊ – ఔఏఐశ్రీజూఐఐ ఈ॥ఐంశ్రీ, ఇఖఈజూప్త్రజుఔజుఈ

పేరుమీద బ్యాంకు డ్రాఫ్టు ద్వారాకాని, చెక్కుద్వారాకాని పంపగోరుతాము. మీరు పంపే మనియార్డరులో మీ పేరు, చిరునామా, పిన్‌కోడ్ వ్రాయగలరు.

# ముఖ్య గమనిక

పత్రికకు వార్తలు పంపే పరిజనులు దిగువ విషయాలను గమనించాలి -

1. పంపే ఫోటోల వెనుక వాటి వివరాలు తప్పనిసరిగా వ్రాయాలి. అలాంటి వివరాలు లేని ఫోటోలు ప్రచురణకాకుండా ఉండిపోతున్నాయి.
2. వార్తలు స్పష్టంగా వ్రాయాలి. ప్రతినెలా 5వ తేదీ వరకు అందిన వార్తలు, ఫోటోలు మాత్రమే తర్వాతి నెలలో ప్రచురణకు పరిశీలించబడతాయి.
3. కార్యక్రమం జరిగిన తర్వాత వీలైనంత త్వరగా ఆ వార్త పంపే ప్రయత్నం చేయాలి.

H H H

# సెప్టెంబరు అక్టోబరు నెలలలో పర్వదినాలు

**అక్టోబరు :**

1. గురుదేవుల జయంతి.
2. గాంధీ జయంతి.
11. జయప్రకాష్ నారాయణ్ జయంతి.
12. మధ్వాచార్య జయంతి
    విజయదశమి.
28. సోదరి నివేదిత జయంతి.
31. సర్దార్ పటేల్ జయంతి.
    నరక చతుర్దశి.

**నవంబరు :**

1. దీపావళి.
10. ధన్వంతరి జయంతి.
14. బాలల దినోత్సవం.
15. గురునానక్ జయంతి.
16. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి.
30. జగదీష్‌చంద్ర బోస్ జయంతి.
    గురు తేగ్‌బహదూర్ బలిదానం.

**ఉత్తమ వ్యవహరణ, శుభ కర్మ-ఇదే దైవపూజ.**

# వేద మంత్రం
## ఆత్మశక్తి సద్వినియోగం

అపహి మనసస్పతేప క్రామ పరశ్చర ।

పరో నిర్ ఋత్యా ఆచక్ష్వ బహుధా జీవతో మనః ॥ –ఋగ్వేదం 10/164/1

**భావార్థం** : నేను దురాలోచనలను ఎప్పుడూ దూరంగా ఉంచుతాను. వీటిద్వారా నన్ను నాశనం చేసుకోను. నా శక్తి సామర్థ్యాలు అపారం. వీటిని పోగొట్టుకోను.

**సందేశం** : ప్రపంచంలో ఏ కార్యకలాపాలు చూస్తున్నామో, మానవ సమాజం యొక్క నడక ఏదైతే ఉన్నదో, మన నలువైపులా ఏదైతే జరుగుతున్నదో – ఇదంతా కేవలం మనస్సు యొక్క క్రీడయే. ఇవన్నీ కర్మద్వారా నియంత్రించబడతాయి. ఏదైనా కర్మ మొదట మనసులో ఆలోచన రూపంలో వస్తుంది. ఈ ఆలోచనపై ఆంతరంగికంగా చింతన, మననం జరిగి, కార్యరూపంలో పరిణతి చేసే ఇచ్ఛాశక్తి జాగృతమవుతుంది. తర్వాత మనుష్యుడు ఆ కార్యం చేస్తాడు. ఆ కర్మల వలన చివరికి అతని శీలం నిర్మాణం అవుతుంది.

జీవితాన్ని మన అదుపులో ఉంచుకోవటానికి ఒకే ఒక ఉపాయం తగిన లోతైన చింతన. ఈ రోజుల్లో మనమంతా 'ముక్తచింతన'ను ప్రశంసిస్తున్నాం. ముక్తచింతన మంచిదే. కానీ 'ఉచిత చింతన' దానికంటే మంచిది. ఉచిత చింతన 'గహన చింతన'గా పరిణతి చెందుట మరింత మంచిది. ఆత్మ నిరీక్షణ అలవాటు చేసుకోకుండా, మనసులోపల అలజడి కలిగించే ఆలోచనలపై నియంత్రణ అసంభవం. అంతఃకరణలో మలము, విక్షేపము, ఆవరణ అనే మూడు దోషాలు ఉంటాయి. ఈ దోషాలు తొలగించి మనస్సును శుద్ధం, పవిత్రం, నిర్మలం చేసుకోకపోతే, దోషపూరిత ఆలోచనలు జన్మిస్తూనే ఉంటాయి. ఆలోచనలు పవిత్రమైన తర్వాతే మన ఆచరణ, కర్మలలో ఉత్కృష్టతను దర్శించగల్గుతాము.

గీతోపదేశం ఏమంటే – మనుష్యుడు నిరంతరం కర్మ చేస్తూ ఉండాలి. ఏ కొంచమైనా మేలు చేయని లేదా ఏ కొంచమైనా చెడుచేయని కర్మంటూ మనం చేయలేము. ప్రతి కర్మ అనివార్యంగా గుణ దోషాలతో కూడి ఉంటుంది. సత్కర్మలు, దుష్కర్మలు రెండింటి మూలం మన మనస్సులో వికసిస్తుంది. మనస్సులో మంచి ఆలోచనలు వస్తే మన కర్మలు మంచివిగా ఉంటాయి. దురాలోచనల పరిణామం దుష్కర్మలుగా ప్రకటితమవుతుంది. మనలో ఉత్పన్నమైన దురాలోచనలు మనల్ని దుష్ప్రవృత్తుల వైపు ప్రేరేపించి మన సర్వనాశనానికి కారణమవుతాయి. అందుకే మన మనసులో అల్లుకుపోతున్న దురాలోచనలను సమూలముగా పెరికి పారవేయటానికి మనం నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి.

భారతీయ సంస్కృతిలో మనస్సు యొక్క అవధులు లేని శక్తి, అపారమైన సామర్థ్యం ఎల్లప్పుడూ పరిగణించబడతాయి. సంస్కారం, పరిష్కారం, సంశోధనల ద్వారా మనస్సులోని అవాంఛనీయ తత్వాలను, దుర్గుణాలను, దోషాలను తొలగించి వాటి స్థానంలో సద్గుణాలను ప్రతిష్ఠించుటయే మన సంస్కృతికి మూలాధారం. దీని ద్వారా దుర్గుణాలను, దురాచారాలను, దుఃఖం కలిగించే తత్వాలను మనసులో చొరబడకుండా ఆపవచ్చు. వాటి స్థానంలో శుభతత్వాలు, శుభాలోచనలు, సద్గుణాలు తమ సుగంధాన్ని వెదజల్లుతాయి.

ఆత్మశోధన యొక్క ఈ క్రమం జీవితమంతా జరుగుతూనే ఉండాలి. దీనితో సత్కర్మల ద్వారా మానవ జీవితం దేవత్వం వైపు పురోగమిస్తుంది. చెడ్డ ఆలోచనలు, చెడ్డ సంస్కారాలు మన మనస్సులోకి చొరబడే సాహసం చేయలేవు. జీవితం పవిత్రం, నిర్మలం అవుతుంది.

ఆత్మశక్తిని సదుపయోగం చేసుకోవాలి.

H H H

**నీకు చెడ్డదని అనిపించిన దానిని ఎన్నడూ ఆమోదించకు, సమర్థించకు.**

## ముఖచిత్ర కథనం - 1

# స్వరాజ్య సమర సేనానిగా పరమపూజ్య గురుదేవులు

1929 ఆగస్టులో మహాత్మా గాంధీ ఆగ్రాకు వచ్చారు. వీరు అచ్చటచ్చట ఉపన్యాసములిచ్చి స్వాతంత్ర్యాగ్నిని రెచ్చగొట్టారు. ఎక్కువ సంఖ్యలో లాహోర్ సమావేశమునకు హాజరుకమ్మని ప్రజలను ప్రోత్సహించారు. శ్రీ ఆచార్యులవారు యాత్రచేసి లాహోర్ చేరారు. అటు తరువాత నుండి కాంగ్రెస్ సమావేశములకు హాజరగుట వారికి ఒక నియమమయ్యెను. 21 డిసెంబరు నాడు రావీ తీరమున జరిగిన కాంగ్రెస్ చరిత్రాత్మక సమావేశములో రాత్రి 12 గంటలకు పూర్ణ స్వరాజ్య ప్రస్థాపన తీర్మానించడమైనది. అప్పుడు నలువైపుల నుండి చప్పట్లు మారుమ్రోగాయి.

ఈ సమావేశములోనే 26 జనవరి 1930ని స్వాతంత్ర్య దినముగా ప్రకటించారు. దేశమంతటా ఊరేగింపులు, సభలు మొదలైనవి చేయుటకు నిర్ణయం తీసుకున్నారు. పూజ్యఆచార్యుల వారు ఎన్నో ఆశలతో ఆగ్రాకు తిరిగి వచ్చారు.

ఆరోజున ఆగ్రాలో కూడా చుంగీ కచ్చేరి ఎదుట పెద్ద సభ జరిగినది. మొత్తము పట్టణాన్ని త్రివర్ణ పతాకములతో అలంకరించారు. ఆ సభలో దాదాపు 25వేల మంది పాల్గొన్నారు. శ్రీకృష్ణదత్త పాలీవాల్ గారు పతాకము ఎగురవేశారు. మూడవ ఝామున ఊరేగింపు బయలుదేరింది. దాని ఒక కొన ఫ్రీలస్గీ అయితే రెండవ కొన రావత్ పాడా. ఈ ఊరేగింపు సభగా మారింది. అక్కడ 40వేల మంది ఉన్నారు. ఈవిధముగా స్వాతంత్ర్య దినము ప్రతి గ్రామములో జరగాలని అక్కడే నిర్ణయించబడింది. పూజ్య ఆచార్యులవారు అక్కడ నుండే ఉత్సాహముతో తన గ్రామము ఆవల్‌ఖేడా చేరారు. ఇంటింటితో సంపర్కము పెంచుకున్నారు. సంపూర్ణ స్వరాజ్య దినోత్సవములో పాల్గొనమని అందరిని గట్టిగా కోరారు. ఆవల్‌ఖేడాలో జరుపబడిన ఉత్సవమును చూచి శ్రీరావత్ గారు కూడా గంతులు వేశారు. వారు ఎంతో సంతోషముతో యువకులైన 'మత్త్' గారిని ఆలింగనం చేసుకున్నారు.

ఆ తర్వాత సత్యాగ్రహము తుఫాను వేగమును ధరించింది. ముజఫల్‌ఖాన్ తోటలో సత్యాగ్రహ శిబిరము ప్రారంభించబడింది. అక్కడికి రాత్రింబవళ్లు సత్యాగ్రహులు రాసాగిరి. నగరవాసులు వారి భోజనము మొదలైన వసతులలో ఏ కొరత రానివ్వలేదు. ఇక్కడి నుండి పదిమంది చొప్పున సత్యాగ్రహులు ఉప్పు తయారు చేయుటకు వెళ్లసాగిరి. పూజ్య ఆచార్యువారు వారితో వెళ్లుటకు మాటిమాటికీ ప్రయత్నించారు. కాని శ్రీ పాలీవాల్ గారు తాను ఖైదు చేయబడినపుడు సైనిక్ ప్రెస్సు పని ఆగిపోతుందని వారికి నచ్చచెప్పి పోనివ్వలేదు. ఆరోజుల్లో వారు ఎంతో శ్రద్ధగా ఆ వార్తా పత్రిక పని నిర్వహిస్తూ వచ్చారు. ఆ సమయములో ఎవరికీ పాలీవాల్ గారు లేరని అనిపించేదే కాదు. ఇంత అయినప్పటికీ వారికి సమయము దొరికినప్పుడు ఉప్పు తయారుచేసి సత్యాగ్రహులలో వెళ్లి కలిసేవారు. ఉప్పు సత్యాగ్రహము ఆగ్రాలో ఎంత వేగముగా పెరిగిందంటే అప్పుడప్పుడు బజారులో ఉప్పు పర్వతాలు ఏర్పడుతూ ఉండేవి. ప్రజలు ఎంతో ఉల్లాసముగా చేతులతో ఉప్పు తీసుతు వెళ్లుతుండేవారు. పూజ్య ఆచార్యులవారు ఈ సత్యాగ్రహ ఉద్యమమును రెచ్చగొట్టుటలో శ్రీ పాలీవాల్‌గారికి రెండు చేతులుగా సహకరించారు.

ఆగ్రా జిల్లాలో అక్కడ నుండి దాదాపు 4 కిలోమీటర్ల దూరములో జరార్ గ్రామము సత్యాగ్రహులకు ముఖ్య కేంద్రమైనది. దానిని కాంగ్రెస్ శిబిరము అని పిలిచేవారు. అప్పుడు ఆగ్రా కలెక్టర్‌గా శ్రీ విలియంసన్ ఉండినారు. గ్రామ

గాయత్రి ప్రధాన లక్ష్యం సత్ ప్రేరణల, సత్ ప్రవృత్తుల అభివృద్ధి.

జమీందారు శ్రీ సూరజ్‌పాల్ సింగ్ ఆంగ్లేయులకు చాలా అనుకూలముగా ఉండేవాడు. వారిని పిలిచి విలియంసన్ – 'కాంగ్రెస్ శిబిరమును జరార్ నుండి తొలగించకపోతే, నీ జమీందారీ పోతుంది జాగ్రత్త' అని బెదిరించారు. అప్పుడు శ్రీసూరజ్‌పాల్ సింగ్ తన గూండాలను తీసుకొని సత్యాగ్రహులను తీవ్రముగా కొట్టడం, కష్టపెట్టడం, మహిళలను అవమానపరచడం, నగలు దోచుకోవడం ప్రారంభించాడు. కాని సత్యాగ్రహులు కొంచెము కూడా చలించలేదు. ఒకరోజు శ్రీచంద్ దోనోరియాను తీవ్రముగా కొట్టారు. ఆయన మూర్ఛపోయారు. వారు చనిపోయారని భావించి వదిలివేశారు. అనేక నెలల వరకు వారు ఆ మూర్ఛలోనే ఉండి బ్రతికిబయటపడ్డారు.

ఈమధ్యలో పూజ్య ఆచార్యుల వారు, ఇతర సత్యాగ్రహులు శ్రీ రాంబాబు, టీకారామ్ పాలీవాల్ (పంజాబ్ సింహం), మూలచంద్, రామచంద్ర పాలీవాల్, అలీ ఠాకూర్, మేఘసింహ ఉమరేఠా, మురారీలాల్, గీతమ్ సింగ్ మొదలైన వారు సంఘర్షణ కొనసాగించారు. ఒకరోజు విలియంసన్ తన పోలీసు బలగాన్ని తీసుకొని ఆక్రమణ చేశాడు. ఒకవైపు సూరజ్‌పాల్ సింగ్ గూండాలు, మరోవైపున పోలీసులు, సత్యాగ్రహులను భయంకరముగా కొట్టారు. పూజ్య ఆచార్యుల వారి చేతుల్లో పతాకం చూచారు పోలీసు అధికారులు. వారిని ఎంత తీవ్రముగా కొట్టారంటే, వారు ఆ దెబ్బలకు మూర్ఛపోయి బురదలో పడిపోయారు. పతాకం మాత్రం నోటిలో ఉండిపోయింది. వారి గుండెలమీద కాలుపెట్టి పోలీసులు జండాను లాగగలిగారు. అదిగూడా చిరిగిన స్థితిలో. ఆచార్యులవారు రాత్రంతా బురదలో పడిఉన్నారు. ప్రజలు ఆయన చనిపోయారని భావించారు. వారిని డాక్టరు వద్దకు తీసుకువెళ్లారు. పతాకపు ముక్క అప్పటికి వారి నోటిలోనే ఉండిపోయింది. ఉపచారము చేసి, వారికి తెలివి వచ్చిన మీదటనే ఆ ముక్క తీయగలిగారు. అప్పటినుండియే వారి పేరు "మత్త్‌జీ" అనగా దేశప్రేమలో మత్తెక్కిన వారు" అనే పేరు వచ్చింది. అప్పటినుండి వారు ఈ పేరుతో పిలవబడసాగిరి. వైద్యము చేసే డాక్టర్లను కూడా రకరకాలుగా బాధించారు బ్రిటిషువారు. సత్యాగ్రహుల మీద కేసులు పెట్టారు. ఆచార్యులవారికి 6నెలల శిక్ష పడింది. అనేక అత్యాచారములు జరిగినప్పటికి జరార్ కాంగ్రెస్ శిబిరము పడగొట్టబడలేదు.

పూజ్య ఆచార్యుల వారు జైలు నుండి తిరిగి వచ్చే నాటికి, ప్రెస్ ఆర్డినెన్స్ ద్వారా "దైనిక్ సైనిక్" పత్రిక ప్రచురణ ఆపివేయబడినది. దానికి బదులుగా సైక్లోస్టైల్ ద్వారా 'సత్యాగ్రహ సమాచార్', 'సైనిక సహనాద్' మొదలగునవి ప్రారంభమయినాయి. అందుకు పూజ్య ఆచార్యుల వారు ఎంతో కృషిచేశారు. పరిపాలకులు అక్కడక్కడ దాడులు చేశారు, కాని ఎవ్వరినీ అరెస్టు చెయ్యలేకపోయారు. తరువాత అరెస్టులు జరిగాయి, జరిమానా విధించారు, శిక్షలు విధించారు. కాని పత్రికా ప్రచురణ కార్యమును ఏ విధముగాను ఆపలేకపోయారు.

పూజ్య ఆచార్యులవారు సమర్పిత భావముతో ఉద్యమాలలో పాల్గొనసాగారు. శ్రీమోతీలాల్ నెహ్రూగారి ఆహ్వానము మీద ప్రారంభమయిన విదేశీ వస్త్రములు, బ్రిటిష్ వస్తువుల బహిష్కారములో వారు చాలా ఉత్సాహముతో పని చేశారు. ఆగ్రా జిల్లా అన్ని జిల్లాల కంటే ముందుండి మత్తు పదార్థముల వాడకమునకు వ్యతిరేకముగా పికెటింగులు, కాపలాదారులద్వారా గుమాస్తాల ద్వారా రాజీనామాలు చేయించుట, కళాశాలలలో ధర్నాలు, బాలభారత సభ, గ్రామ, గ్రామ ప్రచారము, సమానాంతర ప్రభుత్వాలను స్థాపించుట చేసింది. కిరావలీకాండలో ఆచార్యులవారి భూమిక ఒక తపించిన సైనికుని వంటిది. ఈ ఉద్యమములో క్రియాత్మకత వలన వారు 5 ఏప్రిల్ 1932న ఖైదు చేయబడ్డారు. మే 16వ తేదీన వారికి 6 మాసముల ఖైదు 25 రూ॥ జరిమానా శిక్ష విధించారు.

H H H

**ఈశ్వరుడు అందరికీ శ్రేష్ఠమైన కర్తవ్యాలను ఇస్తాడు. వాటిని పాటించేవారి పట్లనే ప్రసన్నుడు అవుతాడు.**

# ముఖచిత్ర కథనం - 2

# బుద్ధావతారానికి పూరకం ప్రజ్ఞావతారం

## అవతారం పాత్ర

పరబ్రహ్మ యొక్క అవతార సత్తా కార్యరంగం అదృశ్య జగత్తు. యుగ సంతులనం, సమకాలీన సమాజాన్ని సంస్కరించడం, దుష్ట తత్వాలను నాశనం చేయడం - అనే పనులను ఆ సత్తా చేయిస్తుంది. దైవీ తత్వాలను చిరకాలంగా విస్తృతంగా కూడబెట్టిన వారిచేత ఆ పనులను చేయిస్తుంది.

ఎపుడెపుడు ఎలాంటి సమస్యలు ఏర్పడి సంతులనానికి భంగం కలిగించినా - తిరిగి సంతులనాన్ని స్థాపించడం కోసం సూక్ష్మ జగత్తునుండి ఒక దివ్య చేతన అవతరిస్తూ వచ్చింది. ఊగిసలాడుతున్న నావను కాపాడడానికీ, సుడిగుండాల నుండి దానిని తప్పించడానికీ అవతారాలు తమ కౌశల్యాన్నీ, పరాక్రమాన్నీ ప్రదర్శించాయి.

మనిషి ఉదయించనంతవరకు ఈ పని మత్స్యావతారం, కూర్మావతారం వంటి అవతారాలు చేశాయి. ఆ తర్వాత వికాస క్రమం పూర్తయినపుడు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు మున్నగు అవతారాల ద్వారా అవతార కార్యం పూర్తయింది. అవతారాలవలెనే ఋషిసత్తాలు కూడా ఈ కార్యాన్ని నిర్వహిస్తాయి. భువిపై కృతయుగ వాతావరణాన్నీ, సృష్టి సంతులనాన్నీ స్థాపించడానికి ఋషి స్థాయి కలిగిన సమర్థులైన వ్యక్తులు ఎన్నెన్నో మహత్తర కార్యాలు నిర్వహించారు.

## తొలిసగం ధర్మచక్ర పరివర్తన

సరైన ధర్మాన్ని స్థాపించడం, సజ్జనులను సంఘటితం చేయడం, వివేకానికి శిఖరాగ్ర స్థానం ఇవ్వడం - అనే ప్రవాహాన్ని బుద్ధ భగవానుడు ప్రజలలో ప్రవహింపజేశారు. ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి - అన్న శంఖనాదమే బుద్ధుని లీలా విశేషం. ఆయన పిలుపును అందుకుని - చిన్న సుప్రియనుండి అంబపాలి, ఆనందుడు, రాహులుడు, అశోకుని వరకు ఎందరెందరో వ్యక్తులు ముందుకు వచ్చారు. లక్షల సంఖ్యలో ధర్మ ప్రచారకులు పరివ్రాజకులుగా బయలుదేరారు. సంఘారామాలు స్థాపించబడ్డాయి. భావవిప్లవపు కాంతిపుంజం విశ్వం నలుమూలలకూ వ్యాపించింది.

ఆనాటి పరిస్థితులకూ నేటి పరిస్థితులకూ తేడా ఉంది. మారిన పరిస్థితులలో భగవానుడు కూడ ఆధారాన్ని మార్చవలసి వచ్చింది. విశ్వవికాసపు క్రమ వ్యవస్థకు అనుగుణంగానే అవతారపు స్థాయి, కార్యరంగం విస్తరిస్తూపోతాయి. విశ్వంలో సాధనాలు, కర్మ ప్రాధాన్యం వహించిన యుగంలో ఆయుధాల, సాధనాల సహాయంతో పని జరిగింది. నేడు నలువైపులా బుద్ధి తత్వానికి ప్రాధాన్యం ఉంది. దుర్బుద్ధితో సంపదనూ, సామర్థ్యాన్నీ, కౌశల్యాన్నీ దుర్వినియోగ పరచడమే మనకు నలువైపులా కానవస్తోంది. విజ్ఞాన వికాసం వల్ల ప్రపంచం చాలా చిన్నదయింది. మనుషులు పరస్పరం దగ్గర అయ్యారు. వేగం బాగా పెరిగింది. ఈ పరిస్థితిలో భగవానుడు యుగపరివర్తనచేతన రూపంలోనే అవతరిస్తాడు. ప్రజలందరి మనస్సులను మార్చగలిగేటంత విస్తృతంగా, ప్రజలందరి అంతః కరణలలో సద్భావనలను మేలుకొలిపేటంత విస్తృతంగా ఆ చేతన ఉంటుంది. అవిశ్వాసాన్ని ప్రతిఘటించడం అప్పుడే సాధ్యపడుతుంది.

బుద్ధుని బుద్ధివాదానికి పునాది భావవిప్లవం. దాని తొలి సగంలో ధర్మ చక్ర ప్రవర్తన జరిగింది. లక్షలాది పరివ్రాజకులు బుద్ధుని ఉద్యమాన్ని దేశ విదేశాలలో వ్యాప్తి చేశారు. మత వ్యవస్థను సంస్కరించే ఉద్యమాన్ని విశ్వవ్యాప్తం చేశారు. బుద్ధుని కార్యం పూర్తి కాలేదు. ఆ కార్యపు మలి సగం మిగిలి ఉంది. ప్రజ్ఞావతారం ఆ పనినే పూర్తి చేస్తోంది.

## మలిసగం ప్రజ్ఞావతారం పని

అవతారం అంటే మహాచేతన యొక్క అవతరణ. మానవ జాతి నేడు దుర్బుద్ధి వల్ల తన సర్వనాశనాన్ని తెచ్చుకుంటోంది. ఈ మానవ జాతిని సద్బుద్ధి వైపు మళ్లించడానికై 94 సంవత్సరాల పూర్వం నిష్కళంక ప్రజ్ఞావతారం జన్మ ఎత్తింది. ఇలాంటి దేవ మానవులనే ప్రవక్తలుగా, దేవదూతలుగా, అవతారాలుగా పరిగణిస్తారు. పెక్కు సహస్రాబ్దాలకు ఒకసారి వారు జన్మిస్తారు. వారు తాము ధన్యులు అవుతారు. తమ యుగాన్ని ధన్యం చేస్తారు.

## భావ విప్లవంగా అవతార ప్రక్రియ

బుద్ధికీ, తర్కానికీ ప్రాధాన్యం ఇచ్చే యుగంలో సమస్యలు

**ఇతరులకు కష్టం కలిగించి శతృత్వాన్ని పెంచే మానసిక పాపాలను పరిహరించు.**

కూడ చింతనకు సంబంధించినవే అవుతాయి. విశ్వాసాల, ఆలోచనల ప్రవాహంలోనే సమాజమంతా కొట్టుకుపోతూ ఉంటుంది. ఇలాంటి సమయంలో జనమానసం నుండి అవాంఛనీయతనూ, అనైతికతనూ, మూఢ నమ్మకాలనూ తొలగించే భావ విప్లవంగా అవతార ప్రక్రియ పని చేస్తుంది. అది యుగ సమస్యలను పరిష్కరిస్తుంది. కృతయుగాన్ని తిరిగి స్థాపిస్తుంది.

ఈ యుగంలో మహాభారత యుద్ధం చేతన రంగంలో జరిగింది. గాయత్రీ మహామంత్రం యొక్క ప్రేరణతో సద్భావాలతో నిండిన విశ్వాసాల నిర్మాణం, వికాసం జరిగాయి. వ్యక్తి యొక్క శీలం, చింతన ఎలా ఉండాలి, సమాజ వ్యవస్థ ఎలా ఉండాలి – అనే నిర్ణయం ఈ మహామంత్రం యొక్క విరాట్ విస్తరణ ద్వారా జరిగింది. దేవసంస్కృతికి జన్మ ఇచ్చిన దేవమాత గాయత్రి ఇప్పుడు పరమపూజ్య గురుదేవుల మహాప్రయాణం తర్వాత విశ్వమాత రూపాన్ని ధరిస్తోంది. ఇకముందు ఈ విషయం మరింతగా స్పష్టమవుతుంది. ఈ చింతన ఆధారంగా సుసంస్కృతమూ, సమున్నతమూ అయిన విశ్వం నిర్మాణం కాబోతున్నది.

## జనమానసంలోనికి ఋతంభర ప్రజ్ఞ

పరమపూజ్య గురుదేవులు ఋతంభర ప్రజ్ఞను – అనగా వివేకము శ్రద్ధల సముచిత సమ్మేళనాన్ని – ప్రవేశపెట్టారు. తర్కం, వాస్తవం, దూరదృష్టి – వీటి సముచిత సమ్మేళనం వివేకం. ఉత్కృష్టమైన ఆదర్శవాదాన్ని బోధించే ప్రగాఢ విశ్వాసం – శ్రద్ధ. వివేకం బుద్ధి యొక్క శిఖరాగ్ర స్థాయి. శ్రద్ధ అంతఃకరణయొక్క శిఖరాగ్ర సాఫల్యం.

సూక్ష్మ జగత్తులో ప్రవహించే ప్రచండమైన శక్తి ధారలు పైకి ప్రశాంతంగా, సామాన్యంగా కనిపిస్తాయి. వాటిలోపల అగ్నిపర్వతంలో ఉండే విస్ఫోటక శక్తి దాగి ఉంటుంది. ఆ అగ్నిపర్వతం బ్రద్దలైనపుడు – తలక్రిందులు అయినది తలక్రిందులు అవుతుంది; అవాంఛనీయత నిర్మూలం అవుతుంది; అంతా పరివర్తన చెందుతుంది. సూక్ష్మజగత్తులో పనిచేసే ఈ విలక్షణతనే అవతారం అని పిలుస్తారు.

అవతారం చేసే ప్రధాన కార్యం – తన లీలా కాలంలో దేవదూతలలో, దేవాంశ కలిగిన మహామానవులలో ఉన్నత స్థాయి ప్రేరణలను నింపడం. ఈ అదృశ్య కార్యకలాపాలు జాగృతాత్మలలో తరంగాలను నింపినపుడు – అవతారం యొక్క ఈ ప్రచండ ఆకాశం అసంతులనాన్ని సంతులనంగా మార్చితీరుతుందని తత్వదర్శులు చెపుతారు. నేడు అదే జరుగుతోంది. పరమపూజ్య గురుదేవులు తమ సూక్ష్మ సత్తా మార్గదర్శనంలో నిష్కళంక ప్రజ్ఞావతారం పాత్రను నిర్వహించారు. వారు ఒక ప్రచండమైన ఆలోచనా ప్రవాహాన్ని నిర్మాణం చేశారు. ఫలితంగా – శ్రద్ధ, వివేకాల సంగమం అయిన యుగ పరివర్తన చేతన యుగశక్తిగా వారి జీవితకాలంలోనే అవతరించింది.

## స్థూల శరీరానికి పరిమితం కాదు అవతారం

అయితే, అవతారం ఆలోచనా ప్రవాహం రూపంలో దిగివచ్చింది. కనుక, అది స్థూల శరీరానికే పరిమితమైనదని భావించకూడదు. ఆ సత్తా సూక్ష్మీకృతమై, ఘనీభూతమై విశ్వమంతటా వ్యాపించింది. ఆ సత్తా దారి తప్పినవారి బుద్ధిని సరిచేస్తోంది. బుద్ధి జీవులను శ్రద్ధా వివేకముల అవలంబనను స్వీకరించేటట్లు మలుస్తోంది. జాగృతాత్మల పరివారం విస్తరించడం, చింతన చేతన వ్యాప్తికావడం ఇందుకు ప్రమాణాలు. ఇదే నిష్కళంక ప్రజ్ఞావతారం. ఇదే దశమ అవతారం.

మహాపురుషుల లీలలు విలక్షణమైనవి. శ్రీకృష్ణుని వలె – పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య నీతిపురుషులు. వారు లోక కళ్యాణం కోసమై తమ కణకణం ఆహుతి చేశారు. ఉజ్వల భవిష్య నిర్మాణం కోసమై తమ ముక్తి విషయం ప్రక్కన ఉంచి, తమ 110వ సంవత్సరం (అనగా 2021) వరకు సూక్ష్మ కారణ శరీరాలలో మనమధ్య ఉంటానని వారు చెప్పి ఉన్నారు.

మనం ఆ మాటను విశ్వసించాలి. మనలోపల అలాంటి దృఢత్వాన్ని వికసింపజేసుకోవాలి. మనమధ్య ఉన్నట్లు వారి శక్తి నిరంతరం సంకేతం ఇస్తూనే ఉంది. మనం వ్యామోహానికి అతీతులం కావాలి. లోకకళ్యాణం కోసం, విద్యావిస్తరణ కోసం వారు కన్న కలలను నిజం చేయాలి. వాణిద్వారా, సాహిత్యం ద్వారా వారి ఆలోచనలను వ్యక్తివ్యక్తికీ అందించాలి. మన వ్యవహరణ ద్వారా, మన ఆచరణ ద్వారా వాటిలోని సత్యాన్ని ధృవపరచాలి. ఆ ఆలోచనలు ఆచరణ సాధ్యములని ఋజువు చేయాలి.

H H H

**ఇతరుల కోసం జీవించే వ్యక్తి, ఇతరులకు సేవ చేసే వ్యక్తి అక్షయ కీర్తిని పొందుతాడు.**

## ముఖచిత్ర కథనం - 3

# గురుదేవుల స్మృతులు - అద్భుత అనుభూతులు

### మహాత్మా ఆనంద స్వామి

మహాత్మా ఆనంద స్వామి ఆర్య సమాజం అగ్రనాయకులు. పరమపూజ్య గురుదేవులతో ప్రగాఢమైన ఆత్మీయ సంబంధం కలిగిన మహనీయులు.

స్వామీజీ తమ హరిద్వార్ పర్యటనలో శాంతికుంజ్ విచ్చేశారు. గురుదేవులు స్వయంగా వారిని శిబిరంలోనికి తీసుకువచ్చారు. వారిద్దరూ వేదికపై ప్రక్కప్రక్కన కూర్చున్నారు.

స్వామీజీ తమ ప్రసంగంలో తమ ఉత్తరాఖండ్ యాత్రను వర్ణించారు. గంగోత్రి ఎగువన ఉన్న ఏదో స్థలాన్ని గురించి చెపుతున్నారు.

ఒకరోజు ఉదయం ఆయన స్నానం, ధ్యానం ముగించుకుని మంచుతో కప్పబడి మనోహరంగా ఉన్న ఆ పర్వతాన్ని చూస్తున్నారు. ఒక్క స్థలంపై మాత్రం మంచు లేదు. అందుకు కారణం ఏమిటని ఆయన గైడ్‌ను అడిగారు. గైడ్ పదార్థ విజ్ఞానం ప్రకారం ఏదో కారణం చెప్పడానికి ప్రయత్నించాడు. కానీ స్వామీజీ దాన్ని నమ్మలేదు. అసలు కారణం తెలిస్తే చెప్పమని గైడ్‌ను నిలదీశారు.

ఈ స్థలంలో ఒకపుడు శివుడు తపస్సు చేశాడనీ, కనుకనే ఎంత మంచు కురిసినా ఈ స్థలంలో మంచు పేరుకోదనీ ఇక్కడ ప్రజల నమ్మకం - అనీ గైడ్ వివరించాడు. స్వామీజీకి నమ్మకం కలిగింది. ఆయన ఆ స్థలాన్ని పరీక్షగా చూచి 'అక్కడికి వెళ్లగలమా?' - అని అడిగారు. అది దుర్గమ ప్రదేశం - అని గైడ్ అభ్యంతరం చెప్పాడు. స్వామీజీ ప్రభావంవల్లనూ, ధనాశవల్లనూ - ఒత్తిడి చేయగా ఒప్పుకున్నాడు. రెండు గంటలు కష్టించి వారు ఎలాగో ఆ స్థలం చేరారు. ఈ సంఘటనను వర్ణించి, స్వామీజీ ఇలా అన్నారు-

'అక్కడకు చేరుకుని, ధ్యానానికి కూర్చుంటే - నాకు వీరు (ప్రక్కన ఉన్న గురుదేవులు) గుర్తుకు వచ్చారు'.

శివుని తపఃస్థలిలో గురుదేవులు ఎందుకు గుర్తువచ్చారు? పూజ్య గురుదేవులు చెప్పిన ఈ సంస్మరణలో దీనికి సమాధానం దొరుకుతుంది.

ఒకరోజున స్వామీజీ పూజ్య గురుదేవుల ఎదుట గాయత్రీ మహావిజ్ఞాన్‌లో ఇవ్వబడిన గాయత్రీ మంజరిని ఎంతగానో మెచ్చుకున్నారు. గాయత్రీ మంజరిలో శివ-పార్వతి సంవాదం రూపంలో గాయత్రీ విద్యపై వివేచన ఉన్నది. గాయత్రీ మహావిజ్ఞాన్ మూడవ భాగం ఈ మంజరికి వ్యాఖ్యయే.

స్వామీజీ ప్రశంస విని పూజ్య గురుదేవులు నవ్వసాగారు. స్వామీజీ ప్రశ్నార్థకంగా ఆయనవైపు చూచారు. ఆ చిరునవ్వు అంతరార్థం ఏమిటో తెలుసుకొనగోరారు. పూజ్య గురుదేవులు రహస్యం, హాస్యం కలగలిసిన ఈ వాక్యం చెప్పారు-

'స్వామీజీ! శరీరాన్ని వదలివేసిన వారి మాటలకే విలువ ఇవ్వబడితే - మేము కూడ ఒకరోజున శరీరం వదలి చూపుతాము'.

స్వామీజీ వంటి తపస్వి అయిన సాధకునికి ఈ సంకేతం వల్ల ఒక విషయం తెలిసింది. ఆచార్య శ్రీరామ్ శరీరంలో పనిచేస్తూన్న దివ్య చేతనను శరీరం దృష్టితో విలువకట్టలేము. శివుని తపస్థలిలో కూర్చున్నపుడు ఆయనకు 'ఆచార్యశ్రీ' గుర్తుకు రావడానికి కారణం ఇదే కావచ్చు. ఆచార్యశ్రీ శివుని చేతనకు ప్రత్యక్ష ప్రాతినిథ్యం వహిస్తున్నారని స్వామీజీకి అనుభూతి కలిగింది. కనుకనే ఆయన ఆచార్యశ్రీని ఆ భావంతోనే చూస్తూ వచ్చారు, ఆరాధిస్తూ వచ్చారు.

తాను సన్యాసి అయినా, ఆచార్యశ్రీ కన్న 25 సంవత్సరాలు పెద్దవారు అయినా - ఆయన ఆచార్యశ్రీకి ప్రణామం చేసేవారు. ఆచార్యశ్రీ వద్దన్నా, ఆయన ఎంతో అధికారంతో ఇలా అనేవారు-

'ప్రియమైన ఆచార్యజీ! నన్ను ఆపవద్దు. ఇది నా శ్రద్ధకు సంబంధించిన విషయం.'

**సత్‌సంకల్పాలను, సమర్థ సంకల్పాలను చేసేందుకు శిక్షణయే నిజమైన విద్య.**

## శ్రీ నిరంజన నాథ్ ఆచార్య

1969-70 నాటి సంఘటన. జయపూర్‌లో పెద్ద యజ్ఞం జరుగనున్నది. అక్కడి ప్రముఖ మహిళా కార్యకర్త శ్రీమతి చంద్రముఖీదేవి రస్తోగీ ఆ యజ్ఞానికి శ్రీ నిరంజననాథ్ ఆచార్యను ఆహ్వానించడానికి వెళ్లారు. శ్రీ ఆచార్య అప్పుడు రాజస్థాన్ శాసనసభ స్పీకరు. ఆయన గొప్ప విద్వాంసుడు, రచయిత, స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి. మత నాయకులని పిలువబడేవారి ఆడంబరాలను ఆయన నిశితంగా విమర్శించేవారు.

'బహిన్‌జీ! మీరు పొరపాటున ఇక్కడికి వచ్చారు. నేను నాస్తిక తరహా వ్యక్తిని.'

- అని ఆయన ఆమెతో అన్నారు. అందుకామె ఇలా జవాబిచ్చారు-

'భాఈ సాహబ్! నేను సరైన చోటుకే వచ్చాను. మీరు విశ్వాసవిహీనులు కారని నాకు తెలుసు. ఏ కారణం వల్ల మీరు నాస్తికుణ్ణని చెప్పుకుంటున్నారో ఆ కారణాలను తొలగించడం అవసరం. అలాంటి అవకాశం వచ్చింది. పూజ్య ఆచార్యజీ మథురనుండి వస్తున్నారు. మీరు యజ్ఞానికి తప్పక రావాలి.'

అలాంటి జవాబు వస్తుందని ఆయన ఊహించలేదు. ఆయన ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. యజ్ఞం సందర్భంగా ఆయన పరమపూజ్య గురుదేవులను కలుసుకున్నారు. వారి ప్రవచనం విన్నారు. వారితో వ్యక్తిగతంగా చర్చించారు. వారి శిష్యుడు అయినారు. ఆ తర్వాత గాయత్రీ తపోభూమికి వచ్చి గురుదేవుల వీడ్కోలు సమ్మేళనం నాలుగురోజులూ (1969 జూన్ 16నుండి 20) మథురలో ఉన్నారు. ఆయన ఆతర్వాత 'ఆచార్యజీకి సాన్నిధ్య మె' అనే గ్రంథం రచించారు. ఆ గ్రంథంలో మొదటి పుటలో దాన్ని సమర్పణ చేస్తూ వారిలా వ్రాశారు.

"నేను పూజ్య ఆచార్యజీ వద్దకు వచ్చాను - నా జ్ఞాన అహంకారంతో. ఆయన చరణాల వద్ద కూర్చున్నాను - నా శ్రద్ధనంతనూ సమర్పిస్తూ."

ఆ తర్వాత ఆయన పలుమారు శాంతికుంజ్ వచ్చి గురుదేవులను కలుసుకునేవారు. అపుడు ఆయన రాజస్థాన్ శాసనసభ స్పీకరు. ముఖ్యమంత్రి శ్రీహరదేవ్ జోషీ. ప్రతిపక్ష నాయకుడు శ్రీ భైరాన్‌సింగ్ శెఖావత్. ఆయన ఒకసారి వారిద్దరినీ తీసుకుని శాంతికుంజ్ వచ్చారు. పూజ్య గురుదేవులతోపాటు వారు ముగ్గురూ వేదికపై కూర్చున్నారు. అపుడుకూడ ఆయన ఇలా అన్నారు-

నేను మొదటిసారి ఆచార్యజీని కలుసుకున్నది అంత మంచి ఉద్దేశ్యంతో కాదు. అయితే ఆయన అద్భుత వ్యక్తిత్వం నన్ను ఆయనకు అనన్య అనుయాయిగా చేసింది.

## శ్రీ రంగనాథ మిశ్ర

పూజ్య గురుదేవుల గౌరవార్థం భారత ప్రభుత్వం తపాలా బిళ్లను విడుదల చేసింది. ఆ ఉత్సవంలో సుప్రీమ్ కోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ రంగనాథ మిశ్రా నాటి రాష్ట్రపతి డా॥శంకరదయాళ్ శర్మతో పాటు పాల్గొన్నారు. ఆ సందర్భంగా పూజ్య గురుదేవుల వ్యక్తిత్వంపై, కర్తృత్వంపై అందంగా ప్రసంగించారు. ఆ ప్రసంగంలో అధ్యయనం కనిపించింది. విశ్వాసమూ కనిపించింది.

ఆ తర్వాత-

భువనేశ్వర్, బ్రహ్మపుర్ అశ్వమేధ యజ్ఞాల సందర్భంగా శక్తి కలశాల స్థాపన యాత్రలో శ్రీయుతులు వీరేశ్వర ఉపాధ్యాయ, అశోక్ దాస్, డా॥అమల్ కుమార్ దత్తాల బృందం కటక్ వెళ్లారు. అప్పటికి శ్రీరంగనాథ మిశ్ర పదవీ విరమణ చేశారు. కటక్‌లోని తమ గృహంలో ఉన్నారు. బృందం సభ్యులు వెళ్లి వారిని కలుసుకున్నారు. ఆయన వారిని సాదరంగా స్వాగతించారు. వారితో మనసిచ్చి మాట్లాడారు.

తాను న్యాయవాదిగా ఉన్నపుడు మొదటిసారి పూజ్య గురుదేవులను ఎలా కలిసిందీ ఆయన ఆ సంభాషణలో వివరించారు. అపుడే వారీ మాట చెప్పారు-

"శరీరం వదలిన తర్వాత కూడా పూజ్య ఆచార్యజీ ఒకసారి నాకు మార్గదర్శనం చేశారు."

వివరాలు అడగగా వారిలా చెప్పారు-

నేనొక సమస్యలో మునిగి ఉన్నాను. పరిష్కారం లభించకపోవడంతో విచారిస్తున్నాను. అలా కూర్చుని ఉండగా కళ్లు మూతలు పడ్డాయి. పూజ్యవరులు ఎదుట కనిపించినట్లు

**తప్పులు ఎన్నడం సులువు. ఒప్పులను మెచ్చుకోవడం కష్టం.**

అనిపించింది. ఆయన నన్ను కలవరపెడుతూన్న విషయాన్ని పేర్కొని, నీవు ఎందుకు చింతిస్తున్నావు – అని అన్నారు. రెండు వాక్యాలలో దానికి పరిష్కారం చెప్పారు.

డా॥దత్తా ఇలా ప్రశ్నించారు –

'అది కల కావచ్చు కదా. భ్రమ కావచ్చు కదా.'

ఈ ప్రశ్నకు మిశ్రాజీ లోని చీఫ్‌జస్టిస్ మేలుకున్నాడు. ఆయన బల్ల గుద్ది ఇలా అన్నారు–

'కాదు. అది కలా కాదు, భ్రమా కాదు. అది అక్షర సత్యం అని నేను చెపుతున్నాను.'

డా॥ దత్తా ఇలా అన్నారు.

'మేమూ ఇది నిజమనే నమ్ముతున్నాం. కాని శాస్త్రవేత్తలు ఈ ప్రశ్న తప్పక వేస్తారు.'

అందుకు మిశ్రాజీ ఇలా అన్నారు–

'ఆ జవాబుతోపాటు ఒక శక్తి నాలో ప్రవేశిస్తూన్నట్లు నేను అనుభూతి పొందాను. భ్రమలో కాని, కలలో కాని అలా జరగదు. అది అక్షరాలా నిజం.'

## శ్రీ సత్యభక్తజీ

పూజ్య గురుదేవులూ, శ్రీ సత్యభక్తజీ ఒకరిని ఒకరు పండిట్‌జీ అని పిలిచేవారు. గాయత్రీ తపోభూమిలో వారిద్దరూ రచనకు సంబంధించి లోతైన విషయాలు చర్చించేవారు. అంతరంగ మిత్రుల వలె హాస్య వినోదాలతో వారు కబుర్లు చెప్పుకునేవారు.

సత్యభక్తజీ యువ దశనుండి కమ్యూనిస్టు సిద్ధాంతానికి సమర్థకుడుగా ఉంటూ వచ్చారు. మన దేశంలో మొట్టమొదటి అధికారిక కమ్యూనిస్టు మహాసభను ఆయన కాన్పూరులో నిర్వహించారు. భారత్‌లో చట్టం భారతీయ అధ్యాత్మ ఆధారంగా వికసించాలనీ, విదేశాల నమూనాలలో రూపొందకూడదనీ ఆయన నమ్మకం. కమ్యూనిస్టు పార్టీకి ఇది మ్రింగుడుపడలేదు. కనుక ఆయన ఆ పార్టీలో క్రియాశీలంగా పాల్గొనడం నిలిపివేశారు.

కాన్పూరు నుండి వెలువడే 'చాంద్', 'యుగవీర్' వంటి విప్లవ పత్రికలకు ఆయన సంపాదకులుగా పని చేశారు. సచీంద్రనాథ సాన్యాల్ వంటి విప్లవవీరులతో ఆయనకు ఆంతరంగిక సంబంధాలు ఉండేవి. చట్టానికి అందకుండా ఆయన విప్లవకారులకు సహాయం అందించేవారు. అచ్చమైన దేశభక్తుడు ఆయన. తన సేవకు ఎన్నడూ ప్రతిఫలం ఆశించని నిస్వార్థ జాతీయవాది ఆయన.

అది పూజ్య గురుదేవుల విలక్షణ వ్యక్తిత్వ ప్రభావం కావచ్చు. సత్యాన్ని గుర్తించడంలో సత్యభక్తజీకి గల అసాధారణ సామర్థ్య ఫలితం కావచ్చు. పూజ్య గురుదేవులను కలసిన తర్వాత ఆయన తమ జీవితమంతా మథురలోని గాయత్రీ తపోభూమిలో గడిపారు. పూజ్య గురుదేవుల యుగసాహిత్య సృజన కార్యంలో నిష్ఠగా సహకరించారు. పూజ్య గురుదేవులు వేదమూర్తి – సత్యరూపి. సత్యభక్తజీ నిజమైన సత్యభక్తుడు. వందనీయం అయిన జంట అది.

## దేవరహా బాబా

దేవరహా బాబా దేశంలోని అగ్రశ్రేణికి చెందిన సంత్. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలూ, రాజకీయ నాయకులు ఆయన ఆశీస్సులు పొందడానికి తహతహలాడేవారు. గాయత్రీ పరివార్ పరిజనులు వారి దర్శనం కోసం ఎప్పుడు వెళ్లినా, వారు ఎంతో సంతోషంగా వారందరికీ ప్రసాదాలూ, ఆశీస్సులూ ఇచ్చేవారు. పూజ్య గురుదేవుల గురించి అడిగినపుడు వారు ఎంతో భావోద్వేగంతో, ఎంతో గౌరవంతో మాట్లాడేవారు.

శాంతికుంజ్ కార్యకర్తలతో జరిగిన ఒక మహత్తర సమావేశంలో వారిలా అన్నారు–

"మీ గురువు శ్రీరామ్ కారు – స్వయంగా శ్రీరామచంద్ర భగవానుడే".

శాంతికుంజ్ వరిష్ఠ కార్యకర్తలు కొద్దిరోజుల తర్వాత వారిని మళ్లీ కలుసుకున్నారు. "పూజ్య గురుదేవుల గురించి చెప్పండి' – అని అడిగారు.

"మీరు ఆయన వద్దనుండి వస్తున్నారు కదా. మీరే చెప్పండి. నేనేమి చెప్పగలను" – అని ఆయన అన్నారు. పరిజనులు ఇలా అన్నారు –

"మా దృష్టి చాలా స్థూలమైనది. తమ దృష్టి సూక్ష్మమైనది.

**ప్రతిభలను మలచే సమర్థ వ్యవస్థ – శాంతికుంజ్.**

తమరు వారి గురించి మాకు చెప్పండి."

**బాబా ఇలా అన్నారు -**

**"నేను నా హృదయంలో ఎవరిని నిరంతరం ధ్యానం చేస్తున్నానో, ఆయనే మీ గురువు ఆచార్య శ్రీరామ్."**

బాబా శరీరాన్ని వదలిన తర్వాత వారి అనన్య శిష్యులు అయిన ఐ.ఏ.ఎస్ అధికారి మొదటిసారి శాంతికుంజ్ వచ్చారు. మాటల సందర్భంలో వారు పూజ్య గురుదేవులు శరీరం వదలిన తేదీ అడిగారు. తేదీ చెప్పిన తర్వాత ఆయన, విషయం ఇదన్నమాట – అన్నారు. వివరం అడగగా, ఆయన తన సంస్మరణ ఇలా వినిపించారు–

పూజ్య గురుదేవులు 1990 జూన్ 2న శరీరం వదిలారు. ఆ తర్వాత ఆ అధికారి బాబాను కలుసుకున్నారు. మాటల మధ్యలో బాబా ఇలా అన్నారు –

"ఇక శరీరాన్ని నిలిపి ఉంచాలని లేదు.'

"ఎందుకు?"

అని ఆ అధికారి అడిగారు.

అపుడు బాబా తమ చేయి పట్టుకుని లాగుకుంటూ ఇలా అన్నారు–

"ఇక ఈ చర్మాన్ని నిలుపుకుని ఏమి చేస్తాను? ఆత్మ వెళ్లిపోయింది కదా."

ఆ అధికారి ఇలా అడిగారు–

"మీరు చెప్పేది అర్థం కావడం లేదు. ఆత్మ ఎలా ఎక్కడికి వెళ్లింది?"

బాబా ఇలా అన్నారు–

"ఆ శ్రీరామ్ వెళ్లిపోయారు కదా.... ఇక ఈ శరీరాన్ని నిలుపుకుని ఏమి చేయాలి?"

ఆ తర్వాత కొద్దిరోజులకు బాబా శరీరం వదిలారు.

ఆ దివ్యప్రేమ వందనీయం. ఆ ప్రేమను అనుభూతి పొందిన మహా పురుషులు వందనీయులు.

## పూలమాల గాథ

ఆగ్రాకు చెందిన సక్రియ కార్యకర్త శ్రీ పన్నాలాల్ అస్థానా మహాపూర్ణాహుతి సందర్భంగా లక్షరూపాయలకు మించిన విలువగల యుగసాహిత్యాన్ని ప్రజలకు అందించారు. యుగ సాహిత్య ప్రసారానికి మీకింత ఉత్సాహం ఎలా కలిగింది? – అని ఆదరణీయ పండిత లీలాపత్ శర్మజీ ఆయనను అడిగారు. అందుకు అస్థానాజీ ఇలా జవాబు చెప్పారు.

1960 దశకంలో జరిగిన సంఘటన. అప్పుడు పూజ్య గురుదేవులు మథురలో ఉండేవారు. అవి చౌక రోజులు. శ్రీఅస్థానాజీ మథుర వచ్చారు. పూజ్య గురుదేవుల కోసం రెండణాలు ఇచ్చి ఒక మంచి పూలమాల కొన్నారు. ప్రణామం చేసి వారికి ఆ పూలమాల వేశారు. సంభాషణ సాగింది. పూజ్య గురుదేవులు ఉన్నట్టుండి ఇలా అడిగారు–

"బాబూ! ఈ పూలమాల ఎంతకు కొన్నావు?" రెండణాలకు కొన్నానని అస్థానాజీ చెప్పారు. అపుడు పూజ్య గురుదేవులు ఇలా అన్నారు–

"బాబూ! నీ రెండణాలు ఖర్చయ్యాయి. ఈ మాల నాకెందుకూ పనికిరాలేదు. ఆ రెండణాలతో నీవు నా చిన్న పుస్తకం కొని ఉంటే, పలువురికి నా భావాలు అందేవి. నీ డబ్బు సార్థకం అయ్యేది. ప్రజలకు మేలు జరిగేది. నాకూ సంతోషం కలిగేది."

పూజ్య గురుదేవులు అతిసహజంగా చెప్పిన ఈ మాటలు నా హృదయపు లోతులను తాకాయి. నా డబ్బు సార్థకం కావడం, జన కళ్యాణం, గురువుగారికి సంతోషం – మూడూ యుగసాహిత్య ప్రసారం ద్వారా తేలికగా సాధ్యపడతాయని నాకు బోధపడింది. మహాపూర్ణాహుతి సందర్భంగా జ్ఞానయజ్ఞాన్ని వేగవంతం చేయడానికై నేను యుగసాహిత్య విస్తరణ లక్ష్యాన్ని స్వీకరించాను. గురుకృపవల్ల సాఫల్యం లభించింది – అంటూ తన అనుభవాన్ని వర్ణించారు అస్థానాజీ.

## కృష్ణ పరమాత్మను వ్యక్తిలో దర్శించాను

1961–62 నాటి సంఘటన.

ఉత్తరప్రదేశ్ గవర్నరు శ్రీ విశ్వనాథ దాస్ మథురా – బృందావనం వచ్చారు. కుతూహలం కొద్దీ గాయత్రీ తపోభూమికి వచ్చారు. పూజ్య గురుదేవులు వారికి స్వాగతం చెప్పారు. సంస్థను

**దైవభక్తుడు భావ దాస్యాన్ని సహించడు, అంగీకరించడు.**

పరిచయం చేశారు. తాము వ్రాసిన గ్రంథాలను ఆయనకు సమర్పించారు. శ్రీదాస్‌కు హిందీలో మాట్లాడడం అంతగా రాదు. వారు ఇంగ్లీషులో మాట్లాడారు. శ్రీ దర్శన్‌లాల్ అగర్‌వాల్ దానిని హిందీలోకి అనువదించారు. శ్రీదాస్ ఇలా అన్నారు-

। నీబిఖీలి రీలిలిటీ ఉలిజీఖి ఎజీరిరీనీటీబి రిటీ చీలిజీరీలిటీ శిలిఖిబిగి. నేను నేడు వ్యక్తిలో కృష్ణపరమాత్మ దర్శనం చేసుకున్నాను.

## శరీరానికి విశ్రాంతి, చేతనకు పని

నేను మథుర వదలివెళ్లేవరకు (1971 జూన్) మీరు ఖాయంగా ఈ శరీరంలో ఉంటారు.

-అని పూజ్య గురుదేవులు కొందరు పరిజనులకు స్పష్టంగా మాట ఇచ్చారు.

వీడ్కోలు కార్యక్రమాల కోసం పూజ్య గురుదేవులు వరుసగా పెక్కు రోజులు పర్యటిస్తూ వచ్చారు.

ఇలా వారు మథురలో లేని సమయంలో ఆ మాట తీసుకున్న వారిలో ఇద్దరి (జయపూర్‌కు చెందిన శ్రీమతి చంద్రముఖీదేవి రస్తోగీ భర్త, భోపాల్‌కు చెందిన శ్రీరామచరణ్ రాయ్‌లు) పరిస్థితి విషమంగా ఉన్నదని తెలుపుతూ ఉత్తరాలూ, టెలిగ్రామ్‌లూ మథురకు వచ్చాయి. ఇద్దరూ తీవ్రమైన గుండెజబ్బుతో ఇబ్బంది పడుతూన్నవారే. రెండుమూడురోజుల తర్వాత పూజ్య గురుదేవులు ఉదయంపూట పర్యటననుండి మథురకు తిరిగి వచ్చారు. వారికీ విషయం తెలిసింది. వారు కొద్దిగా ఆలోచించి, విచారంతో కూడిన స్వరంతో ఇలా అన్నారు-"ఈ ఇద్దరికీ ఈసారి వచ్చిన గుండెపోటు ప్రాణాంతకం కాకూడదు." స్నానం చేస్తూ, భోజనం చేస్తూ-వారు పలుమారులు ఈ మాటలు అన్నారు. ఆతర్వాత నియమం ప్రకారం భోజనం తర్వాత విశ్రాంతి కోసం వెళ్లారు-గంట తర్వాత కలుసుకోండి అని చెప్పి.

కార్యకర్తలు గంట తర్వాత కలసినపుడు వారు స్పష్టంగా ఇలా అన్నారు-

"నిశ్చింతగా ఉండండి, అంతా చక్కబడుతుంది - అని టెలిగ్రామ్‌లు ఇవ్వండి, ఉత్తరాలు వ్రాయండి."

అలాగే జరిగింది.

ఆరోజు మధ్యాహ్నం నుండి ఆ ఇద్దరి ఆరోగ్యం మెరుగయిందని ఆ తర్వాత తెలిసింది.

ఉదయం 7-30కు పూజ్య గురుదేవులు తమ గదిలో కార్యకర్తలకు మార్గదర్శనం చేస్తున్నారు. ఢిల్లీనుండి ట్రంక్‌కాల్ వచ్చిందని క్రిందినుంచి కబురు వచ్చింది. ఒక కార్యకర్త వెళ్లి మాట్లాడారు. శ్రీ శివశంకర గుప్త (నాటి ట్రస్టీ, న్యాయసలహాదారు) నిన్న మధ్యాహ్నం 11 గంటలకు స్పృహ కోల్పోయారు, నేటి ఉదయం వరకు స్పృహ రాలేదు అని ఆయన తిరిగి వచ్చి చెప్పారు.

ఆ మాట విన్న పూజ్య గురుదేవులు, "నేటి సంభాషణ ఇక్కడే ఆపివేద్దాం" - అన్నారు. ఆ తర్వాత వారు నియమం ప్రకారం వందనీయ మాతాజీ వద్దకు వెళ్లి భోజనం చేశారు. విశ్రాంతి కోసం పడుకున్నారు.

ఆ తర్వాత వివరాలు తెలిశాయి. శ్రీ శివశంకర్‌జీకి మామూలుగా స్పృహ తప్పలేదు. అది బ్రెయిన్ హెమరేజ్. కుటుంబ సభ్యులకు ఆ సంగతి తెలియదు. మామూలు వైద్యునికి చూపించారు. ఫలితం కోసం ఎదురు చూస్తున్నారు. సాయంత్రం అయింది. రాత్రి గడిచింది. స్పృహ రాలేదు. ఉదయం పూజ్య గురుదేవులకు ఫోన్ చేశారు. వారిలో ఒకరు హరిద్వార్ బయలుదేరారు.

ఫోన్‌లో ఆ వార్త అందుకుని, పూజ్య గురుదేవులు విశ్రాంతి తీసుకుంటూన్న సమయంలో శ్రీ శివశంకరజీకి స్పృహ వచ్చింది. ఆయన కళ్లు తెరిచారు. ఏమీ మాట్లాడలేదు. నొప్పి ఎక్కడ ఉందని అడిగితే, తల చూపించారు. ఆసరా ఇస్తే కూర్చున్నారు. టీ కావాలా అని అడిగితే కావాలని తల ఊపారు. టీతో పాటు ఒకటి రెండు బ్రెడ్ ముక్కలు తిని పడుకున్నారు. మళ్లీ స్పృహ కోల్పోయారు.

ఆ తర్వాత ఆయనకు చాలా రోజులు చికిత్స జరిగింది. ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఆయన కోలుకున్నారు. డాక్టర్లు విస్తుపోయారు.

అయితే, పై రెండు సంఘటనల వల్ల యుగఋషి విశ్రాంతి ఎలాంటిదో స్పష్టమయింది. శరీరానికి విశ్రాంతి ఇచ్చి, వారు చేతన స్థాయిలో ఎలాంటి కార్యాలు సాధిస్తారో స్పష్టమయింది.

H H H

**కర్తవ్య పాలనలో హిమాలయంగా దృఢంగా నిలచే వ్యక్తి ఈశ్వరునికి ఇష్టుడు.**

## మనం-మన ఆరోగ్యం

# ఆరోగ్యానికీ, దీర్ఘాయువుకూ దివ్య ఔషధం - తేనె

తేనె విశిష్టమైన ఔషధీయ గుణాలలో నిండిన ఒక ఆహార పదార్థం. శరీర ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చూసినట్లయితే - ఇందులో ఉండే విటమిన్లు, రసాయనాలు చాలా విలువైనవి. తేనె యొక్క రసాయన విశ్లేషణ గురించి తెలిసిన నేటి సాంకేతికయుగంలో కూడా దానిని తయారుచేయడం మనిషికి సాధ్యం కావటం లేదు. దానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని ప్రకృతి తేనెటీగలకు మాత్రమే ప్రసాదించింది. ఈ తేనెటీగల పెంపకం ద్వారా ప్రజలకు ఉపాధి దొరకటమే కాకుండా పరిశుద్ధమైన, స్వచ్ఛమైన, పౌష్టిక గుణాలున్న తేనెను కూడా వారు పొందగలుగుతారు.

### తేనెలో విలువైన పోషక పదార్థాలు

ప్రకృతి మనకు అందించిన హానిరహితమైన పూర్ణ ఆహారం తేనె. ఇందులో ఒక్క కొవ్వు పదార్థాలు మాత్రమే లేవు. పాలతో తీసుకొన్నపుడు దీనిని పరిపూర్ణ ఆహారంగా పరిగణించవచ్చు. తేనెలో ఇనుము, రాగి, మెగ్నీషియం, పొటాషియం, ఫాస్పరస్, కాల్షియం వంటి ఖనిజ లవణాలతో పాటుగా ఎంతో విలువైన విటమిన్లుకూడా ఉన్నాయని వైజ్ఞానికుల పరిశోధనవల్ల రుజువైంది. పంచదారతో కూడిన క్షారపదార్థాలు, ధాతుపదార్థాల సమ్మేళనం తేనె. కాని, ఇందులోని 75 శాతం పంచదార చెరకు ఫాక్టరీల ద్వారా తయారై మనం వాడుకునే మామూలు పంచదార కాదు - ద్రాక్ష పండ్ల రసాల నుండి ఉత్పత్తి అయ్యే ఫ్రక్టోజ్ పంచదార. ఈ పంచదార రోగి ఆరోగ్యం మీద ఎటువంటి దుష్ప్రభావాన్నీ కలిగించదు. కాని మామూలు పంచదార అనారోగ్యానికి దారితీస్తుంది. తేనెలో ఉన్న ద్రాక్ష చక్కెర చాలా తొందరగా అరిగే గుణాన్ని కలిగి ఉంటుంది.

ఒక తేనెటీగ ఒక పౌను తేనెను తయారుచేయటం కోసం 300 నుంచి 400 పౌనుల పూలరసాన్ని ప్రోగు చేసుకోవలసి ఉంటుంది. తన బరువులో సగం బరువుగల పూలరసాన్ని మోసుకుంటూ 4000 మైళ్లు ప్రయాణం చేయాల్సిఉంటుంది. పువ్వు కనిపించగానే తేనెటీగ తన నాలిక సహాయంతో దానినుంచి రసాన్ని సేకరించి తన తేనె సంచీలో ప్రోగుచేస్తూ ఉంటుంది. రోజంతా పూలరసాన్ని సేకరించడంతోపాటుగా దానిని తేనెకింద మార్చడానికి సమాయత్తమవుతుంది.

ప్రసిద్ధ రసాయన శాస్త్రవేత్త పి.ఇ. నేరిస్ అభిప్రాయం ప్రకారం - తేనె కేవలం పూలరసం మాత్రమే కాదు. వాస్తవానికి - ఇది కష్టించి పనిచేసే స్వభావానికి నిదర్శనం. దాని ఫలితంగా మామూలు పూలరసం తేనె కింద పరివర్తన చెందుతోంది.

తేనెను చిక్కగా తయారుచేయటం కోసం తేనెటీగ తన తలను క్రిందకు వంచి విసనకఱ్ఱ మాదిరిగా విసురుతూ ఉంటుంది. ఇందువల్లే మనం డాబా మీదకు వెళ్లినపుడు మధురమైన సంగీతం ఈ తేనెటీగల నుండి వినిపిస్తూ ఉంటుంది. దీనివల్ల మనసుకు ఆనందం కలగటమే కాకుండా వాతావరణం ఆహ్లాదకరంగా తయారవుతుంది. ఈ సంగీతం వల్ల ప్రయోజనం అటుంచి, తేనెటీగల కఠోర పరిశ్రమ మనకు ఈ ఆర్యోక్తిని ఎప్పుడూ గుర్తుచేస్తూ ఉంటుంది. - "శ్రమ ఫలితం ఎప్పుడూ మధురంగానే ఉంటుంది."

### అద్భుతమైన టానిక్

కఠిన శ్రమవల్ల లభించిన కారణంగా తేనె పౌష్టిక విలువలతో కూడినది. తొందరగా అరిగే గుణాన్ని కలిగి ఉండటమే కాకుండా, శారీరక బలహీనతను దూరం చేస్తుంది. కాయకష్టం చేసేవాళ్లకు ఇది శక్తిని ప్రసాదించి వారిని ఉత్సాహవంతులుగా తయారు చేస్తుంది. ఇది జీర్ణకోశంలోకి

**అంతరంగాన్ని మార్చే గురుకులం - శాంతికుంజ్.**

చేరగానే తొందరగా అరిగిపోతుంది. జీర్ణవ్యవస్థకు ఎక్కువ పని కల్పించదు.

తేనెను ఆయుర్వేదంలో ఔషధంగా అభివర్ణిస్తూ ఉంటారు. దీనిని ఆయుర్వేద వైద్యులు తమ మందులతో పాటు అనుపానంగా వాడుతూ ఉంటారు. ఈ అనుపానం హానిలేనిది; మృదువైనది. ఇది కఫాన్ని పోగొట్టి ప్రాణశక్తిని పెంచుతుంది. ఇందులో విశిష్టగుణాలున్న ఆల్కహాల్, ఇథీరియల్ ఆయిల్ ఉన్నాయి. ఇవి ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు చాలా లాభకారి అని నిరూపితమైంది. టైఫాయిడ్, న్యూమోనియాలతో బాధపడుతున్న రోగులు తేనెను తీసుకున్నట్లయితే, అది వారి కాలేయం, ప్రేవుల సామర్థ్యాన్ని పెంచుతుంది. పుండ్లు, కాలినప్పుడు ఏర్పడే బొబ్బలు, క్రిమి కీటకాలు కుట్టడం వల్ల ఏర్పడే దద్దుర్లు మానటానికి యూరప్‌లో తేనెను ఉపయోగిస్తున్నారు. ప్రయోగాల ఫలితంగా నిరూపితమయినదేమిటంటే - గట్టి దెబ్బల మీద తేనెపట్టీ వేసి కట్టినట్లయితే గాయం తొందరగా మానిపోవటమే కాకుండా సూక్ష్మక్రిములు కూడా చేరవు.

తేనె విశిష్ట గుణాలున్న ఒక టానిక్. డా॥ కెలోగ్ అభిప్రాయం ప్రకారం - శారీరకంగా ఎదుగుదలలేని పిల్లలకు తేనెను పాలలో కలిపి ఇచ్చినట్లయితే, వారి శారీరిక వికాసం సహజంగా జరుగుతుంది. వృద్ధాప్యంలో చలి ఎక్కువ బాధపెడుతుంది. ఎన్ని రగ్గులు, రజాయిలు కప్పుకున్నా కాళ్లు, చేతులు చల్లగానే ఉన్నట్లయితే - ఆ వ్యక్తి పాలలో తేనెను కలిపి తీసుకుంటే శరీరం వెంటనే వేడెక్కుతుంది. స్థూలకాయం, మలబద్ధం, రక్తహీనతలతో బాధపడుతున్నవారు తేనె షర్బత్‌ని తీసుకున్నట్లయితే కొద్దిరోజుల్లోనే వారికి ప్రయోజనం కలుగుతుంది.

పౌష్టిక గుణాలతో పాటుగా తేనెలోని ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - రోగకారక క్రిములు తేనె సంపర్కంలోకి రావటంతోనే క్షీణించిపోతాయి. నిస్తేజమవుతాయి. క్రిమి కీటకాల ద్వారా సంక్రమించే అన్ని రోగాల్లో తేనె చాలా ఉపయోగికారి అని నిరూపించబడింది. శ్వాసకు సంబంధించిన జబ్బులలో, డిసెంట్రీలో రోగకారక క్రిములు తేనె సంపర్కంలోకి వచ్చిన 48 గంటలలోనే చనిపోయాయని డాక్టరు స్టువార్ట్ తన పరిశోధనల అనంతరం తేల్చి చెప్పాడు. క్షయ వ్యాధిగ్రస్తులు తేనెతో కూడిన పంచామృతాన్ని సేవించి వ్యాధినుండి తమను తాము కాపాడుకోవచ్చని వైద్యగ్రంథాలలో చెప్పబడింది.

## తేనెతో దీర్ఘాయువు

తేనెతో పాటు ఔషధాన్ని సేవించినట్లయితే దాని ప్రభావం రెండింతలవుతుంది. ఇది రక్తంలోని ఎఱ్ఱకణాలు, హిమోగ్లోబిన్‌ల మధ్య సమన్వయాన్ని స్థాపిస్తుంది. ఇది హృదయాన్ని ఉత్తేజపరచటమే కాకుండా దానికి వేడిని అందించే మూలకంగా పని చేస్తుంది. ఎడిన్‌బర్గ్‌కి చెందిన డా.జీ.ఎన్. డబ్ల్యూ. థామస్ తేనెలోని ఈ గుణాన్ని ప్రశంసించారు.

తేనె ఎల్లప్పుడూ ఉపయోగపడటమే కాకుండా, ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండే లక్షణాన్ని కలిగి ఉంది. తేనె ఎంత పాతదయితే దానిలో ఉండే గుణాలు అంతగా పెరుగుతాయి. గ్రీకు సాహిత్యం ప్రకారం అలెగ్జాండర్ శవాన్ని, రాజధాని తీసుకువెళ్లేలోపు పాడవకుండా ఉండటం కోసం, తేనెతో నింపిన ఒక పెద్దకుండలో ఉంచారు. అమెరికాకు చెందిన పురాతత్వ శాస్త్రవేత్త డా.టి.డేవిడ్ తన తవ్వకాలలో భాగంగా మహారాజు లూయిజ్ సమాధి త్రవ్వినప్పుడు తేనెతో నిండిన ఒక పెద్ద కుండ దొరికింది. కాని దాని సహజ గుణంలో ఏమీ మార్పు రాలేదు. ఆ సమాధి 3300 సంవత్సరాల క్రితం మూయబడింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - ఇన్ని వందల సంవత్సరాల అనంతరం కూడా దాని రుచి, గుణాలు లోపించలేదు.

ప్రపంచంలోని 100 సంవత్సరాలు పైబడిన వయస్సుగల వ్యక్తులు తమ సుదీర్ఘ జీవనానికి కారణం ప్రకృతికి అనుగుణమైన సామాన్య దైనందిన జీవితం, ఆహారం, అలవాట్లు,

**తనకన్న చిన్నవాళ్ల కోసం ఏమి చేస్తాడు అనేది వ్యక్తి గొప్పతనానికి గీటురాయి.**

సంయమనమనీ, నియమితంగా తేనెను స్వీకరించడం కూడా అందుకు ఎంతో దోహదకారి అయిందని వివరించారు. పైథాగరస్ తన 90 సంవత్సరాల దీర్ఘాయుష్షు రహస్యం తేనె అని పేర్కొన్నాడు. తేనె ఆరోగ్యంతో పాటుగా దీర్ఘాయుష్షుని ప్రసాదిస్తుందని డెమోక్రటిన్, అరిస్టోక్రాట్ అంటూ ఉండేవాళ్లు. ఎవరెస్ట్ శిఖరాన్ని మొట్టమొదటిసారిగా అధిరోహించిన సర్.ఎడ్‌మండ్ హిల్లరీ స్వయంగా తేనెటీగలను పెంచేవాడు. ఆ శిఖరాన్ని అధిరోహించటానికి ఆయనకు సహకరించిన షేర్పా టిన్సింగ్ ప్రతిరోజూ నియమితంగా తేనెను స్వీకరించేవాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన డా.రెనోటెడ్ ఆస్టిన్ 30 రోజుల తేనెకల్పాన్ని పూర్తి చేసిన తరువాత నవయువకుడి మాదిరిగా శక్తిని, ఉత్సాహాన్ని పొందాడు. ఆయన అందరికీ ఈ విధంగా సలహా ఇచ్చాడు – మిఠాయిల స్థానంలో తేనెను తీసుకోండి; పాలతో పాటుగా తేనెను తీసుకోండి; పంచదారకు బదులుగా తేనెను వాడండి. భారతీయ మల్ల యోధుడుగానూ, బరువులు ఎత్తటంలోను ప్రపంచ ప్రసిద్ధిని గడించిన ఛాంపియన్ జిమ్ లెండీబ్, 26 సంవత్సరాల ప్రపంచంలో వేగంగా పరుగెత్తటంలో రికార్డులకెక్కిన డబ్ల్యూ.డి.జార్జ్ మొదలైన వారు తేనెను రుచి కారణంగానే తమకు ఇష్టమైన పదార్థంగా భావించలేదు. ఇటువంటి పెద్ద ప్రయత్నాలకి అవసరమైన శక్తి తేనె ద్వారానే లభించిందన్నది వారి దృఢ విశ్వాసం.

మైక్ ఫైడెన్ వివిధరకాలైన ఆహార పదార్థాలు స్వీకరించి వాటివల్ల తన శరీరం మీద పడే ప్రభావాన్ని విశ్లేషించారు. అటువంటి ఒక ప్రయోగంలో కేవలం ఒక గ్లాసు తేనెతో కలిపిన మంచి నీళ్లను తీసుకొని, తన ఇంటినుంచి 23 మైళ్ల దూరాన్ని చెప్పులు లేకుండా చుట్టివచ్చాడు. సుప్రసిద్ధ సాహిత్యవేత్త బెర్నార్డ్ షా తేనెను స్వీకరించి రచనకు పూనుకునేవారు. చర్చిలలో పాలు, తేనెలను సమర్పణకు చిహ్నాలుగా భావించేవారు. ఇందువల్లే క్రైస్తవులకు సంబంధించిన ధార్మిక క్రియాకలాపాలలో తేనెను వినియోగించేవారు. భారతీయులలో కూడా మధుపర్కంతో స్వాగత సత్కారాలు జరపటం ఆనవాయితీగా వస్తోంది.

### తేనెటీగల పెంపకం ప్రయోజనకరం

వాస్తవానికి – తేనె వంటి ఉపయోగకరమై, పౌష్టిక గుణాలలో కూడి, తొందరగా అరిగే ఆహార పదార్థం మరొకటి లేదు. మంచి ఆరోగ్యంకోసం దీనిని స్వీకరించాలి. మనకు శుద్ధమైన, స్వచ్ఛమైన తేనె లభించాలంటే – మనం కూడా ఎడ్‌మండ్ హిల్లరీలాగా తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించాలి. దీనివల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించటమే కాకుండా, స్వచ్ఛమైన తేనె అందరికీ అందుబాటులోకి వస్తుంది. దీని పెంపకంలో కూడా ఎటువంటి ఇబ్బందులూ ఉండవు. మొదట్లో దీనికి సంబంధించిన విషయాల గురించి కొద్దిగా తెలుసుకొని పెంపకాన్ని ప్రారంభించవచ్చు. అందువల్ల తేనెటీగల పెంపకాన్ని మనం చేపట్టటమే కాకుండా మిగతా వారందరినీ ఇందుకోసం ప్రోత్సహిద్దాం.

అనువాదం : ఉషా సుందరి

H H H

## సమాజ రథ చక్రాలు

ఇజ్రాయేలులో విమానాలు నడిపేవారు, చైనాలో ట్రైన్ డ్రైవర్లు సహజంగా మహిళలే అయి ఉంటారు. బ్రిటన్, అమెరికాలలోని అనేక పారిశ్రామిక సంస్థలలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ఉంటారు. నెమ్మది నెమ్మదిగా అనేక దేశాలలో వారికి పురుషులతో సమానంగా బాధ్యతలు, అధికారాలు అప్పగిస్తున్నారు. ఇందువలన అక్కడి ప్రభుత్వాలకు ప్రజల, సామాజిక సంస్థల సహకారం లభిస్తుంది. ఇది అవసరం కూడా. స్త్రీలు పురుషులు సమాజ రథానికి రెండు చక్రాల వంటివారు. ఏఒకరు లేకపోయినా రెండవవారి, సమాజం యొక్క సమగ్ర ప్రగతి సంభవం కాదు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**సాధన సంపత్తి లోపించినవాడు కాక – తృష్ణ పెరిగిన వాడు పేదవాడు.**

గాంధీ జయంతి వ్యాసం

# వర్ణాశ్రమ ధర్మాలను జీర్ణించుకున్న యుగపురుషుడు

బక్కమనిషి, పొట్టివాడు, దుర్బల శరీరుడు. భౌతిక విగ్రహమెవ్విధమున చర్మచక్షువులకు ఆకర్షణీయముగ నుండదు. కాని యా యల్పోపాధి యందేదియో యొక దివ్యజ్యోతి, ఒక యద్భుత శక్తి, ఒక పవిత్ర భావము జ్వాజ్వల్యమానముగ బ్రకాశించి, ప్రపంచ దృష్టినంతను ఆకర్షించుచున్నది. సోదర భారతీయులే కాదు, ఖండాంతరులు సహితము, జాతీయ దురహంకారవశులైన పాశ్చాత్యులు కూడ నీతనిని లోకోత్తర పురుషునిగ భావించుచున్నారు. రవి యస్తమించని అఖండ సామ్రాజ్యమునకు అధిపతులైన బ్రిటిషు రాజ్య తంత్రజ్ఞులును వీని విచిత్రగతులను దెలిసికొనజాలక నిశ్చేష్టులై వెలవెల బోవుచున్నారు. ఫ్రెంచి భావవిదులు, జర్మను తత్వశాస్త్రజ్ఞులు, రష్యను సామ్యవాదులు, అమెరికను స్వాతంత్ర్యప్రియులు, వీరు వారననేల, వర్తమాన కాలమున విశాల దృష్టితో మానవధర్మ నిరూపణమును గావింప జూచుచున్న వైజ్ఞానికులలో నీ మహనీయుని ఆత్మకథను బఠించి విస్మయచిత్తులు కానివారు లేరు. కాని సోదర భారతీయులు వాక్కుతో బ్రశంసించుచున్నను, వాని జీవితమువలన నీ దేశమునకును, తద్వారమున లోకమునకంతకును, జేకూరు పూర్ణ ప్రయోజనమును స్వీకరింపగల భక్తి విశ్వాసములను జూపలేకుండుట శోచనీయము.

అవతార పురుషుల మహిమ సమకాలికుల కంతగ బోధపడని మాట నిజమే. శ్రీకృష్ణుని లీలలు యశోదమ్మకే తెలియలేదు. అర్జునుడు సహితము సంశయాత్ముడయ్యెను. శ్రీరామచంద్రుని అవతార రహస్యము నే శబరియో తప్ప యితరులు చూడలేకపోయిరి. బుద్ధభగవానుని కరుణాస్వరూపము సమకాలికులకు అగోచరమయ్యెను. ఏసునాథుని ఈశ్వరరాజ్య సంస్థాపనా ప్రయత్నము రాజద్రోహ దోషముగ నిరూపింపబడెను. ఉదార చరితుల కథయంతయు నిట్టిదే. సమకాలికుల దృష్టి పూర్వ సంప్రదాయముల నతిక్రమించి భావికాల గర్భమున దాగియున్న పరిణామమును తిలకింపజాలదు. ఎట్టి మేధావులైనను వర్తమాన పరిస్థితులనుండి తప్పించుకొని ప్రకృతియొక్క అంతరంగము నుండి నూతనముగ బయల్వెడలనున్న క్రొత్త సృష్టిని క్రొత్త రూపములను ఊహింపనేరరు. ప్రచలితములై యున్న సంస్థలు, సంప్రదాయములు, సిద్ధాంతములు స్థిరములు కావని నమ్ముటకు మనస్సు సామాన్యముగ నొప్పుకొనదు. పరంపరానుగతములైన నమ్మకములు, మతములు, ఆశయములు మనస్సును బంధించివైచి సంకుచిత మార్గమున నీడ్చుకొని పోవుచుండును. "బుద్ధిః కర్మానుసారిణి"యను ఆర్యోక్తి వ్యక్తి విషయములోనే కాక జాతి విషయములో గూడ సత్యము. కొందరు పూర్వాచారములకు దాసులు. కొందరు నవీన పరివర్తనములకు బానిసలు. ఉభయుల బుద్ధులును సమముగ అస్వతంత్రములే. భూత వర్తమాన పాశములనుండి విముక్తులై భవిష్యత్తున ఉదయింపనున్న మానవ కళ్యాణమును హృదయస్థము చేసికొని తదాగమనము కొరకు లోకమును సంసిద్ధపరుప గోరువారు చాల యరుదు. వారే యవతార పురుషులు. నిజమైన లోకోద్ధారకులు.

అవతార పురుషుడనుడు, మహాపురుషుడనుడు, మహాత్ముడనుడు–ఏ పేరైన నేమి: కావలసినది వాని స్వరూపము, వాని యాంతర్యము, వాని విశేషము. ఏ వస్తువు యొక్క విలువనైనను గట్టుట కొక ప్రమాణ మవసరము. ఒక పురుషుని స్వరూపమును నిర్ణయించుటకు గూడ నొక ప్రమాణము అవసరమని వేరుగ జెప్పనక్కరలేదు. అట్టి సర్వజన సమ్మతమైన ప్రమాణమొకటి కలదా? పురుషుని రూపము ఆదికాలముననే, వేదమునందే ఒక రూపకాలంకారములో వర్ణింపబడియున్నది. పురుషులకెల్ల మూలపురుషుడగు విరాట్పురుషుడు సమస్త

చేయదగిన పని పూర్తయిందా లేదా అని చూడు. జనం ఏమనుకుంటున్నారు అని చూడకు.

జాతులకు, సమస్త గుణకర్మలకు ఆధారభూతుడుగ చిత్రింపబడి యున్నాడు. వాని ముఖము నుండి బ్రాహ్మణు లుద్భవించిరి. బాహువుల నుండి క్షత్రియు లుద్భవించిరి. ఊరువులనుండి వైశ్యు లుద్భవించిరి. పాదములనుండి శూద్రు లుద్భవించిరి. ఎట్టి పరిపూర్ణుడు! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర గుణకర్మలన్నియు విరాట్పురుషుని యందైక్యము చెందియున్నవి. ఈ గుణకర్మలలో నే యొకటి లేకపోయినను వాని పరిపూర్ణతకే లోపము వాటిల్లును. విరాట్పురుషుడు ఒక్క బ్రాహ్మణుడు కాదు, ఒక్క క్షత్రియుడు కాదు, ఒక్క వైశ్యుడు కాదు, ఒక్క శూద్రుడు కాదు. వీని కన్నిటికి అతీతుడై, అన్నిటిని తనయందంతర్భుక్తము చేసికొనిన మహాప్రభువు. అందుకనియే విరాట్పురుషుడు. వాని యవయములలో నొకటి పవిత్రమై, ఇంకొకటి యపవిత్రము కాజాలదు. ఏ యొక యవయవము లోపించినను, విరాట్పురుషుడు కురూపి యగును. అతడు సర్వాంగసుందరుడు. ముఖము, బాహువులు, ఊరువులు, పాదములు అన్నియు పూర్ణముగ వికాసము చెంది చరమసిద్ధి నొందియున్నవి. హిందూ ధర్మశాస్త్రకారులీ విరాట్పురుషుని ప్రమాణముగ నంగీకరించిరి. లక్ష్యముగ నిడుకొని, హిందూ సంఘమును నిర్మించిరి.

చాతుర్వర్ణ్య సంభూతమైన హిందూ సంఘము విరాట్పురుషుని యొక్క ప్రతిబింబమే యని కొంచెము పరిశీలించిన తెలియగలదు. నాలుగు వర్ణములు యథావిధిగ బ్రవర్తిల్లుచుండినంత కాలము హిందూ సంఘము బలిష్ఠమై మహోన్నత దశ ననుభవించుచుండెను. బ్రాహ్మణ వర్ణము జ్ఞానవిలసితమై సంఘము యొక్క ధర్మమును నిరూపించుచుండెను. క్షత్రియ వర్ణము కర్మనిష్ఠాగరిష్ఠమై ధర్మమును బరిపాలించుచుండెను. వైశ్యవర్ణము ధన ధాన్యముల నుత్పత్తి చేసి సంఘమును బోషించుచుండెను. శూద్రవర్ణము దృఢశరీరము కలిగి కాయకష్టముతో సంఘమును నిలువబెట్టుచుండెను. ఈ వర్ణములలో నే యొకటి లోపించినను సంఘమున కంతకు ముప్పు వాటిల్లక తప్పదు.

ఎప్పుడు మహాభారత కాలమున క్షత్రియ వర్ణము నాశనమైనదో, అప్పటి నుండియే హిందూ సంఘముయొక్క క్షీణదశ యారంభించెను. ధర్మ నిర్వహణమునకు ఆధారభూతమైన క్షత్రియ వర్ణము లోపించుటతోడనే బ్రాహ్మణ వర్ణము యొక్క జ్ఞానజ్యోతియు నారిపోయెను. ధర్మ నిర్వహణాధికారులగు క్షత్రియులు లేనప్పుడు, ధర్మనిరూపణము చేయగల బ్రాహ్మణులును కమఠవృత్తి నవలంబించి అచలాయతనమున బంధించుకొనిరి. బౌద్ధయుగమున నీ యచలాయతనమును బ్రద్దలుకొట్టి, సంఘమును నూతన పథమున దీసికొని పోవుటకు బ్రయత్నములు జరిగినవి. కాని, సంఘమునకు స్థావరము చిక్కక యింకను క్రిందకు జారమొదలిడెను. మహమ్మదీయ యుగములో హిందూ సంఘము పరధర్మ సంఘట్టనమున దగుల్కొని, పునరుజ్జీవమును బొంద జూచెను. కబీరు, చైతన్య, నానక్, రామదాసు మొదలగు భక్తశిఖామణులు జ్ఞానధనమును సంస్కృత పేటికలనుండి వెలికితీసి దేశభాషలలో జనసామాన్యమునకు బంచిపెట్టిరి. స్వధర్మ నిర్వహణమునకు గురుగోవిందు, రాణాప్రతాప్, శివాజీ, కృష్ణదేవరాయలు మొదలగు వీరులు బయల్వెడలి దేశమును క్షాత్రతేజముతో నింప సమకట్టిరి. కాని సంఘము మొత్తముమీద గదలలేదు. ఆరిపోవుచుండిన దీపము ఒకమారు భగ్గుమని ప్రకాశించినట్లు వెలిగెనే కాని, ఈ నూతన శక్తిని ధారణ చేయగల ఆధారము సంఘములో లేకపోవుటచే బ్రిటిషు దాడిని నిరోధింపజాలక, ఇంకను క్రుంగిపోయెను.

బ్రిటిషు యుగమున హిందూసంఘముయొక్క అస్తమయము సంపూర్ణము. అన్ని వర్ణములును స్వధర్మ భ్రష్టములైనవి. బ్రాహ్మణులు తమ జ్ఞాన సంపత్తిని పరరాజ్య సేవ కర్పించి స్వధర్మ ద్రోహులైరి. క్షాత్ర మేదోవిధముగ శేషించియున్నను శిక్కులు, రాజపుత్రులు, జాటులు, మహారాష్ట్రులు మొదలగు వీరసంజాతులు తమ దేహమును బరరాజ్యమునకు విక్రయించుకొని దేశద్రోహులైరి. వైశ్యులు దేశైశ్వర్యము నభివృద్ధిపరచుట మాని విదేశపు దోపిడిగాండ్రకు

**ఇతరులను మోసగించగోరేవాడు నిజానికి తనను తాను మోసగించుకుంటున్నాడు.**

సహకారులై దేశలక్ష్మిని బరభూములకు సాగనంపిరి. నాల్గవ వర్ణము మాత్రము ఇంకను భూదేవి నాశ్రయించుకొని ధాన్యలక్ష్మిని గొలుచుచుండుటచే భరతఖండము భూతలమునుండి పూర్తిగ బరిమార్జితము గాక పేరుకైనను నిలచియున్నది. ఎక్కడి విరాట్పురుషుడు? ఎక్కడి హిందూ సంఘము? శిరస్సు ఖండింపబడినది. బాహువులు భగ్నమైనవి. ఊరువులు తెగగొట్టబడినవి. పాదములు మాత్రము మిగిలియున్నవి. ఎట్టి చిత్రవధ!

ఇక భరతవర్ష మివ్విధమున జీర్ణమై, భ్రష్టమై, ఖండములై పోవలసినదియా? భారతీయ చరిత్ర సజీవమైన జాతీయజీవనమునందు గాక కేవల పురాణగాథలలో స్మరింపబడ వలసినదియా? భరతవర్షమున కిక పునర్జన్మము లేదా? భయపడవలదు. భారతాత్మ యెన్నటికిని నాశన మగునది కాదు. అయ్యది నశ్యమే అయినయెడల, ఈజిప్టు బాబిలోను మొదలగు పురాణ జాతులవలె వెనుకనే నాశనమయ్యేడిది. భారత సభ్యత మృత్యువును జయించిన ఆత్మ పదార్థము. చెకుముకిరాతిని ఇనుముతో గొట్టినపుడెల్ల దానినుండి అగ్ని కణములు బయల్వెడలునట్లు, దేశము పరరాజ్య వశమైనను, విజాతీయ సభ్యత దేశమునం దంతట నావరించి, హిందూ సంఘమును విచ్ఛిన్నము సేయ జూచుచున్నను, భరతఖండము యొక్క హృదయాంతరాళము నుండి ఆత్మశక్తి తరంగ తరంగములుగ ఉద్గమించుచునే యున్నది. ఏ దేశమునం దింత దుర్గతిలో రాజా రామమోహన రాయలు, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, రాజా రామమోహన రాయలు, రామకృష్ణ పరమహంస, వివేకానంద స్వామి మొదలగు మహాప్రవక్తలు ప్రభవించిరి? దేశముయొక్క శరీరము నిర్వీర్యమైపోయినను, ఆత్మ యింకను చైతన్యవంతమై యున్నదనుట కింతకంటె నిదర్శనమేమి కావలెను? భరతఖండము తిరిగి తన స్వస్థానమును జేరి స్వధర్మమును బ్రతిష్ఠించుటకై సర్వముఖముల బ్రయత్నములు జరుగుచున్నవి. భరతవర్షము ఆత్మవిస్మృతి చెందిన దేశమగుటచే, పరరాజ్య వ్యామోహము ప్రజల నందరను చిక్కబట్టి యుండుటచే మోక్షసాధనము బహు కఠోరమై దీర్ఘతరమై యుండక తప్పదు. ఎల్లరిలోను ముముక్షుత్వము, ముక్తియెడల నిచ్ఛ యుదయించినది. దానిని సాధించుటకు ప్రబల ప్రయత్నము కూడ ప్రారంభమైనది. సిద్ధి యెప్పుడని ప్రశ్నింప బని లేదు. స్వధర్మ నిర్వహణము కొరకు జేయు సాధనయందే నిజమైన సిద్ధి కలదు. దేశము ఎంత బలిదానము గావించిన అంత సిద్ధి చేకూరును. సాధన వినా సాధ్యము లేదు.

నేడు దేశమునందు జరుగుచున్న ప్రయత్నములలో మహాత్ముని యందెక్కువగ నీ సాధనసంపత్తి వ్యక్తమగుచున్నదని కొంచెము తరచి చూచిన తెలియగలదు. మహాత్ముడు సనాతన ధర్మవాదియైనను పూర్వాచారములకు బానిస కాదు, సంస్కర్తయైనను నవీన పరివర్తనములకు దోసిలొగ్గువాడు కాదు. హిందూ సంఘముయొక్క మూలతత్వమగు విరాట్పురుషుని విగ్రహము వానియందు ప్రత్యక్షమైనట్లు నేడే యితర ప్రవక్తయందును గనుపించుటలేదు. కాని ప్రాచీన కాలమున హిందూ సంఘము వర్ణవిభాగముపై నాధారపడియుండెను. చాతుర్వర్ణ్యముల విభజన మేర్పడినను, మొత్తముమీద హిందూ సంఘము విరాట్పురుషుని పూర్ణ విగ్రహముగ బ్రకాశించి బలిష్ఠమై యుండెను. కాని ఆ విభజనము తారుమారై స్వధర్మము విలుప్త మగుటచే నయ్యది నేడు హిందూ సంఘమునకు ప్రతిబంధకమై దాస్యమున కుపకరించుచున్న దనుట నిశ్చయము. ఇప్పుడా విభాగపద్ధతి కూడదని దాని క్షీణదశయే చెప్పుచున్నది. వర్ణ విభాగ పద్ధతిని బునరుద్ధరించి పూర్వరీతిని హిందూ సంఘమును సంస్కరించుట యసంభవమని ప్రపంచ పరిస్థితులు ఘోషించుచున్నవి. పరధర్మ సంఘట్టనము లేని పూర్వకాలములో హిందూ సభ్యత స్వతంత్రముగ వికసించుట కవకాశము గలిగియుండి నప్పుడా విభాగపద్ధతి సరిగనే నడచినది. ఎప్పుడు పరసభ్యతా సంఘర్షణము లోపలను బయటను గూడ తీవ్రమై క్షత్రియ సంఘము నాశనమైనదో, అప్పుడు దానితో బాటు తక్కిన వర్ణములు కూడ భంగపాటు చెంది, దేశము వెతలపాలైన సంగతి యెన్నటికిని మరపునకు రాజాలదు. నేడు భరత వర్షము స్వాతంత్ర్య సిద్ధిని బడసినను

**సన్మార్గంలో నడిపేది విద్య. వినయవంతుణ్ణి చేసేది విద్య.**

బాహ్యప్రపంచముతో సంబంధమును బూర్తిగ విడగొట్టుకొన జాలదు. ఏ విరాట్పురుషుడు హిందూదేశ గర్భమున దాగియుండి దేశకాలములను నడుపుచున్నాడో ఆ విరాట్పురుషుడే నేడు ప్రపంచమంతను ఆడించుచున్నాడు. వెనుకటి యనుభవమును గమనించినను, ప్రపంచ పరిస్థితులను గ్రహించినను, ప్రాచీన వర్ణవిభాగ పద్ధతిని బునరుద్ధరించుట యసాధ్యమని, పూర్వాచార పరాయణులు సహితము బయట కంగీకరించక పోయినను, వారి యనుష్టానముల మూలమున నైనను అంగీకరించుచునే యున్నారు.

ఆ వర్ణవిభాగ పద్ధతి కూడదనినంత మాత్రమున హిందూ సంఘము తన లక్ష్యమును విడనాడునని తలంప వలదు. విరాట్పురుషుడే హిందూ సంఘము యొక్క లక్ష్యము. ప్రతివ్యక్తి యందును ఆ విరాట్పురుషుని సర్వశక్తియు గర్భితమై యున్నది. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర ధర్మముల కన్నిటికిని విరాట్పురుషు డాధారభూతుడై వానియందు సామరస్యము పొందినట్లే, ప్రతి వ్యక్తియు తనయందు దాగియున్న బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రధర్మముల నేకోన్ముఖమునకు దెచ్చి వ్యష్టియందును సమష్టియందును విరాట్పురుషుని బ్రతిబింబింప చేయుట కవకాశము గల్గును. అప్పుడు ధర్మముయొక్క లక్ష్యము ఎల్లరను బ్రాహ్మణులను జేయుట కాదు, ఎల్లరను క్షత్రియులను జేయుట కాదు. ఎల్లరను వైశ్యులను జేయుటకాదు. ఎల్లరను శూద్రులను జేయుట కాదు. సంఘములో బ్రతియొక్కరును తనయందు చాతుర్వర్ణ్యముల నిముడ్చుకొని, విరాట్పురుషుని సమగ్రత్వమున కుదాహరణముగ నుండగల్గును. అప్పుడు సంఘము ఏ యొక్క జాతిపైన నాధారపడి యుండ నవసరముండదు. వ్యక్తి యొక్క స్వభావమును బట్టి ఏ యొక గుణమో ప్రధానమై యుండినను, తక్కిన గుణములను లోపింప జేసికొనక, విరాట్పురుషుని సంపూర్ణ విగ్రహమును ధ్యేయముగ నుంచుకొని సమగ్రత్వమును బొందుటకు బ్రయత్నించుచుండును.

మహాత్ముని జూడుడు. జాతముచే వైశ్యుడైనను, వానియందు విరాట్పురుషుని సమగ్రత్వము అభివ్యక్తమగుచున్నది. మహాత్ముడు బ్రాహ్మణుని జ్ఞాన వైరాగ్యములను, క్షత్రియుని క్షాత్ర తేజమును, వైశ్యుని ఆర్థికనీతిని, శూద్రుని స్వకాయకష్టమును గలిగి ఆదర్శపురుషుడై వెలయుచున్నాడు. వాని ధ్యేయమగు స్వరాజ్యము కేవలము రాజకీయము కాదు. స్వధర్మముపై స్థాపితమైన స్వతంత్ర జాతీయ నిర్మాణమే వాని స్వరాజ్యము. వాని వైరాగ్య సాధన ఏ బ్రాహ్మణునకు లక్ష్యముగ నుండదు? కాని తన జ్ఞానమును పరరాజ్య సేవ కర్పించి స్వధర్మమును గోలుపోయిన కుహనా బ్రాహ్మణుడు కాదు, మహాత్ముడు. వాని శౌర్య పరాక్రమము లే క్షత్రియునకు లక్ష్యముగ నుండకుండును? కాని పరధర్మ నిర్వహణమునకై దేహమును విక్రయించుకొను క్షత్రియద్రోహి కాదు మహాత్ముడు. వాని స్వదేశ దీక్షయు, ఖద్దరుత్పత్తియు నే వైశ్యునకు లక్ష్యములుగ నుండకుండును? కాని దేశములోని ఆహార పదార్థములను బయటకు బంపివైచి, దేశమును దారిద్ర్యవంతముగ జేయు వైశ్యనామధారుడు కాదు మహాత్ముడు. మహాత్ముడు కష్టజీవి. ప్రతి దినమును రాటమును త్రిప్పి, తన దినభృతిని సంపాదించుకొనినగాని ఆహారమును భుజింపని సచ్ఛూద్రుడితడు. మహాత్మునియందు చాతుర్వర్ణ్యములే కాదు సమన్వయమగుచున్నవి. చతురాశ్రమములగు బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము వానియందు సమముగ మూర్తీభవించి ఇహపరములు రెండును సామరస్యము నొందుచున్నవి. వాని బ్రహ్మచర్యము, సాత్వికాహారము, ఉపవాసములు, మౌనవ్రతము, జపతపములు, సత్యాగ్రహము, అహింసాపథము, లోకసంగ్రహము వాని యాధ్యాత్మిక సాధన సంపత్తిని వేనోళ్ల చాటుచున్నవి. ఒక్కొక విషయములో మహాత్ముని కంటె నధికులు కొందరుండవచ్చును. కాని నాలుగు వర్ణాశ్రమ ధర్మములను తనయందు జీర్ణము చేసికొని నూతన యుగధర్మమునకు మార్గదర్శియై వెలయగల మహాపురుషుడు మరియొకరు లేరని చెప్పుటకు సాహసింప బనిలేదు.

– ముట్నూరి కృష్ణారావు (కృష్ణాపత్రిక 6-4-1929)

H H H

**బాధ్యతలను స్వీకరించి వాటిని బాధ్యతలుగా భావించకపోతే మోక్షం. బాధ్యతల నుండి జారుకుంటే రాదు మోక్షం.**

# సోదరి నివేదిత జయంతి వ్యాసం

# త్యాగానికీ సేవకూ మహోజ్జ్వల ప్రతీక

భారతదేశంలో లాగానే ఐర్లాండ్‌లో కూడా ఆ కాలంలో స్వతంత్ర పోరాటం సాగుతోంది. జాన్ నోబల్ ఓ ఐరిష్ చర్చిలో మతబోధకుడిగా ఉండేవారు. భగవంతుడు, దేశభక్తి – ఈ రెండు విషయాలకే ఆయన ప్రాధాన్యత ఇచ్చేవాడు. ఐర్లాండులో శామ్యూల్ నోబల్. ఆయన కుమారుడు శ్యామ్యూల్, మేరి హెమిల్‌టన్ దంపతులకు 1867 అక్టోబర్ 28న ఒక అందమైన పాప జన్మించింది. ఆమెకు మార్గరేట్ అనే పేరు పెట్టారు.

మార్గరెట్ తండ్రి శామ్యూల్ ఆయన 34 సంవత్సరాల వయస్సులోనే మరణించారు. చనిపోయేముందు ఆయన భార్య మేరీని పిలిచి "మార్గరేట్‌కు భారతదేశం నుండి పిలుపు వస్తే ఆమెను అక్కడకు పంపు." అని అన్నారు.

భర్త చనిపోయిన తర్వాత మేరి పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. చక్కటి క్రమశిక్షణలో పిల్లల్ని ఆమె పెంచసాగింది. మార్గరేట్‌ను, ఆమె చెల్లిని చదువు నిమిత్తం హోలీ ఫాక్స్ కాలేజీకి పంపారు. ఆ కాలేజీ హాస్టల్‌లో వీళ్లిద్దరూ చేరారు. మార్గరేట్‌కు సంగీతం, చిత్రలేఖనం అంటే బాగా ఇష్టం. జీవశాస్త్రం మీద ఎక్కువ మనసు లగ్నం చేసేది.

## ఉపాధ్యాయినిగా

1884 వచ్చేసరికి మార్గరేట్ 17 సంవత్సరాల యువతిగా ఎదిగింది. అప్పటికి ఆమె విద్యాభ్యాసం పూర్తయింది. కేస్విక్‌లోని ఓ పాఠశాలలో ఆమె ఉపాధ్యాయినిగా చేరింది. పిల్లలకు చదువు చెప్పే విధానాన్ని సులభం చేయటంకోసం ఆమె ఎన్నో ప్రయోగాలు చేసింది. 1892లో ఆమె స్వంతంగా స్కూలును ప్రారంభించింది. మంచి అధ్యాపకురాలు అనే పేరు సంపాదించుకుంది. ఇంజనీరింగ్ చదివిన ఓ విదేశీయుడు మార్గరేట్ వ్యక్తిత్వానికి ప్రభావితుడయ్యాడు. ఆ ఆకర్షణ ప్రేమకు దారితీసింది. అతనితో మార్గరేట్‌కు వివాహం నిశ్చయమైంది. కానీ ఆమె తలవ్రాత మరో విధంగా వ్రాసినట్టుంది. ఆ యువకుడు అనారోగ్యంపాలై చనిపోవటం జరిగింది. దాంతో మార్గరేట్ సున్నిత హృదయానికి పెద్దదెబ్బ తగిలింది. అయితే ఆమె పాఠశాల పనులకు ప్రాధాన్యం ఇస్తూ ఈ దుఃఖం నుండి బైటపడింది.

## గురువుకోసం అన్వేషణ

1895 మార్గరేట్ జీవితంలో మలుపునకు కారణమైంది. ఆమె స్నేహితురాలు లేడీ మార్గెస్‌నన్ ఓ భారతీయ సాధువుకు పరిచయం చేయటం కోసం ఆమెను తన ఇంటికి ఆహ్వానించింది. కాషాయ వస్త్రాలను ధరించిన ఓ సాధువు అక్కడ పద్మాసనం వేసుకుని కూర్చున్నారు. ఎర్రటి గుడ్డను



నడుముకు కట్టుకున్నారు. ఆయన ధ్యానముద్రలో సంస్కృత భాషలో కొన్ని మంత్రాలను ఉచ్చరించారు. ఆయన గొంతు అత్యంత మధురంగా ఉంది. ఆయన ముఖ తేజస్సుకు, ఆకర్షణీయమైన వాక్కుకు, దైవీ స్వరానికి అక్కడ కూర్చున్న

**మోక్షం అనేది అటునుంచి రావాలి తప్ప మనం ప్రయత్నం చేసేది కాదు.**

మనుష్యులు మంత్రముగ్ధులయ్యారు. 'శివ శివ' అనే పవిత్ర ఉచ్చారణకు వారు ప్రభావితులయ్యారు. స్వామీజీ ఆకర్షణీయమైన వ్యక్తిత్వం మార్గరేట్‌ను ఆకట్టుకుంది.

రెండు సంవత్సరాల ముందు 1893లో చికాగోలో జరిగిన సర్వధర్మ సమ్మేళనంలో ఆహ్వానం లేకపోయినా పాల్గొని



ప్రేరణదాయకమైన తన ప్రసంగంతో కోట్లాది అమెరికన్ల హృదయాల్ని జయించిన స్వామి వివేకానంద ఈ సాధువే అనే విషయాన్ని మార్గరేట్ గుర్తించింది.

## మేలుకో

స్వామీజీ ప్రవచనాలు ఆమె మనస్సులో కదలికను కలిగించాయి. ఆమె మనస్సు పరివర్తన చెందసాగింది. 'కేవలం భగవంతుడే సత్యం' అని స్వామీజీ అన్న మాట కొత్తది కాకపోయినా – ప్రభావవంతంగా ఆయన చెప్పిన విధానంలో కొత్తదనం ఉంది. 'ప్రతి మతమూ భగవంతుడి దగ్గరకు వెళ్లే ప్రధాన మార్గమే' అని స్వామీజీ మరోమాట చెప్పారు. ప్రజల మనసుని జయించడానికి స్వామీజీ వ్యక్తిత్వం చాలు. ఆయన భగవంతుడి కోసం అన్నింటినీ త్యాగం చేశారు. ఆయన ఉపదేశాలు కేవలం పుస్తకాలకే పరిమితమైనవి కావు. జీవితానికి సంబంధించినవి. ఆయన అంతరాత్మ నుండి వచ్చినవి. అవి సత్యమైనవి – అనుభవపూర్వకమైనవి.

మార్గరేట్ నిదానంగా స్వామీజీ ప్రభావంలోకి వచ్చింది. ఆయన ప్రవచనాలు నిదురించిన ఆమె ఆత్మను మేల్కొలిపాయి. జ్ఞాన రూప ప్రకాశంలో ఆమె మనసులోని అంధకారం దూరమయ్యింది. గురువు మంత్రాల ప్రభావంలో తన మనసులోని సందేహాలన్నీ సమసిపోయాయనీ, ఆయన వ్యక్తిత్వం, జ్ఞానం, భారతదేశానికి సేవ చేసేందుకు ప్రేరేపించాయని మార్గరేట్ స్వయంగా వ్రాశారు.

ఒకసారి ప్రవచనాల మధ్యలో స్వామీజీ "ప్రజల కోసం తమని తాము సమర్పించుకొనేవారు, భగవంతుని కార్యం తప్ప మరే కార్యం చేపట్టనివారు, తమకంటూ అస్తిత్వాన్ని కోరుకోనివారు ... అలాంటి 20మంది స్త్రీలు, 20 మంది పురుషుల అవసరం ఇవాళ ప్రపంచానికి ఉంది" అని అన్నారు.

"ఇలాంటి మహిళలు, పురుషులు మీలో ఎవరైనా ఉన్నారా" అని స్వామీజీ అడిగారు. మార్గరేట్ మనసు "సిద్ధం" అని అంది. కానీ ఆమెలోని సంకోచం ఆ పదాలను పైకి రానీయలేదు. ఒకరోజు భారతీయ మహిళల గురించి స్వామీజీ చర్చిస్తూ "మా దేశంలోని అమ్మాయి ఇప్పటివరకూ పాఠశాల ముఖం చూడలేదు. మహిళలు విద్యావంతులయ్యే వరకూ మా దేశం ప్రగతి సాధించదు" – అని అన్నారు. మార్గరేట్ వైపు చూస్తూ ఆయన "మా దేశపు మహిళల అభివృద్ధి కోసం, చదువు కోసం నా వద్ద వివిధ రకాల ప్రణాళికలు ఉన్నాయి. వాళ్లను ఆ పనిలో నిమగ్నం చేయడానికి నువ్వు నాకు సహాయం చేస్తావా" – అని అడిగారు.

తన పట్ల స్వామీజీకి ఉన్న విశ్వాసానికి మార్గరేట్ ప్రభావితురాలు అయ్యింది. అయితే ఆ విశాల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించగల యోగ్యత తనకు ఉందా అనే ఆలోచనలో పడింది. ఆమె ఆలోచనలను తెలుసుకొన్న స్వామీజీ "ప్రపంచాన్ని మార్చేటందుకు నిన్ను నీవు సిద్ధం చేసుకోవాలి. అప్పుడు నీతో పాటు మరికొందరు వస్తారు. నీ ఆత్మను మేలుకొలుపు" అని అన్నారు.

తన దేశాన్ని వదలి స్వామీజీ దేశమే తనదిగా భావిస్తూ అక్కడకు వెళ్లాలనే సాహసవంతమైన నిర్ణయాన్ని మార్గరేట్ తీసుకుంది.

## భారత్ పిలుపు

స్వామీజీ పిలుపే ఆమె చెవుల్లో మారు మ్రోగుతోంది.

**శరీర ఆకృతికీ, రోగ నివారణకు చేసే యోగాభ్యాసం అసంపూర్ణం.**

ఆమెకు భారతదేశం తనని పిలుస్తున్నట్లుగా అనిపిస్తున్నది. తన చుట్టు పక్కలంతా అంధకారమే కనిపిస్తున్నది. "మార్గరేట్ ! నీ స్థానం కేవలం భారతదేశంలోనే. నీ అంతట నీవు సిద్ధమైనపుడే ఇది సాధ్యం" – అన్న స్వామీజీ మాటలు ఆమె చెవిలో పదేపదే వినిపించసాగాయి.

కానీ తనని తాను సిద్ధం చేసుకోవటం అంత సులువైన పని కాదుకదా! స్వామీజీ భారతదేశ చిత్రపటాన్ని ఆమె ముందు పెట్టారు. బీదరికం.... అంటరానితనం.... ద్వేషం తదితర చెడు లక్షణాలతో నిండి ఉన్న భారతదేశాన్ని ఆమె కళ్లతో చూడమని స్వామీజీ సలహా ఇచ్చారు. అధికారంలో ఉన్న ఆంగ్లేయులకి ఆమె పట్ల గౌరవం ఉండదనీ, భారతీయులు సందేహ దృష్టితో, ద్వేషంతో చూస్తారనీ ఆయన అన్నారు. మహిళలకు చదువు చెప్పేటందుకు, వారికి సేవ చేసేందుకు ఆమెకు భారతదేశం నుండి పిలుపు వచ్చింది. "మేం భారతీయులకు – ముఖ్యంగా మహిళలకు – విద్య నేర్పే మీలాంటి స్త్రీని కోరుకుంటున్నాం. భారత్‌కు ఇవాళ ఆడసింహం కావాలి" – అంటూ గురువు నుండి సందేశం వచ్చింది. " భారతదేశం మహోన్నతమైన మహిళలను ఇటీవల తయారు చేసుకోలేదు. అటువంటి మహిళను విదేశాల నుండి తెచ్చుకోవలసి వస్తోంది. నీలోని విద్య, మంగళప్రదమైన ఆలోచన, పవిత్రత, ప్రేమ, దృఢ నిశ్చయం – అన్నింటినీ మించి ఉడుకురక్తం ఉన్న స్త్రీ అవసరం ఇవాళ భారత్‌కు ఉంది" అని ఆయన ఆ లేఖలో వ్రాశారు. 'ఇక్కడకు రావడానికి ముందే బాగా ఆలోచించుకో. నా వైపు నుండి నేను ఈ మేరకు హామీ ఇస్తాను. నువ్వు భారత్ కోసం పని చెయ్యి, చెయ్యకపో – నేను నీ వెంట ఉన్నాను. ఏనుగు దంతం ఒకసారి బైటికి వచ్చాక మళ్లీ లోపలకు ఎలాగైతే వెళ్లదో – అదే విధంగా మనిషి చెప్పే మాట కూడాను. దాన్ని వెనక్కి తీసుకోవటం అంటూ ఉండకూడదు' అని స్వామీజీ వ్రాశారు.

## భారతభూమిలో

మార్గరేట్ వస్తున్న ఓడ భారతదేశంలోని కలకత్తా నౌకాశ్రయానికి 1898 జనవరి 28న చేరింది. ఆమెకు మనసారా స్వాగతం పలికేందుకు స్వామి వివేకానంద స్వయంగా అక్కడకు వెళ్లారు. మార్గరేట్ తన మృదుల స్వభావంతో కలకత్తా ప్రజలలో కలిసిపోయింది. అదే ఆమె కర్మభూమి అయ్యింది. అక్కడి స్థానిక బెంగాలి భాష నేర్చుకోవటానికి ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు. బెంగాలీ ప్రజల విశ్వాసాన్ని పొందటానికి, వాళ్లను ప్రభావితం చేయటానికి ఆమె బెంగాలీ సాహిత్యం గురించి లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఏర్పడింది. కొన్ని వారాల తర్వాత స్వామీజీకి తెలిసిన శ్రీమతి సారా.సి.బుల్, మిస్ జోసెఫీన్ మైక్ లియోడ్ అనే అమెరికా శిష్యురాళ్లు భారత్‌కు వచ్చారు. కొద్ది కాలంలోనే వీరి ముగ్గురి మధ్య స్నేహం పెరిగింది. వాళ్ల నివాసం ఓ ఆశ్రమంగా మారిపోయింది. స్వామి వివేకానంద తన శిష్యులతో ఆ ఆశ్రమానికి వస్తుండేవారు. ఆయన రాకతో ఆ ప్రదేశం అలౌకికమైన వెలుగుతో నిండిపోయేది. స్వామీజీ గంటలు గంటలు శిష్యులకు ఉపదేశం ఇవ్వడంలో లీనమైపోయేవారు. భారతదేశం – దాని చరిత్రకు సంబంధించి ఆ ఉపన్యాసాలు సాగుతుండేవి. అంతే కాకుండా భారతదేశంలోని సంత్‌లు, నాయకులు, నాయికలు, వారు వ్రాసిన గ్రంథాలు, వేద పురాణాలు, కవులు, దేశ నిర్మాణం...... ఇలా ఎన్నో తనకిష్టమైన విషయాలను గురించి స్వామీజీ మాట్లాడుతుండేవారు. స్వామీజీ వాక్ ప్రవాహంలో పడి వింటున్న వారు ప్రపంచాన్ని .... తమని తాము మర్చిపోతుండేవారు. స్వామీజీ శిష్యురాలు మిస్ మైక్ లియోడ్ "ఇంతకంటే మంచిగా మీకు నేను ఎలా సేవ చేయగలను" – అని ఓరోజు స్వామీజీని ప్రశ్నించింది. దానికి ఆయన సమాధానం చెబుతూ "ఈ దేశాన్ని ప్రేమించు–పూజించు... ఇదే ప్రార్థన... ఇదే పూజ... అన్నీను" – ఈ మాటలు విన్న మార్గరేట్ ఈ వ్యాఖ్యలు తనకు సందేశంగా భావించింది.

## నివేదితగా నామకరణం

దక్షిణేశ్వర్‌కు చెందిన స్వామి రామకృష్ణ పరమహంస స్వామి వివేకానందకు గురువు. ఆయన 1886లో పరమపదించారు. రామకృష్ణ పరమహంస ధర్మపత్ని అయిన శారదాదేవిని అందరూ భక్తిభావంతో తల్లిగా కొలిచేవారు. మార్గరేట్‌కు, ఆమె సహచరులకు తమ కార్యాన్ని సాధించటం కోసం శారదాదేవి ప్రేరణను ఇచ్చి ఆశీర్వదించింది.

శారదాదేవి ప్రేమ, వాత్సల్యాలకు మారుపేరు.

**ఈశ్వరుడిలో ఏం ఉందో మనలోనూ అదే ఉంది. ఇవతలకు వచ్చాక అంటుకుపోయాం.**

మార్గరేట్‌ను, ఆమె సహచరులను శారదాదేవి అమితమైన ప్రేమతో తన సొంత పిల్లలలాగా హృదయానికి హత్తుకుని ఆశీర్వదించింది.

మార్గరేట్ జీవితంలో 1898 మార్చి 25 మరపురాని మంచిరోజు. ఆ రోజున స్వామి వివేకానంద ఆమెను భగవంతునికి, భారతదేశ సేవకు అంకితమిచ్చారు. ఆరోజు శుక్రవారం. మార్గరేట్‌ను, ఆమె ఇద్దరు సహచరుల్ని స్వామీజీ మఠానికి తీసుకువెళ్లారు. అక్కడ శివుడికి పూజ ఎలా చెయ్యాలో చెప్పారు. మార్గరేట్ చేత పూజ చేయించారు. చెప్పిన ప్రకారం ఆమె పూజ చేయగానే స్వామీజీ ఆశీర్వదించి ఆమె పేరును 'నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే 'సమర్పణ' అని అర్థం. ఆమె ఆ రోజు ఈశ్వరునికి సమర్పితమైంది. ఆ తర్వాత స్వామీజీ ఆమెను బుద్ధ భగవానుని పాదాల దగ్గర పుష్పాలను పెట్టవలసిందిగా ఆదేశించారు. ఆ ప్రకారం మార్గరేట్ నివేదిత అయ్యింది.

ఆ వేసవికాలం స్వామీజీ హిమాలయ పర్వతాల్లోని అల్మొడకు ప్రయాణమయ్యారు. ఆయనతో పాటు నివేదిత, మరికొందరు శిష్యులు ఉన్నారు. యాత్రా సమయంలో కూడా వాళ్ల బృందం ఓ గురుకులంగా అనిపించేది.

## పాఠశాల ప్రారంభం

1898 నవంబర్ 13న ఓ చిన్న గుడిసెను అద్దెకు తీసుకొని నివేదిత పాఠశాలను ప్రారంభించింది. పొడవైన తెల్లటి గౌనులో ఆమె మరింత ఆకర్షణీయంగా కనిపించేది. ఆమె మెడలోని రుద్రాక్షమాల ఆమెలోని సాధు స్వభావాన్ని తెలియచేసేది. ప్రజలు ఆమెను ఆదరంగా చూస్తూ శ్రద్ధతో ఆమె పాదాలకు నమస్కరించేవారు.

పాఠశాల ప్రారంభం అయితే అయ్యింది కానీ విద్యార్థులను సేకరించటం సమస్యగా నిలిచింది. నివేదిత ఇంటింటికీ వెళ్లి పిల్లలను, ప్రత్యేకించి ఆడపిల్లలను స్కూలుకు పంపవలసిందిగా ప్రజలను కోరింది. చివరికి కొంత మంది బాలికలను కూడగట్టుకుంది. ఆమె వాళ్లకు చదవటం, వ్రాయటం నేర్పింది. దానితో పాటుగా చిత్రకళ, శిల్పకళ తదితర కళలలో కూడా పరిజ్ఞానాన్ని కలగచేసింది.

తనలోని మృదుల స్వభావం కారణంగా నివేదిత చాలా త్వరగా ప్రజలలో కలిసిపోయింది. ఇప్పుడు ప్రజల హృదయాలలో ఆమెకు స్థానం లభించింది. వాళ్ల మధ్యలో ఉంటూ ఆమె అనేక ఇళ్లలో సభ్యురాలిగా మారిపోయింది. ఉత్తర కలకత్తాలో ఆమె 'సిస్టర్ నివేదిత'గా ప్రాచుర్యం పొందింది.

ఒకరోజున ఓ స్త్రీ సిస్టర్ నివేదిత దగ్గరకు వచ్చింది. "సిస్టర్... త్వరగా నావెంట రండి. మా ఆఖరి అబ్బాయి ఊపిరి పీల్చలేకపోతున్నాడు' – అంటూ కన్నీరు పెట్టుకోసాగింది. ఆ నిస్సహాయురాలి వెంట నివేదిత బయలుదేరింది. కానీ వాళ్లు ఆమె ఇంటికి చేరే సరికే ఆ పిల్లవాడు చనిపోయాడు. దుఃఖితురాలైన ఆ తల్లి పిల్లవాణ్ణి గుండెలకు హత్తుకుని గంటల తరబడి రోదించింది. చివరగా నివేదిత చేతులను పట్టుకుని "సిస్టర్ ఇప్పుడు నేనేం చేయాలి, నా పిల్లాడు ఎక్కడకు వెళ్లాడు" – అంటూ కన్నీరు కార్చింది. నివేదిత ఆమెతో "అమ్మా నీ బిడ్డ కాళీమాత దగ్గరకు వెళ్లాడు" అంటూ ఓదార్చింది.

ఈ సంఘటన గురించి నివేదిత ఆ తరువాత స్వామీజీకి చెప్పినపుడు ఆయన ప్రేరణదాయకమైన సందేశాన్ని ఇస్తూ "చివరి క్షణం వరకూ ప్రార్థన చేస్తూండు. అందాన్ని ఎలా అయితే పూజిస్తామో – అందవికారాన్ని అలానే పూజించు" అని అన్నారు. గురువు ఇచ్చిన సందేశాన్ని ఆమె మనసులో నింపుకుంది.

## కలకత్తాలో ప్లేగ్

1899 మార్చిలో కలకత్తాలో ప్లేగ్ వ్యాధి వ్యాపించింది. ఆ సమయంలో నివేదిత ప్రజల ప్రాణాలను రక్షించాలనే సంకల్పాన్ని తీసుకుంది. ఆమె రోగుల సేవలో నిమగ్నమైంది. ఆమె మురికివాడల్ని, మూత్రశాలల్నీ శుభ్రం చేయటం మొదలుపెట్టింది. శారీరిక శ్రమ చేయడానికి బద్ధకించే బెంగాలీ యువకులు నివేదిత చేసే పనులను నిశ్శబ్దంగా చూస్తూ ఉన్నారు. ఆమె చేసే పనులను చూసి మహిళలు సిగ్గుపడ్డారు. ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాల ప్రభావం వల్ల మిగిలిన మహిళలు ఆమెకు సహాయం చేయసాగారు. కలకత్తా మహిళలకు శుభ్రత, స్వయంసేవ,

**అక్షరాలు ఛార్జ్ అయితే మంత్రం అవుతుంది. మనలో అది విద్యుదీకరణ చెందితే మనం మంత్రత్వం పొందుతాము.**

సమాజసేవ చేయటంలో శిక్షణ ఇచ్చే అవకాశం నివేదితకు ఈ సందర్భంగా కలిగింది. అయితే ఈ శిక్షణ కేవలం మాటల ద్వారా కాక చేతల ద్వారా ఇవ్వబడింది. ప్లేగ్ వ్యాధిని ఎదుర్కోవటానికి సామాజిక కార్యకర్తలతో ఓ సమితిని ఆమె ఏర్పాటు చేసింది. ఆమె ఆహ్వానం మేరకు చాలామంది ప్రజలు ఆమెతో చేతులు కలిపారు. నివేదిత రాత్రి పగలు తేడా లేకుండా పని చేసింది. ఆ కారణంగా నివేదిత జబ్బు పడింది. అయినా మిగిలిన రోగులకు సేవ చేయడానికి ఇంటింటికీ వెళ్లేది. తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఆమె ఎంతోమంది రోగులకు ప్రాణదానం చేసింది. ఈ సమయంలో ఆమె కేవలం పాలు, పళ్లనే ఆహారంగా తీసుకునేది. ఒకరోజున ఓ రోగికి మందులు కొనడంకోసం తాను త్రాగే పాలను కూడా ఆమె త్యాగం చేసి - ఆ డబ్బుతో మందులు కొంది.



## పశ్చిమ యాత్ర

నిధుల కొరత కారణంగా నివేదిత పాఠశాల నడపటం కష్టమైంది. పాఠశాలను నిర్వహించాలంటే పశ్చిమ దేశాల నుండి ఆర్థిక సాయం తీసుకుంటే బాగుంటుందని నివేదిత ఆలోచించింది. ఈ విషయంలో ఆమె తన గురువు స్వామీ వివేకానందను సలహా అడిగింది. గురువు నుండి ఆజ్ఞ రాగానే 1899 లో ఆమె యూరప్‌కు జలమార్గం ద్వారా ప్రయాణం అయ్యింది. యూరప్ నుండి అమెరికా వెళ్లింది. తన చిన్న స్కూలు కోసం అతిపెద్ద మొత్తాన్ని సమీకరించాలన్నది ఆమె ఉద్దేశ్యం. అలానే కొన్ని క్రైస్తవ మిషన్‌లు భారతదేశం గురించి, ఇక్కడి విభిన్న ధర్మాలను గురించి అమెరికాలో అసత్యాలను, లేనిపోని మాటలను ప్రచారం చేసిఉన్నాయి. అందువల్ల అక్కడి వ్యక్తులకు భారతదేశం గురించి తెలియచెప్పాల్సిన అవసరం కనిపించింది.

అమెరికా ప్రజల్లో భారతదేశం పట్ల సరైన అవగాహన కలిగించేందుకు నివేదిత తన గురువులానే వివిధ ప్రాంతాలకు వెళ్లింది. భారతదేశపు ప్రాచీన సంస్కృతిని గురించి వారికి తెలియచేసింది. అలాగే నేటి దుస్థితికి కారణాలను వివరించింది. ఆమె మంచి ఉపన్యాసకురాలు. భారతదేశపు చరిత్ర, ధర్మం, సభ్యత, సంస్కృతుల గురించి ఆమెకు చక్కటి అవగాహన ఉంది. తన ఉపన్యాసాల ద్వారా అమెరికావాసుల మనసుల్లో భారతదేశం గురించి ఓ ఆకర్షణీయమైన చిత్రాన్ని ఆమె ముద్రించింది. కానీ తన పాఠశాల, ఇతర కార్యక్రమాల కోసం ధనాన్ని పోగు చేసే విషయం మాత్రం అనుకున్నంత సఫలం కాలేదు.

## గురువు ఇక లేరు

1901లో నివేదిత భారతదేశానికి తిరిగి వచ్చింది. ఇప్పుడు నివేదిత బోస్‌పారా లేన్ స్ట్రీట్‌లోని 17వ నంబర్ గదిలో ఉండటం మొదలుపెట్టింది. అదే ఆమె ఇల్లు, పాఠశాల, యాత్రికులు నివసించే నివాసగృహం. నివేదిత ఉండే ఆ ఇల్లు ఆ సమయంలో ప్రముఖ రాజకీయ నేతలకు, స్వాతంత్ర్య సమర యోధులకు, మేధావులకు నివాసస్థలమైంది.

అదే సమయంలో జర్మనీ నుండి మిస్ క్రిస్టీన్ గ్రీన్ స్టాండెల్ అనే యువతి భారతదేశంలో సేవ చేయడానికి వచ్చింది. నివేదితను ఆమె కలుసుకుంది. ఆమె రాక నివేదితకు ఎంతో సహాయకారి అయ్యింది.

**ప్రతిదీ తెలుసుకున్నాక ఆచరిస్తాననుకునే వాడిని ఆ భగవంతుడు కూడా బాగుచెయ్యలేడు.**

నివేదిత స్కూలు మళ్లీ నడవడం మొదలైంది. ఇప్పుడు పాఠశాలకు కేవలం బాలికలే కాకుండా వాళ్ల తల్లులు కూడా శిక్షణ పొందటానికి రాసాగారు.

నివేదిత జీవితంలో 1902 అంధకారం అలముకున్న సంవత్సరం. ఆమె తన గురువును చూడటానికి బేలూరు మఠానికి వెళ్లింది. అది జూన్ 19వ తేదీ. మాటల్లో స్వామీజీ 'మహోన్నతమైన ఆత్మ నన్ను పిలుస్తోంది. మృత్యువును కౌగలించుకోవటానికి నాకు నేను సిద్ధం అవుతున్నాను" అన్నారు. జులై 2వ తేదీ ఏకాదశి. ఆరోజున స్వామీజీ ఉపవాసముంటారు. కాని ఆయన నివేదిత కోసం భోజనం తయారు చేయించారు. దగ్గరుండి ఆమెకు అన్నం వడ్డించారు. భోజనం పూర్తయ్యాక ఆయన ఆమె చేతులను కడిగి – శుభ్రమైన బట్టలతో తుడిచారు. వెంటనే నివేదిత దుఃఖంతో "స్వామీజీ... మీకు నేను సేవ చేయటమే సముచితం. కానీ మీరు నాకు సేవ చేస్తున్నారు" అని అడిగింది. దానికి స్వామీజీ "యేసుక్రీస్తు స్వయంగా తన చేతులతో శిష్యుల పాదాలను తుడిచారు. అది సత్యం కాదా!" అని అన్నారు. అందుకు నివేదిత "అవును... కానీ ఆయన తన జీవిత చరమాంకంలో ఆ పని చేశారు" అని సమాధానం చెబుదామనుకుంది. కానీ ఆమాటలు ఆమె గొంతు దాటి బయటకు రాలేదు. గురువు నుండి ఆశీస్సులను అందుకుని నివేదిత ఇంటికి బయలుదేరింది. కానీ గురువును కలవటం అదే ఆఖరిసారి అని ఆమెకు తెలియదు. ఏసుక్రీస్తు గురించి చెప్పిన ఉదాహరణ స్వామీజీ విషయంలో వాస్తవమైంది.

1902 జులై 3వ తేదీ స్వామీజీ మహాసమాధి అయ్యారు. 4వ తేదీ సాయంత్రం స్వామీజీ మరణవార్త నివేదితకు చేరింది. ఆమె మనసు కకావికలైంది. వెలుగు ఒక్కసారిగా మాయమై నలువైపులా చీకట్లు వ్యాపించినట్లయింది. ఆమె మఠంవైపు పరుగుతీసింది. వెక్కివెక్కి కన్నీరు పెడుతూ తన గురువుకు శ్రద్ధాంజలి ఘటించింది. రాత్రి 2గం.ల వరకు గురువు మృతదేహం దగ్గరే కూర్చుని విసనకర్రతో విసురుతూ ఉంది.

వైదిక మంత్రపఠనం మధ్య పెద్ద ఊరేగింపుగా స్వామీజీ అంతిమయాత్ర గంగానదివైపు సాగింది. ఆ నది ఒడ్డున ఆయన మృతదేహానికి అంతిమ సంస్కారాలు జరిగాయి. 'జై స్వామీజీ', 'స్వామీ వివేకానందకీ జై' అన్న నినాదాలు ఆకాశాన్ని తాకాయి. తనను తాను మర్చిపోయిన నివేదిత మాత్రం చాలాసేపు అక్కడ ఒంటరిగా కూర్చునే ఉంది.

## దేశస్వాతంత్ర్యం కోసం సంఘర్షణ

భారతదేశ స్వాతంత్ర్యం కోసం సంఘర్షణ చేయాలనే మరో మహా కార్యాన్ని నివేదితకు స్వామి వివేకానంద మరణానికి ముందు అప్పజెప్పారు. దానిని నెరవేర్చాల్సిన బాధ్యత ఆమె మీద పడింది. ఓ సివంగిలా ఆమె సాహసంతో మైదానంలో నిలచింది. భారత స్వాతంత్ర్య సాధనను జీవన కార్యంగా ఆమె స్వీకరించింది.

ఆమె మనసును రెండు సంఘటనలు బాగా దెబ్బతీసాయి. విశ్వ విఖ్యాత వైజ్ఞానికుడు జగదీశ్‌చంద్ర బోస్ నివేదితకు మంచి మిత్రులు. ఆయనకున్న యోగ్యత కారణంగా ఫ్రాన్స్ ఆయన్ని ఎంత గౌరవించిందో నివేదితకు తెలుసు. కానీ బ్రిటన్ ఆయనకు తగినంత గౌరవాన్ని ఇవ్వలేదు.

భారత జాతీయవాది బిపిన్ చంద్రపాల్ అమెరికాలోని ఒక సభలో ప్రసంగిస్తుండగా ఓసభ్యుడాయన దగ్గరకు వచ్చి "మిస్టర్ పాల్! మొదట మీ దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించండి... ఆ తర్వాత ఉపన్యాసాలు చెబుదురుగానీ" అని అంటూ అవమానపరిచాడు. ఈ రెండు సంఘటనలతో నివేదిత రక్తం పొంగింది.

నివేదిత పేరు తెలియని ఇల్లు ఇవాళ బెంగాల్‌లో ఒకటి కూడా లేదు. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామం కోసం ప్రజలను సమాయత్తం చేయడానికి ఆమె పర్యటన ప్రారంభించింది. పాట్నా, లక్నో, వారణాసి, బొంబాయి, నాగపూర్, మద్రాస్ తదితర ప్రముఖ నగరాల్లో ఆమె ప్రజలను ఉద్దేశించి ప్రసంగించింది. దాంతో ఆంగ్లేయులకు బాగా కోపం వచ్చింది. కానీ ఆమెను వాళ్లు అణచలేకపోయారు. పైగా నివేదితను కలవడానికి బ్రిటన్‌కు చెందిన ప్రముఖులు ఆసక్తి చూపటంతో ఆంగ్లేయులు మరింత ఇరకాటాన పడ్డారు. బ్రిటన్‌కు కాబోయే ప్రధానమంత్రి రేమ్సే మెక్‌డొనాల్డ్, లేడి మింటో (ఆమె భర్త ఆతర్వాత భారత్‌కు వైస్రాయ్ అయ్యారు) నివేదిత స్కూల్‌కి వచ్చి, భారతీయ మహిళలకు ఆమె శిక్షణ ఇవ్వడాన్ని అభినందించారు.

**జీవితంలోని సన్నివేశాలన్నింటినీ క్రీడలలా చూచే మనస్సు యోగాభ్యాసానికి పనికివస్తుంది.**

నివేదిత తన పాఠశాలను జాతీయతకు కేంద్రంగా మార్చింది. బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన 'వందేమాతరం' గీతం ఆమె స్కూలులో ప్రార్థనా గీతం అయ్యింది. ఆవిడ ఖాదీ వస్త్రాలనే ధరించేది. అందుకోసం ఆమె ప్రతిరోజు రాట్నం వడికేది. ఆమెను చూసి ఆ స్కూలు పిల్లలు కూడా రాట్నం వడకటం ప్రారంభించారు.

బెంగాలీ సాంస్కృతిక రంగంలో విప్లవాన్ని తీసుకురావటం కూడా నివేదితకే చెందింది. పేరు ప్రఖ్యాతు లున్న కళాకారుల్ని ఆమె ప్రోత్సహించింది. అంతే కాకుండా వాళ్లకు ఆర్థికంగా సాయం చేసింది. భారతదేశంలోని నలుమూలలా ఉన్న అజంతా, ఎల్లోరా తదితర కళాకేంద్రాల్ని దర్శించడానికి వారికి సహాయపడింది. ఆ ప్రాచీన భారతీయకళ నుండి స్ఫూర్తి పొందడానికి కృషి చేసింది. ఈ కళాకారుల్లో రవీంద్రనాథ్ ఠాగూర్, నందలాల్ బోస్, ఆసిల్ హల్దర్ తదితరులు ఉన్నారు.

నివేదిత భారతీయుల్లో జాతీయతను జాగృత పరచడానికి ఎన్నో పుస్తకాలను రచించింది. వాటి ద్వారా వేదాలు, పురాణాల గొప్పతనాన్ని ప్రజలకు తెలియచెప్పింది. భారతదేశంలోని విభిన్న రీతుల శిల్పకళల్లో ఏకత ఉందన్న విషయాన్ని ఆమె ప్రజలకు చెప్పడానికి తీవ్రంగా కృషి చేసింది.

మాతా శారదాదేవి ప్రేరణకు నివేదిత ఓ సజీవ ఉదాహరణగా నిలిచింది. అలానే రవీంద్రనాథ్ ఠాగూర్, గోపాలకృష్ణ గోఖలే, రమేష్ చంద్ర దత్, బిపిన్ చంద్ర పాల్, అరవింద్ ఘోష్ వంటి రాజకీయ నేతలకు ఆమె ఓ మార్గదర్శిగా, గొప్ప స్నేహితురాలిగా అయ్యింది. యువతకు నివేదిత ఓ ఆదర్శంగా నిలిచింది. భారతదేశానికి చెందిన అగ్రరాజకీయనేతలు బాలగంగాధర తిలక్, మహాత్మాగాంధీ ఆమె దగ్గరకు వచ్చి ఆమెపట్ల ఆదరణను వ్యక్తం చేసేవారు.

## అంతిమయాత్ర

నివేదిత ఎప్పుడూ సేవా కార్యక్రమాలలో నిమగ్నమై ఉండేది. విశ్రాంతి అంటే ఏమిటో ఆవిడకు తెలియదు.

1905వ సంవత్సరంలో ఆమె అనారోగ్యానికి గురైంది. కొద్దిరోజులకు ఆమె కోలుకుంది. కాని విశ్రాంతి మాత్రం లభించలేదు.

అదే సమయంలో ఆంగ్లేయులు బెంగాల్‌ని విభజించారు. దానికి వ్యతిరేకంగా ఆందోళన మొదలైంది. ఆ ఆందోళనలో నివేదిత స్వయంగా పాల్గొంది. ఆ తర్వాతి సంవత్సరం తూర్పు బెంగాల్‌లో పెద్ద ఎత్తున వరదలు వచ్చాయి. తర్వాత కరవు వచ్చింది. కాలినడకన మైళ్ల దూరం నివేదిత నడిచింది. గ్రామగ్రామానికీ వెళ్లి కరవు, వరద బాధితులకు సహాయం అందించసాగింది.

ఆవిడ ఆరోగ్యం మరింత దెబ్బతినసాగింది. ఆరోగ్యం పూర్తిగా పాడైపోయాక నివేదిత తన అంతిమ కోర్కెను తెలియచేసింది. ఆమె తన దగ్గర ఉన్న సంపద, నగదు మొదలైన వాటిని బేలూరు మఠంకు సమర్పించింది. అంతే కాకుండా తన రచనలకు సంబంధించిన కాపీరైట్ ద్వారా వచ్చే ధనాన్ని కూడా మఠంకే సమర్పించాలని తెలియచేసింది. ఆ నిధితో భారతీయ మహిళలకు జాతీయ శిక్షణ ఇవ్వాలన్నది ఆమె కోరిక.

అక్టోబర్ 13వ తేదీ ఉదయం. ఆరోజున నివేదిత డార్జిలింగ్‌లో ఉంది. తన నిమిత్తం లేకుండానే ఆమె "చుక్కాని లేని నా జీవిత నౌక ఇప్పుడు మునిగిపోవాలనుకుంటూంది... కానీ నాకు ఉజ్వల భవిష్యత్తు తాలూకు వెలుతురు కనిపిస్తోంది" అని అంది. అంతే! అవే సోదరి నివేదిత ఆఖరి మాటలు.

సర్ జగదీశ్‌చంద్ర బోస్ సోదరి నివేదిత జ్ఞాపకార్థం ప్రసిద్ధ వైజ్ఞానికశాలను స్థాపించారు. జ్యోతిర్మయి నివేదిత ప్రతిరూపంగా అక్కడ ఆయన కాగడా పట్టుకున్న ఓ మహిళ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

హిమాలయ సానువుల్లో ఆమె సమాధి చేయబడింది. ఆ సమాధి మీద "భారతదేశం కోసం తన సర్వస్వాన్నీ అర్పించిన సోదరి నివేదిత ఇక్కడ దీర్ఘ నిద్రలో ఉంది." అని వ్రాయబడింది.

ఆరోజున సోదరి నివేదిత ప్రారంభించిన చిన్న పాఠశాల ఈ రోజున పెద్ద సంస్థగా అవతరించింది.

–ప్రభు శంకర

**శిష్యుణ్ణి వెతుక్కుంటూ గురువు వస్తాడు. శిష్యుడు గురువును వెదకగలగడం అసంభవం.**

## దేవతా విజ్ఞానం

# దేవతల వాహనాల రహస్యాలు

మన ధర్మ గ్రంథాలలో ప్రతి దేవతకు ఒక్కొక్క వాహనం చెప్పబడింది. వినాయకుడు - మూషికం (ఎలుక), సరస్వతి - హంస, లక్ష్మి - గుడ్లగూబ, దుర్గ - సింహం మొదలగునవి.

వాహనాల స్వరూపాన్ని ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే - అత్యంత సూక్ష్మమైన, అద్భుతమైన ధర్మ రహస్యాలు దృష్టిగోచరమవుతాయి. ఈ రహస్యాలు వెలుగు చూస్తే మనిషి ఆంతరిక స్థితి ఎటువంటి తుఫానులకు చలించనంత దృఢంగా తయారవుతుంది.

ఈ స్థితికి వచ్చే వరకు 'ధర్మం' స్థిరంగా ఉంటుంది. ధర్మంలో ఉండడం వలన ఈ ధర్మరూప సాధన దాని సాధనగా రూపొందుతుంది. మానవ జీవన వాస్తవిక ప్రారంభం ఇక్కడే జరుగుతుంది. అపుడు అతడు పరమపద ప్రాప్తి దిశగా నిరంతరం ప్రగతిని సాధిస్తుంటాడు.

### కర్మఫలాలను అపహరించే ఎలుక వాహనం

వినాయకుడు సిద్ధులను ఇచ్చేవాడు. విఘ్న బాధలను హరించేవాడు. బుద్ధికి అధిష్టాన దేవత.

వినాయకుని వాహనం ఎలుక. అధర్వణ వేదం సాయణ భాష్యంలో ఇలా వ్రాసి ఉంది - 'ముష్ణాతి అపహస్తి కర్మఫలాని ఇతి మూషక.'

జీవుల కర్మఫలాలను అపహరించడమే వినాయకుని వాహనమైన మూషికం ప్రముఖ కర్తవ్యం. జీవుని, శివుని కలయికకు కర్మఫలమే ముఖ్యంగా అడ్డుపడుతూ ఉంటుంది. కర్మఫలం మిగిలిఉన్నంతవరకు జీవి శివునిలో ఎలా కలవగలదు?

### ఎలుక రూపంలో మనసు

వినాయకుడు, మూషిక వాహనం గురించి ఒక కవి ఇలా వ్రాశాడు -

'మన్ మూషక్ పర్ గజ తన భారీ!'

గజంతో సమానమైన మానవ శరీరానికి వాహనం సూక్ష్మ మనసు రూపంలో ఉన్న మూషికమే. వాహనం స్వచ్ఛందంగా ఉంటే వాహనారూఢుడు అస్థిరం కావడం స్వాభావికం. కాని నియంత్రించిన మీదట మనసు ఏకాగ్రత పొంది సాంసారిక సుఖాలను పొందడం మొదలుకొని భగవత్ ప్రాప్తివరకు వెళ్తుంది.

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।"

మనసే మానవప్రాణి బంధనానికి, మోక్షానికి కారణం.

ఈ విధంగా మనసు రూపంలోని మూషికం యొక్క వాస్తవ రూపం తెలిపిన తరువాత మనిషికి తాత్విక జ్ఞానం కలగడంలో ఆలస్యం జరగదు. ఆత్మ జ్ఞానానికి అతడు అధికారి కాగలుగుతాడు. మనసురూపంలోని మూషికం అసలు స్వరూపం ముందుకు వచ్చిన వెంటనే, దాని చంచలత్వం పలాయనం చిత్తగిస్తుంది. అది బాధ్యతగా, స్థిరంగా ఉండవలసి వస్తుంది. స్థిరమైన మనసే సంసారంలోని సమస్త సాధనలను సఫలీకృతంచేసే అత్యుత్తమ సాధనం.

### హంస వివేకానికి ప్రతీక

సరస్వతి విద్య, వాక్కుల అధిష్ఠాత్రి. సరస్వతి వాహనం - హంస. 'హన్' ధాతువు నుండి హంస తయారైంది.

నీరు - పాల వివేకం - పాలను పాలుగా, నీరును నీటిగా వేరుచేయడం హంసకు మాత్రమే ఉన్న లక్షణం. మానస సరోవరం దాని నివాసం. ముత్యములు ఏరడం దాని ప్రాథమిక కర్తవ్యం. పక్షులలో శ్రేష్ఠమైనదిగా అది పూజనీయమైనది.

సరస్వతీ కృపకు పాత్రులం అయితే పాలూ, నీరూ వేరు చేసే వివేకం వస్తుంది. అనగా - మాయలతో కలగలసి, లీనమైపోయిన మనం సంసారంలో మాయ, బ్రహ్మలను వేరుచేసేందుకు సమర్థులమవుతాము. మాయ అనే జలాన్ని త్యజించి బ్రహ్మ అనే పాలను త్రాగుతాము. బ్రహ్మపథాన్ని పొందుతాము.

వాగ్దేవి సరస్వతి వాహనం యొక్క ఎంత అద్భుత రహస్యం ఇది? అంతేకాక, సరస్వతీ కృపాపాత్రులు లోకంలో వాడుకలోలేని

**యోగికి భార్య, పిల్లలు.... అన్నీ ఉంటాయి. కాని అంటుకునేందుకు ఏమీ ఉండదు.**

అనేక ఆధ్యాత్మిక రహస్యాలు తెలుసుకొని తమ జీవనాన్ని సఫలీకృతం చేసుకుంటారు. వారి జీవితం ధన్యమవుతుంది.

## మూర్ఖత్వానికి ప్రతీక గుడ్లగూబ

లక్ష్మిని సామాన్య దృష్టిలో ధనం, ధాన్యం, సమృద్ధి, ఐశ్వర్యాలకు అధిష్ఠాన దేవత అంటారు. కాని లక్ష్మియొక్క అత్యున్నత రూపం శేషశయ్యపై ఉన్న విష్ణుభగవానుని అర్ధాంగి.

కనుక లోక భావనలకు అనుగుణంగా లక్ష్మి వాహనం గుడ్లగూబ. ఆధ్యాత్మిక దృష్టిలో పగటి గ్రుడ్డితనానికి, మూర్ఖత్వానికి ప్రతీక. సాంసారిక లక్ష్మి అధిపతి ఉలూక ధర్మాన్ని పాటిస్తూ ఆత్మజ్ఞాన రూపంలోని సూర్యుడిని చూడలేడు. సూర్యరూప కాంతి పుంజాలు వారికి అంధకార సమూహంగానే కనిపిస్తాయి. అలాంటి వ్యక్తులు ఆధిభౌతిక సుఖాలనే తమ సర్వస్వంగా భావించి మాయాబద్ధులుగానే ఉండిపోతారు. కనుక ఋతమార్గంలో, హృదయ కేంద్రంలో ఉంటూనే మాయ అనే మృగతృష్ణ వెనుక భ్రమలో పడి ఉంటారు.

మరోవైపు కమలాక్షి, విష్ణుభగవానుని అర్ధాంగి అయిన లక్ష్మిని ఆరాధించేవారు పరమపావన కళ్యాణకారి అయిన లక్ష్మిని పొంది, భుక్తికి, ముక్తికి అధికారులవుతారు. వారిలో శేష భగవానుని స్వరూపం ప్రస్ఫుటమవుతుంది. వారు జీవితంలో కృతార్థులవుతారు. లక్ష్మీదేవి పరమధామాన్ని పొంది ధన్యులవుతారు.

## సింహం పౌరుషానికి ప్రతీక

దుర్గాదేవి భుక్తిని, ముక్తిని ప్రసాదించే శివుని శాశ్వత శక్తి. దుర్గా ఉపాసకులు ఒక వైపు శక్తిశాలురై మదాంధులవుతూనే తమ జీవితాన్ని నాశనం చేసుకొని శివత్వాన్ని పొందుతారు.

దుర్గ వాహనం సింహం. సింహం బలానికి, పౌరుషానికి ప్రతీక. అలాగే జంతువులకు, అడవులకు రాజు.

సింహం హింసాపూరితమైన ప్రాణి. కాబట్టి దుర్గా ఉపాసకులలో కూడ బలం, పౌరుషం ఉదయిస్తాయి. సింహ స్వభావం ఉంటుంది. సకామ సాధనలో వ్యక్తులు తమ శత్రువులను నిర్జించడంలో సమర్థులు కావడమే కాక మదాంధులవడం కూడ చూడవచ్చు. అన్నింటా విజయం సాధించిన వారిలో నిరహంకారులు చాలా తక్కువ. అందువలనే శక్తిశాలురు ఎక్కువగా పతనోన్ముఖులవుతారు.

కాని నిష్కామ సాధకులలో వచ్చే బలం, పౌరుషం, సింహత్వం, హింసా భావనలు వారి జీవత్వ హింసకు కారణంగా మారతాయి. వారికి శివత్వం లభిస్తుంది. వారు శివులుగా తయారవుతారు.

## ధర్మానికి ప్రతీక వృషభం

శివ భగవానుని వాహనం వృషభరాజైన నందీశ్వరుడు. 'వృషభ' పదంలో ధర్మబోధ ఉంది. నంది వర్ణం తెలుపు. తెలుపు సత్వగుణాన్ని సూచిస్తుంది. నందీశ్వరుని నాలుగుపాదాలు ధర్మానికి నాలుగు స్తంభాలు - తపస్సు, శుద్ధి, దయ, దానం.

శివ భగవానుని చరణామృత పానానికి వృషభ రూపంలో ఉన్న ధర్మాన్ని తెలుసుకోవడం అనివార్యం. నాలుగు పాదాల ధర్మాన్ని పాలించడంతో మనకు శివలోకం ప్రాప్తిస్తుంది. మనం భోళాశంకరుని కృపాపాత్రుల మవుతాము. మనకు బ్రహ్మామార్గం సుగమం అవుతుంది.

## గరుడుడు దీర్ఘదృష్టికి ప్రతీక

విష్ణు భగవానుడు లక్ష్మికి స్వామి. సృష్టి పాలనాశక్తికి ప్రతీక. ఈ పరమచైతన్య స్వరూపం ముక్తికి మార్గంగా భావించబడుతోంది. కౌస్తుభమణి విభూషితుడైన విష్ణువు యొక్క వాహనం గరుడుడు.

దీర్ఘదృష్టికి గరుడుడు ప్రసిద్ధి. సర్పాలు అతని ఆహారం. ఆకాశంలో ఎంతదూరమైనా విహరించే అద్వితీయ సామర్థ్యం గరుడ పక్షికి ఉంది.

గరుడ స్వభావి అయిన మనిషి ఈ నిస్సార సంసార ఆసక్తి అనే కుటిల సర్పాన్ని భక్షించడంలో సమర్థు డవుతాడు. దీర్ఘదృష్టి అనే అంతర్‌దృష్టిని పొంది తన ఇష్టదేవత సాక్షాత్కారాన్ని పొంది విష్ణుపద ప్రాప్తుడవుతాడు.

ఈ విధంగా గరుడ రూపంలోని వేదాలలోని జ్ఞానం - కర్మ అనే రెండు రెక్కల ఆశ్రయాన్ని పొంది సుదూర ఆకాశంలో విహరించే శక్తిని మనిషి తనలో ఉత్పన్నం చేసుకుంటాడు. అపుడు విష్ణు భగవానుడు హృదయాసనం మీద విరాజిల్లి అతడిని ధన్యుడుగా చేస్తాడు.

అనువాదం- డి.వి.ఆర్.మూర్తి

H H H

**దైవభీతి పశు లక్షణం. దైవ భక్తి దివ్య లక్షణం.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 5

# అన్నమయ కోశాన్ని క్షాళనచేసే ఉపవాసం

రోగి శరీరము మలభారముతో కూడి ఉన్నప్పుడు చతురుడైన వైద్యుడు అతనికి విరేచనములకు మందును ఇస్తాడు. విరేచనములు కావడం వలన పొట్టలో భారం తగ్గుతుంది. కాని చిరకాలము నుండి విరోచన బద్ధకం కలవారికి ఈ పద్ధతి ఉపకరించదు. దీనికి ఉపవాసమే మంచి మందు. అది అన్నమయ కోశము నందలి అనేక సూక్ష్మ వికృతులను మార్పు చేస్తుంది.

స్థూలంగా ఉపవాస ప్రయోజనం అందరికీ తెలుసు. కడుపులో అపక్వంగా ఉన్న ఆహారం పక్వమవుతుంది. విశ్రాంతి వలన జీర్ణకోశము నవచేతన పొంది ద్విగుణీకృతంగా పని చేస్తుంది. అన్నాశయంలో చేరిన అపక్వాన్నము వలన ఉత్పన్నమయ్యే విషపదార్థాలు ఉత్పన్నం కావు. ఆహారాన్ని పొదుపు చేయటం వలన ఆర్థిక లాభం కలుగుతుంది. స్వల్పాహారం తీసుకునేవారు దీర్ఘకాలం జీవిస్తారని డాక్టర్లకు నిష్కర్షగా తెలుసు. ఎక్కువగా తింటూ, బలవంతంగా పొట్టలో కుక్కుకుంటూ ఒక్కరోజైనా కడుపుకు శెలవీయకుండా తింటుండేవారు తమ జీవితాన్ని త్వరలో సమాప్తి చేసుకుంటారు.

గీత యందు "విషయా విని వర్తంతే నిరాహారస్య దేహినః" అనే శ్లోకంలో ఉపవాసము వలన విషయ వికారములు నివృత్తి చెందుతాయని చెప్పబడింది. మనస్సును విషయ వికారముల నుండి రహితం చేయడం గొప్ప మానసిక లాభము. ఇది మనసులో ఉంచుకొనియే మన పూర్వులు అన్ని శుభకార్యములకు ఉపవాసాన్ని జోడించారు. కన్యాదాన దినమున మాతాపితలు ఉపవసిస్తారు. దేవీ నవరాత్రులలో ఎందరో స్త్రీ పురుషులు సంపూర్ణంగానో, పాక్షికంగానో ఉపవాసం చేస్తారు. బ్రాహ్మణుల భోజనము కాకుండా ఆ రోజు ముందుగా ఇంటిలో ఎవరూ భోజనం చేయరు. స్త్రీలు భర్త, అత్తమామలు భోజనం చేయనిదే తాము భుజించరు. ఇట్టి అంశిక ఉపవాసములు చిత్తశుద్ధి పెంపొందించు దృష్టితో విధించబడినవే.

స్వాధ్యాయం దృష్టితో చూస్తే ఉపవాసమునకు అసాధారణ మహత్తు కలదు. రోగులకు ఉపవాసాన్ని జీవన మూలంగా పేర్కొంటారు. చికిత్సా శాస్త్రంలో రోగులకు ఒక దైవీ ఉపదేశం ఉన్నది. లంఘనం (ఉపవాసం) పరమౌషధం అని. కష్టసాధ్య, ప్రమాదకర అంటువ్యాధులకు లంఖణం (ఉపవాసము) ఒక ముఖ్య ఔషధముగా చెప్పబడినది. న్యుమోనియా, టైఫాయిడ్, కలరా, ప్లేగు మొదలైన రోగములతో బాధపడేవారికి వైద్యులు తప్పనిసరిగా ఉపవాసాన్ని నిర్దేశిస్తారు. ప్రకృతి చికిత్సలో సంపూర్ణంగా గానీ, పాక్షికంగా గానీ ఉపసించడము ప్రధాన చికిత్సగా ఉన్నది.

ఇది తథ్యమని మన ఋషులు చక్కగా తెలుసుకొన్నారు. ప్రతినెలలోనూ ఏకాదశి మొదలైన పుణ్యతిథులలో ఉపవాసం విధించారు.

అన్నమయ కోశాన్ని శుద్ధి చేయడానికి ఉపవాసమునకు విశేష ఆవశ్యకత వున్నది. శరీరంలోని "ఉపత్యికా" కేంద్రములను శరీర శాస్త్రజ్ఞులు నాడీ గుచ్ఛములని పిలుస్తారు. కొన్ని స్థానాలలో కొన్ని సూక్ష్మ నాడీ తంత్రులు కలుస్తాయి. కొన్ని చోట్ల గోలీలలాగా ముడివేసుకుని ఉంటాయి.

కొన్నిచోట్ల ఈ నాడులు సర్పముల వలె సమానాంతరముగా ఉంటాయి. శిరస్సు కలుసుకొని ఉంటుంది. కొన్ని చోట్ల వటవృక్షము వలె శాఖోపశాఖలుగా విచ్చుకొని ఉంటాయి. ఈ విధములైన గుచ్ఛములు కొన్ని కలిసి విస్తృత మండలము నేర్పరచుకొంటాయి. వీని రంగు, ఆకారము, అనుచ్ఛేదనములలో చాలా తేడాలుంటాయి. వీని ఉష్ణోగ్రత, అణు పరిక్రమణము, ప్రతిభా పుంజములలో తేడాలుంటాయి.

వైజ్ఞానికులకు ఈ నాడీగుచ్ఛకము కార్యక్రమములను గురించి విశేష పరిచయం లేదు. కానీ యోగులకు ఈ ఉపత్యికలు శరీరమందలి అన్నమయ కోశమును బంధించు గ్రంథులుగా తెలుసు. మరణ సమయంలో ఈ బంధములు విడి పోయి ఒక గ్రంథి కూడ కనుపించకుండపోతుంది. ఈ ఉపత్యికలు అన్నమయ కోశము యొక్క గుణదోషములకు ప్రతీకలు.

"ఇంధక" జాతి ఉపత్యికలు చంచలత్వము, అస్థిరత్వము, ఉద్విగ్నతలకు ప్రతీకలు. ఈ ఉపత్యికలు శరీరములో ఎక్కువగా

**తపస్సు చేయడం అంటే మనలోపల ఉన్న దివ్య తేజస్సు వెలగడం కోసం వేడిని పుట్టించడం.**

కలవారు ఒకచోట కూర్చొని పని చేయలేరు. ఎప్పుడూ తిరుగుతూ ఉంటారు.

'దీపికా' జాతి ఉపత్యికలు ఆవేశము, కోపము, వేడి, ఆకలి మొదలైన వాటికి కారణము. ఇవి ఎక్కువగా కలవారికి, చర్మరోగములు, కురుపులు, వ్రణములు, ముక్కు వెంట రక్తము కారటము, పసుపు పచ్చని మూత్రం, కళ్ల మంటలు మొదలైన వ్యాధులు వస్తాయి.

"మోచక"ముల ఆధిక్యత వలన చెమట ఎక్కువగా పట్టటం, చొంగ, మూత్రము, మలము ఎక్కువగా విసర్జింప బడుట జరుగుతుంది.

"ఆప్యాయనీ"జాతి గుచ్ఛకముల వలన సోమరితనం, అధికనిద్ర, ఉత్సాహము లేకపోవుట, శరీరము లావెక్కిపోవుట సంభవిస్తాయి. అట్టి వ్యక్తి ఏమాత్రం శ్రమకు ఓర్చలేడు. శారీరిక, మానసిక కార్యకలాపాలలో ఉత్సాహం తగ్గిపోతుంది.

"చంద్రికా"జాతి ఉపత్యికలు సౌందర్యాన్ని పెంచుతాయి; వాక్కులో మాధుర్యాన్ని, నేత్రములలో మాదకతను, ముఖము నందు ఆకర్షణను కోమలత్వమును, మోహకత్వమును పెంపొందించుతాయి.

"కపిల" కారణంగా నమ్రత, భయము, గుండెదడ, దుఃస్వప్నములు మెదడుకు అస్థిరత్వము, నపుంసకత్వము, వీర్యరోగము కలుగుతాయి.

"ధూస్వారీ"వల్ల సంకోచనశక్తి పెరుగుతుంది. కురుపులు దీర్ఘ కాలం పక్వానికి రావు. కఫం బహు కష్టంమీద వెలువరించబడుతుంది. మైల ఎక్కువగా ఆలస్యం అవుతుంది. మనస్సులోని మాట బయటకు చెప్పలేరు. ఆయాసం ఎక్కువౌతుంది. శరీరంలో వేడి పెరుగుతుంది. కోపము త్వరగా వస్తుంది. తొందరపాటు ఎక్కువవుతుంది. రక్తప్రసరణము, శ్వాస ప్రక్రియ తీవ్రగతిని పొందుతాయి.

"అమాయ" వర్ణగుచ్ఛకముల వలన దారఢ్యము, బలము, కఠోరత్వము, గాంభీర్యము, మొండితనము ఏర్పడతాయి. ఈ విధంగా శరీరము మీద బాహ్య ఉపచారముల ఫలితం ఉండదు. మందులు పనిచేయవు. రోగము దానంతటది తగ్గిపోవలసిందే. రోగి పథ్యము జాగ్రత్తగా చేయాలి. లేకుంటే తరువాత సంయమనము, నియమపాలన కూడ పనిచేయవు. డాక్టర్ల చికిత్స కూడ అనేకమార్లు విఫలంకావడం కద్దు. దానికి కారణం– ఉపత్యికల స్థితి కారణంగా శరీరముయొక్క సూక్ష్మస్థితిపై మందుల ప్రభావం ఉండదు.

'ఉద్గీయ' ఉపత్యికల యొక్క అభివృద్ధి వలన సంతానము కలుగదు. స్త్రీ పురుష లిరువురు ఆరోగ్యవంతు లయినా సంతాన ప్రాప్తి ఉండదు.

స్త్రీ పురుషులలో ఎవరియందు 'అసితా' అనే ఉపత్యికలు ఎక్కువగా ఉంటే ఆ లింగానికి చెందిన సంతానము కలుగుతుంది."యుక్త హింస్రా" అనే గుచ్ఛకము వలన క్రూరత్వము, దుష్టత్వము, పరపీడనము ప్రేరేపించబడతాయి. అట్టివారికి దొంగతనము, జూదము, వ్యభిచారము, దోపిడి మొదలైన దుర్గుణాలు అలవడతాయి. ధనవంతులైనా ఈ బుద్ధులు తప్పక వస్తాయి. ఈ కారణముగా ఇతరులపై ఈర్ష్యా ద్వేషములు, తగవులు పెరుగుతాయి. ఇట్టివారికి మాంసాహారం, మద్యపానము, వేట, హత్యలు, దోపిడీలు, ఎక్కువ ఇష్టము.

"హింస్రా" ఉపత్యికలు పనిచేస్తే అలజడులు సృష్టిస్తారు. అట్టివారు తల పగులకొట్టుకొని ఆత్మహత్య చేసుకోవచ్చు. తమ పిల్లలనే హింసించుట మొదలైన పాడుపనులు చేస్తారు.

ఇంతకుముందు వర్ణింపబడినవి కాక ఉపత్యికలు 96 జాతులు ఉన్నాయి. ఇంకా ఎక్కువ కూడా ఉండవచ్చు. ఈ గ్రంథుల వలన శరీరాన్ని మన ఇచ్చవచ్చినట్లు ఉంచలేకపోతున్నాము. మనుష్యుడు తన శరీరాన్ని తమ విలక్షణ క్రియలు, ప్రేరణలు ఉత్పన్నం చేస్తాయి. బాహ్య ప్రయత్నములచే వీనిని అదుపు చేయలేం. మన అసహాయత వ్యక్తం చేయవలసి వస్తుంది.

అన్నమయ కోశమును శరీరముతో బంధించి ఉంచే ఈ ఉపత్యికలు శారీరక, మానసిక వికర్మలవలన చిక్కుపడి వికృత మవుతాయి. అటులే సత్కర్మల వలన సువ్యవస్థితంగా ఉంటాయి. దురాచరణ అంటే తన గొయ్యి తాను త్రవ్వుకోవటం వంటిది. ఈ గోతిలో పడి, రోగ శోకాది పీడలతో బాధపడవలసిందే. ఈ చిక్కులనుండి విడివడడానికి ఆహారమును సాత్వికంగా సంయమపూర్వకంగా ఉంచడం, దినచర్యలో క్రమశిక్షణ పాటించడం, ప్రకృతియొక్క ఆదేశాల ప్రకారం సంచరించడం

**గురుశిష్య సంబంధమనేది ఇండక్షన్ మెథడ్. సాన్నిధ్యం. అయస్కాంతం–ఇనుపముక్క సంబంధం.**

ఆవశ్యకములు. కొన్ని యౌగిక ఉపచారముల ద్వారా కూడ ఆంతరంగిక వికారములను అదుపు చేయవచ్చు. కేవలం బాహ్యోపచారములతో సరిచేయడం కష్టము.

ఉపవాసములతో ఉపత్యికల సంశోధనము, పరిమార్జనం, సునంతులనములకు సన్నిహిత సంబంధమున్నది. యోగ సాధనలలో ఉపవాసము గురించి విస్తృత విజ్ఞానమున్నది. ఈ సమయంలో, ఈ మాసంలో, ఈ ముహూర్తంలో, ఈప్రకారము ఉపవాసముంటే ఈ ఫలితం లభిస్తుంది - ఇట్టి ఆదేశములు శాస్త్రములలో పలుచోట్ల దర్శనమిస్తాయి. ఋతువులను అనుసరించి శరీరమునందలి ఆరు అగ్నులు ఎక్కువ తక్కువగా ఉంటాయి. ఊష్మ, బహు, వృచ, హ్యావాధీ, రోహితా, ఆతృతా, వ్యాతి ఈ షడగ్నుల పేర్లు. గ్రీష్మము నుండి వసంతమువరకు ఈ ఆరు అగ్నులు క్రియాన్వితంగా ఉంటాయి. వీనికి ప్రత్యేకమైన గుణములు కలవు.

1. ఉత్తరాయణ దక్షిణాయనముల గోళార్ధస్థితి 2. చంద్రునియొక్క వృద్ధి క్షీణ కళలు 3. నక్షత్రముల నుండి భూమి మీద పడు శక్తి ప్రభావము 4. సూర్యుని అంశకిరణముల మార్గము. ఈ నాల్గింటికీ శరీరంలోని ఋతు అగ్నులకు గల సంబంధము వలన ఏ పరిణామములు కలుగుతాయో మనస్సులో ఉంచుకొని ఋషులు పుణ్య పర్వములను నిశ్చయించి, అందు నిర్ణీత విధి ప్రకారము ఉపవాసము ఉంటే ఈ ఫలితం వస్తుందని తెలియజెప్పారు. కార్తీక శుక్లచతుర్ధి (నాగుల చవితి) నాడు ఉపవాసముంటే దాంపత్య ప్రేమ అధికమవుతుంది. దానికి కారణం: ఆరోజు గోళార్ధస్థితి, చంద్రకళలు, నక్షత్ర ప్రభావము, సూర్యమార్గము వీటన్నిటి కలయిక వల్ల ఏర్పడిన పరిణామము శరీరగత అగ్నితో కూడి సమన్వితమై శరీరస్థితి చిరకాలం సుదృఢమై దాంపత్య జీవితానికి మిక్కిలి దోహదకారి అవుతుంది.

ఈ విధంగానే ఇతర వ్రతములు, ఉపవాసములు అనేక కోరికలను, ఆవశ్యకతలను పూర్తిజేసి క్లిష్ట అనిష్టములను నివారించుటకు తోడ్పడును.

ఉపవాసములలో పంచ భేదములున్నవి. 1. పాచక 2. శోధక 3. శామక 4. ఆనస 5. పాధక. పాచకోపవాసము కడుపులోని అపక్వాన్నమును, అజీర్ణాన్ని, మలబద్ధాన్ని పోగొడుతుంది. శోధకోపవాసము రోగులను ఆకలిగా ఉంచడానికి తోడ్పడుతుంది. దీనినే లంఖణ మంటారు. శామకము చెడు తలంపులను, మానసిక వికారములను, దుష్ప్రవృత్తులను పోగొట్టి ఉపత్యికలను శమింపజేస్తుంది. ఆనసము దైవీశక్తిని ఆకర్షించు విశేష ప్రయోజనము నుద్దేశించి చేయునది. ఎవరెవరి ఆత్మిక, మానసిక స్థితులను బట్టి వారికి అట్టి ఉపవాసము ఉపయుక్త మగును. దానికి అవలంబింపవలసిన నియమోప నియములను నిర్ణయించుటకు సూక్ష్మవివేచన అవసరం.

సాధకుని అన్నమయ కోశ స్థితి ఎట్లున్నది? వీనిలో ఏ ఉపత్యికలు వికృతమైయున్నవి? ఏ ఉత్తేజిత ప్రదేశములను శాంత మొనరించవలె? ఏ మర్మ స్థానమును సతేజమొనరించు ఆవశ్యకత కలదు? వీరిని చూచి ఆ వ్యక్తి ఏ ఉపవాసము చేయవలెనో నిర్ణయించాలి.

పాచక ఉపవాసములో అవసరమైనంత కాలము ఆహారాన్ని తీసుకోకుండా ఉండాలి. తడవకు ఒకరోజు లేదా 2 రోజులు అజీర్ణం తగ్గేవరకు ఉపవాసం ఉండాలి. ఆ సమయంలో నీరు, నిమ్మకాయరసం, మందులు మాత్రమే తగుమాత్రం పుచ్చుకోవాలి.

శోధక ఉపవాసమందు ఉపవాసముతోపాటు విశ్రాంతి కూడా ఉండాలి. రోగి ప్రమాద స్థితిని దాటనంతవరకు ఇది అవసరము. చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగించాలి.

శామక ఉపవాసమందు పాలు, పండ్ల రసము, మజ్జిగ మొదలైన తేలికపాటి, సంయుక్తమైన, బలహీనమైన పదార్థములను మాత్రమే వాడాలి. ఈ ఉపవాసకాలమందు స్వాధ్యాయము, ఆత్మచింతన, ఏకాంతము, సేవనము, మౌనము, జపము, ధ్యానము, పూజ, ప్రార్థన మొదలగు ఆత్మశుద్ధి నొసగు ఉపచారములు అవసరము.

"ఆనస" ఉపవాసమందు సూర్యకిరణముల ద్వారా అభీష్ట దైవీ శక్తిని ఆహ్వానం చేయాలి. సూర్యుని యందు నవగ్రహముల యందు రాహు కేతువులను విడిచి తక్కిన సప్తగ్రహముల శక్తి సమ్మిళితమై ఉంటుంది. సూర్యునియందు తేజస్సు, వేడి పిత్త ప్రకృతి ప్రధానములు. చంద్రునియందు చల్లదనము, శాంతి, ఉజ్వల కీర్తి ప్రధానములు. కుజుని యందు కఠోరత, బలము, సహాయత; బుధుని యందు సౌమ్యత, శిష్టత, కఫ ప్రాధాన్యము, సౌందర్యము,

**ప్రపంచంలో సుఖపడడానికి ఎవరికీ తెలివితేటలు ఉపయోగపడలేదు. పరస్పరత్వం ఉపయోగపడింది.**

ఆకర్షణ; గురువునుండి విద్య, బుద్ధి, ధనము, సూక్ష్మదర్శన శక్తి, శాసనము, న్యాయము, రాజ్యార్హత; శుక్రుని వలన వాక్చాతుర్యము, చాంచల్యము, ఉత్పాదక శక్తి, కూటనీతి; శనివలన స్థిరత్వము, స్థూలత్వము, సుఖోపభోగము, దారఢ్యము పరిపుష్టి లభిస్తాయి. ఏ గుణముల ఆవశ్యకత ఉన్నదో వారములో ఆరోజు ఉపవాసముండి అనురూప దైవీతత్వమును ఆకర్షించుకోవాలి. ఆ సమయంలో గ్రహమునకు సంబంధించిన లఘు ఆహారము, రంగు వస్తువులు, వస్త్రములు ఉపయోగించి ఫలితము వచ్చేటంతవరకు చేయాలి.

ఆదివారము : శ్వేతవర్ణము, ఆవుపాలు, పెరుగు, అన్నము.

సోమవారము : పసుపురంగు, బియ్యపుగంజి.

మంగళవారము : ఎరుపురంగు, గేదెపెరుగు లేక మజ్జిగ.

బుధవారము : నీలిరంగు, పులుపు, తీపిపండ్లు.

గురువారము : నీలిరంగు, తీయని పండ్లు.

శుక్రవారము : ఆకుపచ్చరంగు, మేకపాలు, పెరుగు, బెల్లం.

ప్రాతః కాలమునందు సూర్యకిరణముల సమ్ముఖమున కనులు మూసికొని నిర్ధారిత కిరణములు ప్రవేశిస్తున్నట్లు ధ్యానముచేస్తూ ఆ శక్తి సూర్యరశ్మి ద్వారా తనయందు అవతరితమగు చున్నట్లు భావించాలి.

పాచక ఉపవాసము ప్రాయశ్చిత్త స్వరూపముగా చేయవలెను. కేవలము జలమును మాత్రమే ఆ కాలమందు గ్రహించవలె. తన తప్పిదమును క్షమించవలసిందిగా భగవంతుని వేడుచూ అటువంటి తప్పు తిరిగి చేయనని ప్రమాణము చేయవలె. అపరాధము కొరకు శారీరిక కష్టసాధ్య తితీక్ష, శుభకార్యములకై ఎంతగా దానము చేయవలెనంటె – పాపముయొక్క వ్యధ, పుణ్యము యొక్క శాంతి రమారమి సమానముకావలె. చాంద్రాయణవ్రతము, కృచ్ఛ చాంద్రాయణ వ్రతము ఈ పాచక ఉపవాసములే.

ప్రత్యేక ఉపవాసములందు ఈ విషయములను విశేషరూపమున ధ్యానము నందుంచుకొనవలెను. 1.ఉపవాస సమయమున మంచినీరు తరచుగా పుచ్చుకోవాలి. 2.ఉపవాసమున్న రోజున అధిక శ్రమ చేయరాదు. 3. పాలు, పండ్లు మొదలైన బరువైన పదార్థములు కడుపునిండా తింటే ఉపవాసము వలన ప్రయోజనముండదు. 4. ఉపవాసము ముగించిన తర్వాత స్వల్పంగా తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. కడుపు నిండుగా భోజనం చేయరాదు. 5. ఉపవాసము చేసిన రోజున ఎక్కువ సమయాన్ని ఆత్మచింతన, స్వాధ్యాయము, ఉపాసన మొదలగు కార్యక్రమాలలో గడపాలి.

ఉపత్యికల శోధన, పరిమార్జన, ఉపయోగీకరణములకు బాగా తెలిసినవారి సలహా ప్రకారము ప్రత్యేక ఉపవాసములు చేయవలసివచ్చినా – సాధారణ ఉపవాసానికి ప్రత్యేకంగా గాయత్రీ ఉపాసకులకు ఆదివారం మంచిది. ఆరోజున సప్తగ్రహముల సమ్మిళిత శక్తి భూమిమీద ప్రసరిస్తుంది. అది వివిధ ప్రయోజనములకు ఉపకరిస్తుంది. ఆదివారం ప్రాతః కాలముననే స్నానంచేయ వీలు కలుగక పోతే కాళ్ళు, చేతులు, ముఖము కడిగి శుద్ధ వస్త్రములను ధరించి సూర్యునికి ఎదురుగా కూర్చొని విప్పారిన నేత్రాలతో సూర్యనారాయణుని దర్శించి కళ్ళుమూసుకొని గాయత్రీ తేజోపుంజమగు రవిమండలమును ధ్యానించాలి. ఈ సూర్యుని తేజోపుంజ రూపిణియగు సముద్రము నందు మనం స్నానముచేస్తున్నాము, ఆ తేజోపుంజము మనచుట్టూ ఆవరించి ఉన్నది – ఈ విధంగా ధ్యానిస్తూ సవితాశక్తి యొక్క బ్రహ్మరశ్మి తనలో ప్రవేశించి శరీరమంతటా నిండుతున్నట్లు భావించాలి. బయట ముఖం మీద సూర్యరశ్మి పడటం, లోపల ధ్యానాకర్షణ ద్వారా సూక్ష్మరశ్మిని పీల్చి ఉపత్యికలను సువికసితం చేయడానికి బాగా ఉపయోగపడుతుంది. ఈ సాధన 15 నుండి 20 నిమిషాలు చేయాలి. ఆరోజు తెల్ల వస్త్రములను అధికంగా ఉపయోగించాలి. ఇతర వస్తువులను కూడ తెల్లనివాటిని ఉపయోగించాలి. మధ్యాహ్నం 12 గం॥ తర్వాత ఫలాహారం చేయాలి. పూర్తిగా నిరాహారంగా ఉండగలిగిన వారు ఉండవచ్చు. లేనివారు పండ్లు, పాలు, శాకములు తీసుకోవచ్చు. బాలురు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, రోగులు, బలహీనులు అన్నము లేక గోధుమరవ్వతో చేసిన ఉప్మా మధ్యాహ్నం తీసుకుని రాత్రికి పాలు తీసుకోవాలి. ఉప్పు, చక్కెర అనే రుచిని కలిగించే రెండు పదార్థాలను విసర్జించి భోజనం చేయడం ఒకరకం ఉపవాసమే. ప్రారంభంలో అస్వాదు ఆహారంతో అంశిక ఉపవాసం చేయడం ఒకరకం ఉపవాసమే. ప్రారంభంలో అస్వాదు ఆహారంతో ఉపవాసం చేయడం వలనకూడ గాయత్రీ సాధకుడు తన ప్రవృత్తులను పెంపొందించుకొనవచ్చు.

H H H

**మౌనం అనేది మానసికం. అప్రయత్నంగా అక్కర్లేనివి మాట్లాడకుండా ఉండడం.**


## ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 22

# హిమాలయం నుండి ఆహ్వానం - 2

### శంకరమఠం వివాదం

జ్యోతి మఠంలో శంకరాచార్యుల విగ్రహం, పీఠం మొదటి అధిపతి త్రోటకాచార్యుని విగ్రహం ఉన్నాయి. అప్పుడు ఆలయంలో పీఠాధిపతి ఎవరూ లేరు. దక్షిణ భారతంనుండి నియమించబడిన పూజారి రావల్ మఠంలో పూజ, అర్చన చేస్తున్నారు.

సుమారు 150 సంవత్సరాలుగా అక్కడి ఆచార్య పరంపర విచ్ఛిన్నం అయింది. శంకరుని అవతారంగా పరిగణించబడే మహాపురుషుడు ప్రారంభించిన పరంపర దుర్గతి పాలుకావడం సంగతి విన్న శ్రీరామ్ హృదయం వ్యథచెందింది. రావల్ పురోహితులు ఆ వివరాలను తెలిపారు. వాటిని విన్న శ్రీరామ్ చాలాసేపు శంకరాచార్యుల విగ్రహం ఎదుట కూర్చుండిపోయారు. లేచి, మఠంలో స్థాపించబడిన స్ఫటిక శివలింగం దగ్గరకు వెళ్లారు. అక్కడ అభిషేకం చేశారు. శంకర గుహలో స్థాపించబడిన శివలింగాన్ని కైలాసంనుండి తెచ్చారని చెపుతారు. ఈ విషయాన్ని శ్రద్ధగా విన్న తర్వాత శ్రీరామ్ ఏదో లోతయిన ఆలోచనా - మథనంలోనికి వెళ్లిపోయారు. కొన్ని అడుగులు నడచిన తర్వాత ఆయన చిరాకుపడినట్లు కనిపించారు. బహుశా లోపలి ఆలోచనా తరంగాలు ఆయనను ఖిన్నుణ్ణి చేసి ఉండవచ్చు. మన సంస్కృతి, ప్రాచీన గౌరవ గరిమ దెబ్బతినడంవల్ల ఆయన భావాలలో, ఆలోచనలలో ఇలా అలజడి కలిగింది.



శ్రీరామ్ ఆలయంనుండి బయటికి వచ్చి కొద్ది దూరంలో ఉన్న ఒక చెట్టు నీడలో కూర్చున్నారు. ఎటు వెళ్లాలా అని ఆలోచించసాగారు. బదరీనాథ్ యొక్క గౌరవం దెబ్బతినడం, నర - నారాయణ పర్వతాలు కలసిన తర్వాత వినాశనం జరుగుతుందనే వదంతి - వీటిమీద కూడ దృష్టి వెళుతోంది. పది - పదిహేను నిముషాలు ఆయన తన అంతరంగంలో మునుగుతూ తేలుతూ గడిపిన తర్వాత కళ్లు మూతలు పడ్డాయి, ఆ చెట్టును ఆనుకుని కూర్చుని ఆయన నిద్రలోకి జారిపోయారు. పర్వతాలలో ప్రయాణంవల్ల, ఎగుడు దిగుడుల దారిలో ప్రయాణించడంవల్ల శరీరం అపరిమితమైన ఒత్తిడికి గురి అయింది. రాత్రి బాగా నిద్ర పట్టింది. అయినా అలసట తీరలేదేమో. అరగంట తర్వాత మెలకువ వచ్చింది. జ్యోతి మఠం ఎదురుగా ఒక సెలయేరు పారుతోంది. దాన్ని దండధార అని పిలుస్తారు. శ్రీరామ్ ఆ నీటితో చేతులూ, ముఖమూ కడుక్కున్నారు. ఆచమనం చేశారు.

క్షణకాలం ఎటువెళ్లాలనే ప్రశ్న వచ్చింది. మరుక్షణంలోనో, ఆ క్షణంలోనో సమాధానం వచ్చింది. భవిష్యబదరీ మీదుగా మానస సరోవరం వైపు వెళ్లాలి. సమాధానం తన లోపలనే ఆంతరిక ప్రేరణవలె వచ్చింది. మార్గదర్శక సత్తా పంపిన నిర్దేశంగా కూడ దీనిని పరిగణించవచ్చు.

గమ్యం, మార్గం స్పష్టం కాగానే శ్రీరామ్ నీతిఘాటీవైపు పయనించారు. సుమారు పది కిలోమీటర్లు కొండదారిలో నడచి తపోవనం చేరారు. అక్కడి తప్తకుండంలోని గోరువెచ్చని నీళ్లలో స్నానం చేసి, కొంతసేపు విశ్రాంతి తీసుకుని, భవిష్యబదరి చేరారు. నలువైపులా నీరవ నిశ్శబ్దం. ఎక్కడో ఒకరిద్దరు మనుషులు కానవచ్చారు. విష్ణుదేవాలయం ఇంకా తెరవలేదు. పూజారి దగ్గరలోనే ఉంటాడు. అయితే ప్రజల రాకపోకలు

**మనలోని పూర్వకర్మ వాసనల వదపోతకు పనికి వస్తుంది క్రియాయోగం.**

అంతగా లేనందువల్ల పూజ-హారతులు క్రమబద్ధం కాలేదు. ఆలయాలు పూజ - ఆరాధనలకోసం ఎక్కడ నడుస్తున్నాయి? వాటి వ్యవస్థకూ, అనుశాసనానికీ దర్శకుల సమ్మర్దమే ముఖ్య ఆధారంగా ఉంటోంది. మథుర, బృందావనం, ఋషికేశ్‌లలో శ్రీరామ్‌కు ఈ వాస్తవం బాగా అనుభవంలోకి వచ్చింది. ఆలయం తలుపులు మూసి ఉండడం ఆయనను ఆశ్చర్యం కలిగించలేదు.

## భవిష్యబదరిలో

ఆలయం ప్రక్కన ఒక రావిచెట్టు ఉంది. దానిక్రింద ఒక శిల ఉంది. శ్రీరామ్ ఆ శిలను పరీక్షించసాగారు. రాయిమీద ఎప్పుడో సమర్పించబడిన పువ్వులూ, పూజా సామగ్రి కనిపించాయి. ఎండుటాకులు, గడ్డిపోచనలు, గాలికి ఎగిరివచ్చిన దుమ్మూ ధూళీ ఆ శిలను ఆవరించి ఉన్నాయి. మూడు నాలుగు రోజులుగా ఎవరూ శుభ్రపరచినట్లు లేదు. ఆ శిల మామూలు రాయి కాదని శ్రీరామ్‌కు అనిపించింది. పూజా సామాగ్రి అర్పించబడినట్లు కనిపిస్తోంది కనుక అది దైవ విగ్రహం అయిఉండాలి. ఆ శిలను శుభ్రంచేసి పరిశీలనగా చూస్తే - అది విగ్రహమేనని స్పష్టమయింది. విగ్రహం ఏ దేవతది అయినా, అది సగమే తయారయింది. విగ్రహం పైభాగాన్ని గుర్తుపట్టవచ్చు. అదయినా అంత స్పష్టంగా లేదు. బాగా ప్రయత్నించిన మీదట అది విష్ణుమూర్తి విగ్రహం కావచ్చని అనిపిస్తుంది.

విష్ణుమూర్తి ఆలయం ప్రక్కనే ఉంది కదా, విగ్రహం లోపల ఉండకుండా బయట ఎందుకు ఉంది అనే ప్రశ్న వచ్చింది. అందుకు కారణమేదీ తెలియలేదు. శ్రీరామ్ ఆ ప్రశ్నను అలా వదలివేసి, ఆ చెట్టుదగ్గర కూర్చున్నారు. భవిష్య బదరి ఎలా ఉంటుందో చూడాలని ఆయన అనుకున్నారు. కనుక ఆయన పూజారికోసం ఎదురుచూస్తున్నారు. మధ్యాహ్న సూర్యుడు పడమటి వైపుకు జరగడం ప్రారంభించాడు. అప్పుడు పూజారి వస్తూ ఉండడం కానవచ్చింది. అతడు ఆలయం తలుపులు తెరిచాడు. అంతకుముందు గుమ్మంమీద సమర్పించిన సామగ్రిని ప్రోగుచేసుకున్నాడు. అతడు ఏదో గొణుక్కుంటూపోతున్నాడు. సామగ్రి తక్కువగా ఉండడం చూచి, యాత్రికులను ఆడిపోసుకుంటున్నాడేమో.

తలుపులు తెరవబడడంతో, శ్రీరామ్ దర్శనంకోసం ముందుకువెళ్లారు. శ్రీరామ్ బయట నిలబడి చేతులు జోడించారు. పూజారి ఇలా అన్నాడు - "లోపలికిరా. దగ్గరగా దర్శనం చేసుకోవాలంటే చేసుకోవచ్చు. రూపాయి పావలా అవుతుంది."

శ్రీరామ్ మౌనం వహించారు. ఈ అడవిలో కూడ భగవానుని దర్శనంనుండి సంపాదన! పూజారి మళ్లీ గుర్తుచేశాడు - "ఆలోచించుకో. ఎవరూ లేరు కనుక అవకాశం వచ్చింది. లేకుంటే - విష్ణు ఆలయంలో ఎవరినీ లోపలకు రానివ్వరు." శ్రీరామ్ ఇలా జవాబిచ్చారు - "వద్దు. నేను నియమాలను ఉల్లఘించను. అదే సరైన పద్ధతి."

పూజారి ఏదో గొణుక్కున్నాడు. అతడు ఏమి చెపుతున్నాడో శ్రీరామ్‌కు వినిపించలేదు. అయినా అతడి భావం అర్థమయింది. శ్రీరామ్ ఇలా అన్నారు - "ఇబ్బంది పడకండి. మీరు కోరిన దక్షిణ ఇస్తాను." ఆయన సంచీలోనుంచి రూపాయి పావలా తీసి గర్భగుడి గుమ్మంమీద ఉంచారు.

''ఉన్నత కుటుంబానికి చెందినవాడిలా కనబడుతున్నావు'' - అన్నాడు పూజారి. అతడలా తన సంతోషాన్ని తెలిపాడు. మాట కలపాలనే ఉద్దేశ్యంతో ఇలా అన్నాడు - "ఒంటరిగా వచ్చావా? ఇంత చిన్న వయస్సులో తీర్థయాత్రకు వెళ్లాలని ఎలా అనిపించింది? సాధువుగా, సన్యాసిగా మారాలని ఉందా? ఇక్కడి బాబాలలో, యోగులలో ఎవరినీ గురువుగా స్వీకరించకు. వీరిలో ఎక్కువమంది దొంగ సాధువులు."

పూజారి ఒక్క గుక్కలో పెక్కు ప్రశ్నలు వేశాడు. సలహా ఇచ్చాడు కూడా. రూపాయి పావలా లభించిన సంతోషంలో

**మన స్వభావంలోని వక్రతలు భవరోగాలు. వీటికి చికిత్స యోగం.**

అతడు ఆత్మీయతను ప్రదర్శిస్తున్నాడు. అతడు ఏ కారణంవల్ల మనసు విప్పి మాట్లాడుతున్నా - శ్రీరామ్ మాత్రం అతడిని ఆదరించారు. ఆయన ఇలా అడిగారు -

"బయట ఉన్న విగ్రహం ఎవరిది?"

"ఆ విగ్రహం సగం తయారయింది. ఎవ్వరూ చెక్కలేదు. కాలం తనకుతానుగా దాన్ని చెక్కుతోంది. అది పూర్తయినప్పుడు బదరీ విశాల్ ఇక్కడ పూజింపబడతాడు." పూజారి ఇంకా ఇలా అన్నాడు- "అప్పుడు నర, నారాయణ పర్వతాలు కూడ ఏకమవుతాయి. లతాదేవి ఆలయంలో ఇప్పుడు 24 సంవత్సరాలకొకసారి ఉత్సవం జరుగుతోంది. బదరీ విశాల్ ఇక్కడ వెలసిన తర్వాత ప్రతి సంవత్సరం ఉత్సవం జరుగుతుంది."

వివరణ ఇస్తూ పూజారి ఒక్కసారిగా గాంభీర్యం వహించి ఇలా అన్నాడు -

"అప్పుడు నాకుకూడ గర్భగుడిలోకి మనుషులను పిలిచే పాపం తప్పుతుంది. ఉత్సవాలలో చాలామంది జనం వస్తారు. బదరీనాథ్‌జీని దర్శించేవారుకూడ ఇక్కడికే వస్తారు. వారు సమర్పించే డబ్బుతో నేను ధనవంతుణ్ణి అయిపోతాను."

శ్రీరామ్ అతడి మాటలను వినోదంగా వింటున్నారు. కొద్దిసేపటి క్రితం రూపాయి పావలా అడిగినప్పుడు వచ్చిన కోపం జాలిగా మారింది. పేదరికం కదా, వీళ్లు పాపం ఆశపడతారు - అనిపించింది. పూజారి ఇంకా చెప్పుకుపోతున్నాడు -

"కానీ, ఆ రోజు చూడడానికి నేను బ్రతికి ఉండను. నర, నారాయణ పర్వతాలు ఎప్పుడు ఏకమవుతాయో, బదరీ విశాల్ ఎప్పుడు ఇక్కడికి వస్తాడో తెలియదు. అయినా ఏమీ పరవాలేదు. వచ్చే తరాలు ఆ సుఖం పొందుతాయి."

రూపాయి పావలా దక్షిణ సంబరంలో మునిగి, పూజారి అలా మాట్లాడుతూనే ఉన్నాడు. శ్రీరామ్ అతడిని వదిలి, ఆలయంనుండి బయటకు వచ్చారు. నీతి ఘాటీ దాటి ఆ అజ్ఞాత స్థలానికి వెళ్లాలి. అయితే ఆ స్థలం ఆయనను లాగికొని పోతోంది. ఆ దారి ఊహించనంత ఎత్తుకు పోతోంది. ఎన్నెన్నో కాలిబాటలు. దారినిండా ముళ్లూ, కంకర రాళ్లూ. ఆ దారిలో కొద్ది దూరం నడచినా అలసట వస్తోంది. జోషీమఠంలో దండధారలో స్నానంచేసిన తర్వాత శ్రీరామ్‌ను అలసట మళ్లీ వేధించలేదు. రెండు బుజాలకూ రెండు సంచీలు. చేతిలో లాఠీ. కాళ్లకు దళసరి మడమల రబ్బరు చెప్పులు. వీటితో ఆయన సమగతిలో ముందుకు వెళుతున్నారు.

## హేమకుండసాహిబ్ వద్ద

సుమారు 25 కిలోమీటర్లు నడచి, శ్రీరామ్ ఒక సెలయేటి ఒడ్డున ఆగారు. ఆ సెలయేటికి అన్నివైపులా కొండలు. వాటి ప్రతిబింబాలు నీళ్లలో కనబడుతున్నాయి. ఒడ్డున అక్కడక్కడ రాతి అరుగులు ఉన్నాయి. పూర్వం జనం కూర్చొనడానికీ, ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించడానికీ, ధ్యాన ధారణలు అభ్యాసం చేయడానికీ ఈ అడుగులను వాడుకునేవారని అనిపించింది. శ్రీరామ్ ఒక అరుగుమీద కూర్చుని, సెలయేటి నీటిని పరీక్షగా చూడసాగారు. ఇప్పుడే మంచు కరిగి వచ్చింది. నీరుగా మారిన మంచు కొండల ఒడిలో జమఅయింది. నీరు స్వచ్ఛంగా, పారదర్శకంగా, అద్దంలా తేటగా ఉంది. మబ్బులు లేని ఆకాశం, కొండ చరియలు, చూచేవ్యక్తి ప్రతిబింబం తప్ప - ఆ నీటిలో మరేదీ కానరావడం లేదు.

శ్రీరామ్ కూర్చున్న చోటునుండే అన్నివైపులా చూచి లెక్కపెట్టారు. ఏడు కొండలు సెలయేటిని చుట్టి ఉన్నాయి. శ్రీరామ్ అరుగులను లెక్కపెట్టారు. తాను కూర్చున్న చోటునుంచే లెక్కపెట్టారు. 24 అరుగులు ఉన్నాయి. ఈ స్థలం గతంలో తపస్థలంగా ఉండేదా - అనే ఆలోచన వచ్చింది. హిమాలయం ఋషి - మునుల నివాసం. ఏనాడో కాక, ఇప్పుడు కూడ ఇక్కడికి ఋషిసత్తాలు వస్తూ ఉండవచ్చు - అనిపించింది.

**ఏది చేయడం కోసం జీతం పుచ్చుకుంటున్నామో అది చేసి తినడం అపరిగ్రహం.**

ఏడుకొండల మధ్య ఉన్న ఆ సెలయేరు గురించి తర్వాత తెలిసింది. ఖాల్సా పంథ్ సంస్థాపకులు గురు గోవిందసింగ్ తన పూర్వజన్మలో ఇక్కడ తపస్సు చేశారు. అప్పుడు ఆయన పేరు మేధసముని. ఇది తెలిసిన తర్వాత 1936లో ఇక్కడ సిక్కు తీర్థాల స్థాపన జరిగింది. ఈ స్థలమే ఇప్పుడు హేమకుండ సాహిబ్‌గా ప్రఖ్యాతి పొందింది. ఇక్కడ గురుద్వారా కూడ నిర్మించబడింది. రాకపోకలకూ, వసతికీ చక్కని వ్యవస్థ ఏర్పడింది.

శ్రీరామ్ ఆ అరుగుమీద చాలాసేపు కూర్చున్నారు. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లు అనిపించింది. ఎవరో తమతో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆయనకు తట్టింది. అస్పష్టమైన ధ్వని వినిపిస్తోంది. చుట్టూ చూచారు. ఎవరూ లేరు. అయినా ధ్వని వస్తోంది.

చిత్తాన్ని అత్యంత ప్రశాంతంగా, నిశ్చలంగా చేసుకున్న తర్వాత ఆ ధ్వని స్పష్టమయింది. ఆ స్వరం ఎంత తగ్గు స్థాయిలో ఉన్నదంటే– సంవత్సరాల తరబడి మౌనంగా ఉన్న కంఠంనుండి వస్తున్నట్లు ఉంది. మాట్లాడడం మరచిపోయిన కంఠంనుండి వస్తున్నట్లు ఉంది. ఆ ధ్వని ఏవైపునుంచి వస్తోందో ఆయన అంచనా వేశారు. అయిదు అడుగుల దూరంలో నల్లరంగుగల ఒక ఆకారం కనిపించింది. అది శ్రీరామ్‌ను సంబోధిస్తూ తనవద్దకు పిలుస్తోంది. శ్రీరామ్ అరుగుమీదనుండి లేచి, ఆ ఆకారం దగ్గరకు వెళ్లారు. ప్రణామం చేశారు. ఆ ఆకారంనుండి ఇలా మాట వినవచ్చింది –

నన్ను ఏ పేరుతో అయినా పిలవవచ్చు. నాకు పేరేదీ లేదు. ఈ మాట చెప్పాలనే నిర్దేశం నాకు అందింది – నీవు గోముఖం వద్దకు వెళ్లు. గోముఖం తర్వాత నందనవనం ఉంది. అక్కడ నీ కోసం ఎదురుచూస్తున్నారు.

## గురుసత్తా ఆదేశం

ఆ ఆకారం చెప్పిన మాటను శ్రీరామ్ తన మనస్సులో యథాతథంగా స్వీకరించారు. దారి తెలియదని మాత్రమే చెప్పారు. ఆ ఆకారం ఇలా అన్నది –

“దారి కష్టం కాదు. ఇక్కడనుండి జోషీమఠానికి తిరిగివెళ్లు. చమోలీ, గుప్తకాశీ మున్నగు స్థలాలకు వెళ్ల నవసరం లేదు. అందువల్ల దూరం పెరుగుతుంది. జోషీమఠంలో కొందరు కలుస్తారు. వారితో కలసి ప్రయాణించు. దగ్గర దారిలో వెళితే, రేపు రాత్రికి గోముఖం చేరగలవు.”

శ్రీరామ్ ఈ నిర్దేశాన్నికూడ మార్గదర్శక సత్తా ప్రతినిధి ఇచ్చిన సంకేతంగా పరిగణించారు. అంగీకరిస్తున్నట్లు తలూపారు. ఆ ఆకారం ఇలా అన్నది –

“ఎక్కడా ఆగవలసిన అవసరం లేదు. సరాసరి గోముఖం చేరిన తర్వాతనే విశ్రాంతి తీసుకో. గుర్తుంచుకో.”

శ్రీరామ్ “జీ” (అలాగే) అన్నారు. ఆ ఆకారానికి ప్రణామం చేయడానికి తలవంచారు. ఆ ప్రణామంపై ధ్యాస ఉంచకుండానే ఆ ఆకారం సెలయేటిలో దిగిపోయింది. మోకాలు లోతు నీళ్లలో అర్ఘ్య ప్రదానం చేయసాగింది.

శ్రీరామ్ సెలయేరులో స్నానం చేశారు. కొంతసేపు జపం చేశారు. ఆ తర్వాత ధ్యానం చేశారు. ఆ ఆకారం అవేవీ పట్టించుకోలేదు. మోకాలు లోతు నీళ్లలోకి దిగిన తర్వాత వెనుదిరిగి చూడలేదు. సాధనా మార్గం పథికులు ఇలాగే నిస్సంగంగా ఉండాలి. శ్రీరామ్‌కూడ తన సాధన – భజనలో నిమగ్నులు అయినారు. ఆ ఆకారాన్ని మనస్సునుండి తప్పించడానికీ, క్షణం క్రితం జరిగిన సమావేశాన్ని మరచిపోవడానికీ శ్రీరామ్‌కు ఎలాంటి ప్రయత్నమూ చేయవలసిన అవసరం లేకపోయింది. నీటిమీద గీసిన బొమ్మలా ఆ జ్ఞాపకం దానికదే అదృశ్యం అయిపోయింది, సెలయేరు ఒడ్డున మరికొద్దిసేపు కూర్చుని శ్రీరామ్ జోషీమఠానికి తిరుగుముఖం పట్టారు.

H H H

**అపరిగ్రహం లేనివాడు యోగాభ్యాసాన్ని ఈ జన్మకు వాయిదా వేసుకోవలసిందే.**

నావారితో నామాట : మహోద్యమం విరాట్ యాత్ర - 9

# 2012 నాటికి లక్షమంది యువ కార్యకర్తలు

### విశ్వవిద్యాలయానికి వేయి అనుబంధ కళాశాలలు

వైజ్ఞానిక అధ్యాత్మవాదం 21వ శతాబ్దపు మతంగా రూపొందుతోంది. స్వామి వివేకానంద ప్రతిపాదించిన ఈ సిద్ధాంతాన్ని పరమపూజ్య గురుదేవులు తమ విస్తృత సాహిత్యంతో పరిపుష్టం చేశారు. ఉన్నత స్థాయి చేతనా విజ్ఞానంగా స్థిరపడిన అధ్యాత్మయే పదార్థ విజ్ఞానపు భస్మాసురుణ్ణి అదుపు చేయగలుగుతుంది. బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ ఈ సిద్ధాంతంపై లోతయిన పరిశోధనలు జరిపింది. తన శతజయంతి సంవత్సరంలో వాటి ఫలితాలను ప్రజలకు అందించింది. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం ఆ పరిశోధనలను ముందుకు తీసుకువెళ్లి, యోగ సాధనలపై, చేతనా విజ్ఞానంపై పాఠ్యక్రమాన్ని రూపొందించింది. ఈ విషయాలపై 30 సిద్ధాంత వ్యాసాలను విద్యార్థులు రచించారు. మరి 30 వ్యాసాలను రచిస్తున్నారు. యజ్ఞ చికిత్సపై పరిశోధనలు జరుగుతున్నాయి. విశ్వ విద్యాలయంలో యోగ చికిత్స, మానసిక చికిత్సల కేంద్రం ఎన్నెన్నో సాఫల్యాలను సాధిస్తోంది. వివిధ వైజ్ఞానిక సంస్థాన్‌లను ఒకే వేదికమీదకు తేవడానికి కృషి జరుగుతోంది.

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం యువ వైజ్ఞానికులను కార్యకర్తలుగా రూపొందిస్తోంది. జర్నలిజం, మాస్‌కమ్యూనికేషన్‌లపై పి.జి. కోర్సు, ప్రత్యామ్నాయ చికిత్స, యోగం, మానసిక చికిత్సలపై డిప్లొమా కోర్సులు ప్రారంభం అయినాయి. బయో ఇన్ఫర్మేటిక్స్‌పై ఎమ్.ఎస్‌సి కోర్సు నడుస్తోంది. ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలు, యజ్ఞ విజ్ఞానం, శబ్దశక్తి - వీటిపై పరిశోధనకు ఒక విరాట్ భవనం నిర్మాణం అవుతోంది. **2011-12 నాటికి విశ్వవిద్యాలయంలో పదివేలమంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతూ ఉంటారు. దూర విద్యాకేంద్రాలలో 1 - 1 1/2 కోట్లమంది చేరతారు. వేయి అనుబంధ కళాశాలలు పనిచేస్తూ ఉంటాయి.**

### యువతరంలో నవచైతన్యం

యువతరానికి ఆధ్యాత్మిక జీవన దృక్పథాన్ని అందించడానికై వివిధ స్థలాలలో యువ సమ్మేళనాలు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయంలో డిగ్రీలు పొందిన విద్యార్థినీ విద్యార్థుల ద్వారా దేశంలోని, ప్రపంచంలోని యువ చైతన్యాన్ని కుదిపివేయడానికై పథకాలు అమలు జరుగుతున్నాయి.

2011-12 నాటికి ఈ యువశక్తి దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో ప్రవేశించేందుకు కృషి జరుగుతోంది. ఈ సంవత్సరం ఒక అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహానికి విరాట్ భవనం నిర్మాణం అవుతోంది. జులై నెలలో అమెరికా, కెనడాల విద్యార్థినీ విద్యార్థులకు "నాయకత్వ సామర్థ్యం"పై 15 రోజుల శిబిరం నిర్వహించబడింది. ఇతర దేశాల విద్యార్థుల కోసం ఇలాంటి శిబిరాలు వరుసగా నడుస్తూ ఉంటాయి. దేశంలోని మహానగరాలలో కూడ శిబిరాలు నడుస్తాయి. యోగం - ధ్యానం, సంస్కృతి - తీర్థ చేతన, వ్యక్తిత్వ నిర్మాణం ఈ శిబిరాలలో బోధించబడతాయి.

**2011-12 నాటికి లక్షమంది యువతీ యువకులను యుగనిర్మాతలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా కృషి జరుగుతోంది.**

### 2011-12 నాటికి 5000 ఉపకేంద్రాలు

ప్రస్తుతం పది ఆంచలిక (జోనల్) కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఒక్కొక్క ఆంచలిక కేంద్రంలో 10 ఉపకేంద్రాలు ఉంటాయి. ప్రతి 2 1/2 లక్షల జనాభాకు ఒక ఉపకేంద్రం నిర్మాణం కావాలన్నది లక్ష్యం. ఆ విధంగా 2011-12 నాటికి దేశంలో 5000 ఉపకేంద్రాలు నిర్మాణం అవుతాయి. ఈ కేంద్రాలను క్రమంగా కంప్యూటరైజ్ చేస్తారు. ఆ తర్వాత ఈ కేంద్రాల సంఖ్యను 10,000లకు పెంచుతారు.

**క్లేశములను తొలగించేందుకు గురువు మార్గం చూపిస్తాడు కాని తొలగించడు.**

## 500 దూరవిద్యా కేంద్రాలు

విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం 10 దూరవిద్యా కేంద్రాలను స్థాపిస్తోంది. వీటిలో తపాలా ద్వారా పాఠ్యాంశాలను అందిస్తారు. 2011-12 నాటికి ఈ కేంద్రాలు 500 అవుతాయి. అలా అనుబంధ కళాశాలలు, దూర విద్యా కేంద్రాలు దేశమంతటినీ ప్రభావితం చేస్తాయి. 2012 నాటికి విద్యా విధాన రూపకల్పన మన చేతుల్లోకి వచ్చినా, ఆశ్చర్యపడనక్కరలేదు.

## గాయత్రీ చేతనా కేంద్రాల స్థాపన

ప్రస్తుతం ఢిల్లీ (నోయిడా క్యూ - 2 సెక్టర్ 12)లోని అయిందతస్థుల భవనంలో గాయత్రీ చేతనా కేంద్రం పని చేస్తోంది. యోగ సాధన, కార్యకర్తల నిర్మాణం, సంఘటన, స్వావలంబనలలో ప్రశిక్షణ ఈ కేంద్రంలో జరుగుతున్నాయి. కలకత్తాలోని నరేంద్రపుర్‌లో 25 ఎకరాల స్థలంలో మరో కేంద్ర నిర్మాణం ప్రారంభమయింది. 6 ఈశాన్య రాష్ట్రాలు, అస్సాం, భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, త్రిపుర, సిక్కింలు ఈ కేంద్రం పరిధిలోకి వస్తాయి. ఆయా భాషలలో యుగ సాహిత్య ప్రచురణకూడ ఇక్కడనుంచి జరుగుతుంది. బొంబాయి (న్యూముంబై - వాసీ)లో మరో కేంద్రం స్థాపించబడుతోంది. **హైదరాబాదులో నిష్ఠావంతుడైన ఒక పరిజనుడు ముందుకువచ్చి, నగరం మధ్యలోనే కేంద్రం భవనాన్ని నిర్మిస్తున్నారు.** ఈ సంవత్సరం చివరకు నిర్మాణం పూర్తికావచ్చు. దక్షిణ భారతమంతా ఈ కేంద్రం పరిధిలోనికి వస్తుంది. లూథియానా, అమృత్‌సర్, సిమ్లా, చండీగడ్, గౌహటి, అగర్తల, త్రిపుర వంటి స్థలాలలోకూడ క్రమంగా కేంద్రాలు ఏర్పడవచ్చు. ఈ గాయత్రీ చేతనా కేంద్రాలను దేవసంస్కృతి విశ్వవిద్యాలయానికి సహాయక కేంద్రాలుగా రూపొందిస్తారు.

## విశ్వవిద్యాలయాలలో వాఙ్మయం స్థాపన

పరమపూజ్య గురుదేవుల రచనలన్నీ కలిపి "పండిత శ్రీరామశర్మ ఆచార్య వాఙ్మయ్"గా ప్రచురిస్తున్నారు. ఇంతవరకు 70 సంపుటాలు వెలువడ్డాయి. మొత్తం 108 సంపుటాలు వెలువడతాయి. ప్రతి సంపుటం ధర రూ.125లు. 70 సంపుటాల ధర రూ. 700లు.

ఈ వాఙ్మయం ఒక ఎన్‌సైక్లోపేడియా (విశ్వకోశం). ప్రతి కళాశాల గ్రంథాలయంలో దీన్ని స్థాపన చేసే ప్రణాళిక అమలుజరుగుతోంది. తమ పూర్వుల, ప్రియతముల స్మృతి చిహ్నంగా ప్రముఖ వ్యక్తులు ఈ వాఙ్మయాన్ని విద్యాలయాలలో స్థాపన చేయించవచ్చు. దీనివల్ల విద్యార్థుల ఆలోచనా సరళి మారుతుంది; విద్యా విధానానికి ఊపిరి వస్తుంది.

## ఎలక్ట్రానిక్ మీడియాద్వారా ప్రసారం

శాంతికుంజ్‌లోని ఎలెక్ట్రానిక్ మీడియా విభాగం ఎన్నెన్నో క్యాసెట్లు, ఆడియో బుక్‌లు, సిడిలు, (గీతాలు - సంగీతం - ప్రవచనాలు - ధ్యానం), డి.వి.డి - వి.సి.డిలు తయారుచేస్తోంది. వివిధ చానల్‌లద్వారా యుగఋషి యొక్క శాశ్వత సనాతన సందేశం ప్రసారం అవుతోంది. పాక్షిక వీడియో పత్రిక "యుగ ప్రవాహ్" దేశంలోని కేబుల్ నెట్‌వర్క్ ద్వారా కూడా ప్రసారం అవుతోంది. అవసరమైతే కొన్ని చానల్‌లను కొంత సమయంకోసం అద్దెకు తీసుకుంటారు.

## కళాకేంద్రం స్థాపన

దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో ఒక కళాకేంద్రాన్ని స్థాపిస్తారు. అందులో నాటకం, నాట్యవిద్యలలో పరిశోధన జరుగుతుంది. వాస్తవానికి ఇది సమర్థవంతమైన మాధ్యమం. ప్రజల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ధర్మాన్నీ, ఆధ్యాత్మిక చింతనను ఈ మాధ్యమంద్వారా జన మానసంలోనికి తీసుకువెళ్లడం అవసరం. అలా జరిగితే - భావ విప్లవపు సగం పని దీనివల్ల పూర్తికావచ్చు.

## సప్తఉద్యమాలు వేగవంతం

మన యుగనిర్మాణ మహోద్యమం వ్యక్తి, కుటుంబం, సమాజముల సర్వతోముఖ నిర్మాణానికి కటిబద్ధమైన ఒక సమగ్ర మిషన్. ఋషి సత్తాలు దాన్ని రూపొందించాయి. మన గురు సత్తాకు దాన్ని అప్పగించాయి. గత మూడు సంవత్సరాలుగా వివిధ స్థలాలలో ఉద్యమ బృందాలు

**ఎవడికి ఎక్కడ రోగమో అక్కడ వాతలు పెట్టే సన్నివేశాలు వస్తాయి ప్రతివాడికీ - జీవితంలో మరమేకులు.**

దేశమంతటిలో, ప్రపంచంలో ఈ ఉద్యమాలను నిర్వహిస్తున్నాయి.

**సాధన ఉద్యమం** వ్యక్తి నిర్మాణం కోసం, ఆధ్యాత్మిక సంస్కరణకోసం సాగుతూన్న ఉద్యమం. ఇది ఏదో ఒక సంప్రదాయానికి పరిమితం కాదు. "అందరికీ సద్బుద్ధి, అందరికీ ఉజ్వల భవిష్యత్తుకు ప్రార్థన" – అనే సూత్రం ప్రకారం అన్ని సంప్రదాయాలకు చెందిన వ్యక్తులూ ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు. సామూహిక – సాధనాత్మక కార్యక్రమాలు జరిగాయి. కనీస సాధనా ప్రక్రియలో వ్యక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఇందువల్ల సామూహిక మనస్సు నిర్మాణం అయింది. ఈ కాంతి వలయ ప్రభావం వల్ల సమాజ వాతావరణం మారింది.

**మన ఆరోగ్య ఉద్యమం**లో భాగంగా వివిధ స్థలాలలో యోగ వ్యాయామం, మూలికావైద్యం, తొట్టివైద్యం, తులసిమొక్కలు నాటడం, సమతూకం కలిగిన ఆహారంగురించి ప్రచారం జరిగాయి. బృందాలు ఏర్పడ్డాయి. ఇవి ప్రత్యామ్నాయ చికిత్సద్వారా ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. ప్రాణిక్ హీలింగ్, ఎక్యుప్రెషర్, ధ్యానచికిత్స, యోగ క్రియలు, ప్రజ్ఞాయోగం, బంధ ముద్రలద్వారా చికిత్స, నేత్రదాన యజ్ఞం ఇందులో అంతర్భాగాలు అవుతున్నాయి. వైద్యులు సమయదానం ఇస్తూ – ఒక విలక్షణమైన సేవా సాధన జరుగుతోంది. ఆరోగ్య రక్షణకు పరిశుభ్రతను పెంచడం అవసరం. ఇందుకోసమై వివిధ గ్రామాలలో పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, సామూహిక పారిశుద్ధ్య సేవ, వైద్య శిబిరాలు నిర్వహించబడ్డాయి. ఫలితంగా – ఒక విప్లవాత్మక వాతావరణం నిర్మాణం అవుతోంది. సమగ్ర ఆరోగ్య యాజమాన్యంలో శిక్షణ పొందిన దేవసంస్కృతి విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ ఇంటర్న్‌షిప్‌లో సమయదానంలో ఇలాంటి సేవలు అందిస్తున్నారు. యోగ శిక్షణ పొందిన విద్యార్థులు యోగశిక్షణ శిబిరాలు నడుపుతున్నారు. '2015 నాటికి అందరికీ ఆరోగ్యం'– అనే లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం కాదని అనిపిస్తోంది.

**విద్యా ఉద్యమంలో** భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష మన బృహత్ పథకం. 2004–5లో 28 లక్షలమంది ఈ పరీక్షలో పాల్గొన్నారు. వీరి తల్లిదండ్రులు, సోదరీ సోదరులుకూడ ఈ పరీక్షవల్ల ప్రభావితులు అయి ఉంటారు. ఇలా కోటిమంది ఈ పరీక్షవల్ల ప్రభావితులు అయినారు. 11 రాష్ట్రాలలో, 8 భాషలలో ఈ సంవత్సరం ఈ పరీక్ష జరుగుతోంది. ఫలితంగా ఒక విలక్షణమైన విప్లవం దేశమంతటా వ్యాపిస్తోంది. దీనితోపాటు – సంస్కృతి మండలుల స్థాపన, మన విశ్వవిద్యాలయ విద్యార్థులు విశ్వవిద్యాలయాలలో కళాశాలలలో చేరడం – ఇవి విద్యారంగంలో ఒక నిర్మాణాత్మకమైన సంచలనాన్ని సృష్టించాయి. విద్యా విధానం ఎలా ఉండాలి? పాఠ్యక్రమం ఎలా ఉండాలి? స్వావలంబనను అలవరచే అనియత విద్యా విధానం ఎలా ఉండాలి? వృత్తి విద్యా సంస్థలు ఎలా నడవాలి? ప్రభుత్వేతర రంగంలో వయోజన విద్య స్వరూపం ఎలా ఉండాలి? ఈ విషయాలన్నీ స్పష్టమవుతున్నాయి. విద్యలో ఆధ్యాత్మిక దృష్టి రంగరించబడితే, సంస్కారవంతులైన పౌరులు నిర్మాణం కావడం నిశ్చయం. దేశంలో నిరక్షరాస్యుడు ఉండకూడదు; ప్రతివ్యక్తీ తన కాళ్లమీద నిలబడాలి; దూర విద్యా కేంద్రాలలో చేరాలి; మరింతగా చదువుకోవాలి; ఉన్నత సాంకేతిక యాజమాన్యం, మాస్ కమ్యూనికేషన్, జీవ సాంకేతిక శాస్త్రం వంటి విద్యలుకూడ వృద్ధిపొందాలి; తద్వారా దేశం అగ్రగామి కావాలి – ఈ లక్ష్యంతో దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం విరాట్ రూపం ధరిస్తోంది.

**స్వావలంబన ఉద్యమం** స్వదేశీకి ఊపిరి. వివిధ స్థలాలలో స్వావలంబన బృందాలు ఏర్పడ్డాయి. పలువురు వీటిని మిషనరీ స్థాయిలో నడుపుతూ బ్రతుకుదెరువుకూడ సాగిస్తున్నారు. స్వదేశీ సామాగ్రిని ప్రజలకు అందిస్తున్నారు. గోవిజ్ఞానం ఆధారంగా ఎన్నెన్నో ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఆరోగ్యం, సౌందర్యం, సదుపయోగంవంటి అన్ని ప్రమాణాలకూ నిలబడి సేవలు అందిస్తున్నాయి. చిన్న పరిశ్రమలలో వస్తూన్న ఈ విప్లవం ప్రపంచీకరణకు ఒక సవాలు. ప్రతి వ్యక్తికీ పని – అనే లక్ష్యంతో పనిచేస్తోంది స్వావలంబన ఉద్యమం. ఈ ఉద్యమం గ్రామాలను కేంద్ర బిందువులుగా చేసుకున్నది.

**అజ్ఞానం అనేది పనికిరాని స్థితి కాదు. అది కొబ్బరికాయకు పైన పెంకులాంటిది.**

నగరాలకు వలసను అరికట్టడానికి కృషిచేస్తూన్నది. గో ఉత్పత్తులముందు ఆధునిక ఉత్పత్తులు అనేకం తీసికట్టు అవుతున్నాయి. గోమూత్రంతో, గోమయంతో తయారయ్యే ఔషధాలను ప్రమాణీకరణ చేస్తున్నారు. ఈ బృందాలన్నీ కేంద్రీయ స్వావలంబన వ్యవస్థతో అనుసంధానం ఏర్పరచుకుని, ఒక జాతీయ నెట్‌వర్క్‌గా రూపొందుతున్నాయి. గో ఉత్పత్తుల ద్వారా బయో కంపోస్టింగ్, వర్మీ కంపోస్టింగ్; నౌడ ఏ ఫార్మింగ్, ఇంధన ఉత్పత్తి, బయోడీసిల్ ఉత్పత్తి, 150కి పైగా చిన్నాపెద్ద కుటీర పరిశ్రమలను నిర్మాణం చేయగలుగుతాము. ఇవన్నీ పర్యావరణం దృష్ట్యా, ఆర్థిక ప్రగతి దృష్ట్యా ప్రయోజనకరంగా ఉన్నాయని రుజువయింది. దేశంలో వివిధ సంస్థలు జరుపుతున్న ఇలాంటి కృషిని సమన్వయపరచే ప్రయత్నం జరుగుతోంది.

**పర్యావరణ జాగృతి ఉద్యమం** కోసం యువ మండలులు, మహిళా మండలులతో పర్యావరణ వాహిని, ప్రకృతి ప్రకోపాల యాజమాన్య వాహిని నిర్మాణం అవుతున్నాయి. మొక్కలు నాటే ఉద్యమం నడుస్తోంది. ప్లాస్టిక్ వస్తువులకు బదులు ప్రకృతిలో తిరిగి కలిసిపోయే ముడి సరుకుతో తయారైన వస్తువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. తీర్థక్షేత్రాల పునరుద్ధరణకూ, వాటిని మరింత అందంగా తీర్చిదిద్దేందుకూ కృషి జరుగుతోంది. ఉత్తరప్రదేశ్‌లో సీతాపుర్‌జిల్లాలోని నైమిశారణ్య తీర్థంతో ఈ ఉద్యమం ప్రారంభం అవుతోంది. హరిద్వార్‌లో ఈ పని మొదటినుంచీ జరుగుతోంది. జనం తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మొక్కలు నాటాలి, ప్రతిచోట నర్సరీలు పెంచబడాలి; నవగ్రహ వాటికలు ఏర్పడాలి – ఇందుకోసం కూడ కృషి జరుగుతోంది.

**వ్యసన విముక్తి ఉద్యమం** దేశమంతటా వేగం పుంజుకుంటోంది. ఇందుకోసం బృందాలు ఏర్పడుతున్నాయి. మన పరిజనులు ర్యాలీలు నిర్వహించారు. ప్రజలు మేలుకున్నారు. మాదక ద్రవ్యాలను వ్యతిరేకిస్తూ పోస్టర్లు, ప్రదర్శనలు దేశమంతటా విస్తరించాయి. మత్తు పదార్థాలవల్ల కలిగే హానిని తెలిపే వీడియోలు, సి.డి.లు కేబుల్ నెట్‌వర్క్‌ద్వారా ప్రజలకు అందజేయబడుతున్నాయి. యువతరం ఈ ఉద్యమంలో విశేషంగా పాల్గొంటోంది. యజ్ఞాలలో దేవదక్షిణగా ఒక చెడ్డ గుణాన్ని వదులుకునే వ్రతాన్ని ఇంతవరకు ఎన్నో లక్షలమంది తీసుకున్నారు; అలా వ్యసనాలను వదులుకున్నారు. ఆ వ్రతాన్ని వారు ఇప్పటికీ పాటిస్తున్నారు. ఈ మాధ్యమంద్వారా లక్షలాది కుటుంబాలు మిషన్‌లో కలిశాయి. పొగాకు వాడకంవల్ల కలిగే నష్టాలను వివరించే వర్కషాప్‌లు పెక్కు స్థలాలలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. వ్యసన విముక్తికి పనికివచ్చే ఔషధాలను కూడ తయారుచేసి పంపిణీ చేస్తున్నారు.

**దురాచార నిర్మూలన ఉద్యమం:** గ్రుడ్డి నమ్మకాలను, మూఢ విశ్వాసాలను వ్యతిరేకించే ఉద్యమం వేగవంతం అవుతోంది. గత 20 సంవత్సరాలలో ఈ విషయమై ప్రజలలో చక్కని మేలుకొలుపు జరిగింది. ఆచారాలకు బదులు విజ్ఞాన సమ్మతమైన సిద్ధాంతాలను, అధ్యాత్మను అనుసరించాలని ఆధ్యాత్మిక వ్యవస్థ ప్రజలకు బోధించాలి. ఈ పనిని మన ఉద్యమ బృందాలు చేస్తున్నాయి.

**మహిళా జాగరణ.** మహిళా జాగరణ ఈ మిషన్‌కు ఊపిరి. మహిళలు మహిళా మండలులను నిర్వహిస్తున్నారు. యుగనిర్మాణ ఉద్యమంలో పాల్గొంటున్నారు. ఊరేగింపులలో నినాదాలు ఇస్తున్నారు. ఆధునికత పేరిట ఫ్యాషన్ జగత్తులో వ్యాపించిన వికృతులను మహిళలే నిర్మూలిస్తారు. గాయత్రీ పరివార్‌కు చెందిన మహిళలు భారతీయ సంస్కృతిలోని భావజాలాన్ని ప్రజలకు అందించగలుగుతున్నారు; దేవ కుటుంబాలను నిర్మాణం చేస్తున్నారు; సంస్కారవంతులైన ఆత్మలు జన్మ ఎత్తేలా చేస్తున్నారు; మహిళకు గౌరవస్థానం అందేలా చూస్తున్నారు. ఇందుకోసం ఎలక్ట్రానిక్ మీడియాను వాడవలసి ఉంది. ప్రగతిశీల మహిళా సమ్మేళనాలను నిర్వహించవలసి ఉంది. బ్రహ్మవాదిని సోదరీమణుల కార్యక్రమాల ద్వారా యుగతీర్థం శాంతికుంజ్ ఇందుకు శ్రీకారం చుట్టింది. ఇక క్షేత్ర స్థాయిలో సోదరీమణులకు శిక్షణ ఇచ్చి, వారిని జిల్లా స్థాయిల వరకు, బ్లాక్ స్థాయివరకు పంపవలసి ఉంది. సోదరులంతా వీరికి పూర్తి సహకారాన్ని తప్పక అందించాలి.

H H H

**పూర్వకర్మను బట్టి క్షీణతను, వృద్ధిని కలిగించేది అభ్యాస బలం. దానిని పొందడానికే యమ నియమాలు.**

విశ్వవిద్యాలయ విశేషాలు

# ధ్యాన గంగలో నిరంతర స్నానం

## స్వయంగా కులాధిపతి సంచాలన

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో ధ్యాన గంగ ప్రవహిస్తోంది. అలౌకికమైన ఈ ధ్యాన-ధార పవిత్రం, సువాసనాభరితం, మధుమయం, సంగీతమయం. వ్యక్తిత్వానికి ప్రేరణ ఇచ్చే ధార అది. వ్యక్తిత్వాన్ని మార్చే ధార అది. సంధ్యా సమయంలో సుమధుర సంగీత ఝరిమధ్య లెక్కకు మిక్కిలి అయిన యువత మనస్సులు ధ్యాన గంగలో స్నానం చేయడానికి దిగుతాయి. అనుభవించినవారికి మాత్రమే తెలిసే అనుభూతి అది. విశ్వవిద్యాలయ విద్యార్థులకు ధ్యానం రహస్యమయమైన యోగసాధన, గహనమైన వైజ్ఞానిక ప్రక్రియ. ఈ ధ్యానంలో అధ్యాత్మ, విజ్ఞానముల అపురూప సమన్వయం ఉంది. విశ్వవిద్యాలయ పరమాచార్యులు ఈ ధ్యానాన్ని స్వయంగా సంచాలన చేస్తారు. ఒక విశ్వవిద్యాలయం కులాధిపతి (ఛాన్సలర్) ఇలా విద్యార్థులకు క్లాసులు తీసుకోవడం మన దేశంలోనే కాక మొత్తం ప్రపంచంలోనే మొదటి ఉదాహరణ కావచ్చు.

## యుగఋషి కలకు రూపం

ఈ మహాప్రయత్నం వెనుక ఉన్న ప్రేరణ, వేదన, తపన, అశాంతి ఒకే ఒకటి-యువ విద్యార్థులను మలచడం, రూపుదిద్దడం; వారి వ్యక్తిత్వాలను ప్రఖరంగా, సముజ్వలంగా, సంస్కారవంతంగా తయారుచేయడం; దేవసంస్కృతి విశ్వవిద్యాలయం స్వప్నద్రష్ట యుగఋషి పరమపూజ్య గురుదేవుల కలను త్వరగా సాకారం చేయడం.

అయితే-కేవలం బుద్ధి సామర్థ్యాన్నీ, కార్యకుశలతను పెంచడం వల్ల వ్యక్తిత్వం రూపొందదు. ఇందుకు కావలసింది-గతంలోని సంస్కారాల క్షాళన. ఈ క్షాళన ద్వారానే ప్రవృత్తులు పవిత్రం అవుతాయి; జీవన దృక్పథం సక్రమం అవుతుంది; జీవన సరళిలో ఉత్కృష్టత చోటుచేసుకుంటుంది. వ్యక్తిత్వాన్ని ఆధ్యాత్మిక ప్రక్రియల పరంపరలకు గురి చేయడం ద్వారానే ఇదంతా సాధ్యపడుతుంది.

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం ఈ మహత్తర ప్రక్రియలకు ప్రయోగశాల. యుగఋషి పరమపూజ్య గురుదేవుల సూక్ష్మ నిర్దేశాలకు అనుగుణంగా రూపొందిన ప్రయోగశాఖ అది. వాస్తవానికి - ఇక్కడ ఆయన సంకల్పమే సక్రియంగా ఉంది. ఆయన చేతన ఇక్కడ పనిచేస్తోంది. ఈ వాస్తవాన్ని క్రొత్తగా వచ్చిన విద్యార్థులు కూడ వెంటనే తెలుసుకుంటున్నారు. వెంటనే వారికి ఇది అనుభవంలోనికి వస్తోంది. విశ్వవిద్యాలయం యొక్క ప్రస్తుత సంచాలకుడు ఎవరైనా - ఆ పరాత్పర ప్రభువు యొక్క యుగఋషియొక్క పరమ చేతనయే దీన్ని సంచాలన చేస్తోంది. ఆయన సంకేతాలే, ఆయన నిర్దేశాలే, ఆయన ఆదేశాలే ఇక్కడ పథకాలుగా అమలు జరుగుతున్నాయి. శిక్షణతోపాటు సంస్కారం ఇవ్వడం ఆయన యోజనయే. యువ వ్యక్తిత్వాలకు సానపెట్టడం, పదును పెట్టడం, వానిలో ఉజ్వలతనూ, పవిత్రతనూ నింపడం - ఇదంతా ఆ పరాత్పర ప్రభువుయొక్క సంకల్పానికి కార్యరూపమే.

విశ్వవిద్యాలయ కులాధిపతి ఆయన అంతర్‌వేదననే తన హృదయంలో నింపుకుని, ఆయన యుగ స్వప్నాన్నే సాకారం చేయడంలో నిమగ్నమై ఉన్నారు. ధ్యానం ఈ ప్రక్రియకు సమర్థవంతమైన ఆధారం. ఈ పంక్తులు వ్రాస్తూ ఉంటే, మన ప్రభువు 1989లో ఒకరోజు మధ్యాహ్నం చెప్పిన ఈ మాటలు గుర్తుకు వస్తున్నాయి-

## "మీచేత చేయిస్తాం వ్యక్తి నిర్మాణం"

"దేశంలో అన్నీ ఉన్నాయి: కానీ - వ్యక్తి లేడు. జనం చాలామంది ఉన్నారు. జనసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కానీ-పరీక్షకు నిలబడిన, ఎంపిక అయిన, ఉన్నత స్థాయికి చెందిన వ్యక్తిత్వాలు లేవు. నేటి హిందూస్థాన్‌లో గాంధీ సుభాష్‌లు లేరు, లోకమాన్య తిలక్ స్వామి వివేకానందలూ లేరు. అయితే మేము అలాంటివారిని రూపుదిద్దుతాము. ఇదంతా మేము ఈ శరీరం వదిలిన తర్వాత చేస్తాము."

ఒక్క క్షణం ఆగి వారిలా అన్నారు -

విచారించకండి. ఈ పని మీచేతనే చేయిస్తాను.

ఈ మాట విని శ్రోతలు ఆశ్చర్యపోయారు. ఎందుకంటే - తమ వ్యక్తిత్వాలలోని బలహీనతలూ, లోటుపాట్లు శ్రోతలకు తెలుసు. అంతర్యామి అయిన ప్రభువు వీరి మనసులోని మాటను తెలుసుకున్నారు. గంభీరమైన స్వరంలో వారిలా వివరించారు-

**చేతలలో కనపడని మాటలప్రభావం తాత్కాలికమే.**

మీరు ఏమీ చేయనక్కరలేదు. నేను మీవద్దకు క్రొత్త తరం పిల్లలను తీసుకువస్తాను. మీరు వారివద్ద కూర్చోవాలి. వారికి మంచిమంచి మాటలు చెప్పాలి. వారిచేత సాధనలు చేయించాలి. మిగతాదంతా నేను వెనుక ఉండి చేస్తాను. స్థూల కార్యకలాపాలను ఉత్కృష్టం చేయడం మీ బాధ్యత. సూక్ష్మ విషయాలలో మార్పు తేవడం మా బాధ్యత.

ఋషి వాణి ఎన్నడూ వ్యర్థం కాదు. యువ విద్యార్థులను తీర్చిదిద్దడం కోసం జరుగుతూన్న ప్రక్రియలన్నింటికీ ప్రేరకులూ, ప్రవర్తకులు ఆయనయే, యుగ ఋషియే. విశ్వ విద్యాలయ కులాధిపతి ఆ ప్రభువుతో దీర్ఘకాలం నెరపిన సాహచర్యంలో తాను పొందిన ఆధ్యాత్మిక సంపదను నిండు మనసుతో, ఉదార భావంతో పంచుతున్నారు.

## వ్యక్తినిబట్టి ధ్యాన ప్రక్రియ

విశ్వవిద్యాలయంలో జరుగుతూన్న ధ్యానం కేవలం కర్మకాండయొక్క టెక్నిక్ మాత్రమే కాదు. ఈనాడు ధ్యానం పేరుతో, యోగం పేరుతో అన్నిచోట్లా చెప్పబడుతూన్నది కాదిది. ఇందులో లోతయిన ఆధ్యాత్మిక రహస్యాలు దాగి ఉన్నాయి. ధ్యాన ప్రక్రియ సత్యం యొక్క బాహ్య శరీరం మాత్రమే. దీనిలో ప్రాణాన్ని నింపుతూన్నది పరమపూజ్య గురుదేవుల పరాచేతన. కనుకనే – ఈ ధ్యానంలో పాల్గొన్నవారి ప్రాణం ప్రేరితం అయింది, పరివర్తన చెందింది, ప్రత్యావర్తన పొందింది. వారి వ్యక్తిత్వాలు విలక్షణమైన రీతిలో నిగ్గుతేలాయి.

విశ్వవిద్యాలయంలో ప్రవహిస్తూన్న ధ్యాన ధార స్వరూపం ఏదో ఒక ప్రత్యేక విధానానికి కట్టుబడినది కాదు. ఈ ప్రక్రియ ప్రయోగాత్మకం, వైజ్ఞానికం అయినది. ఇందులో ప్రతి వారం ఒక క్రొత్త పువ్వు విచ్చుకుంటుంది. వ్యక్తియొక్క ప్రకృతి (స్వభావం), సూక్ష్మమైన చేతన ధార స్వరూపం, నిర్ణీతమైన లక్ష్యం–వీటికి అనుగుణంగా ధ్యాన ప్రక్రియ మొత్తం నిర్ణయించబడుతుంది. ప్రార్థనా ధ్యానం, శ్వాసల మధ్య గల వ్యవధిని చూడడం, అంతర్ దర్శక ధ్యానం, స్వర్ణిమ ప్రకాశ ధ్యానం, జీవన ఊర్జా (శక్తి) ఆరోహణ, గౌరీశంకర ధ్యానం, సాక్షీ ధ్యానం, ఆకాశ ధ్యానం, చంద్ర ధ్యానం వంటి అనేక ప్రక్రియలు ఈ ధ్యానంలో ఉన్నాయి.

సూక్ష్మ చేతన ఊర్జాతో సంపర్కం, దానిని గ్రహించి ధారణ చేయడం అనే ఆధ్యాత్మిక ప్రక్రియ ధ్యానం. ఇందుకోసమై మన మానసిక చేతనలో, శారీరక చేతనలో గణనీయమైన పరివర్తన తేవలసి ఉంటుంది. ధ్యానం భావ ఏకాగ్రతకు సాధనం అని భావించేవారికి ధ్యానంలోని వాస్తవం తెలియదు. ఏకాగ్రత ధ్యాన సాధనలో మొదటి మెట్టు మాత్రమే. ఈ ఏకాగ్రత ద్వారా చేతన మనస్సు యొక్క విడివడిన శక్తులను సంఘటితం చేస్తారు, బలీయం చేస్తారు–వాటిని తగువిధంగా వినియోగించడం కోసం, ఆ తర్వాత సాధకుని వ్యక్తిత్వాన్నీ, ప్రకృతినీ పరివర్తన చేయడానికి ఏ విధమైన సూక్ష్మ ఊర్జా అవసరం అవుతుందో తెలుసుకుంటారు.

ఈ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని, మొత్తం పథకాన్ని రూపొందిస్తారు. విజ్ఞుడైన వైద్యుడు రోగులందరికీ ఒకే మందు ఇవ్వడు. అలాగే–ఒకే ధ్యాన విధానం అందరికీ ఉపయోగపడదు. మందు ఇవ్వడానికి ముందు రోగాన్ని నిదానం చేయడం, రోగం ఏదో కనుగొనడం అవసరం అవుతుంది. రోగ నిదానం సరిగా ఉన్నపుడే చికిత్స సక్రమంగా ఉంటుంది. రోగ నిదానం సరిగా ఉన్నపుడే వైద్యుడు సరైన మందును ఎంపిక చేయగలుగుతాడు. అపుడే మందు బాగా పని చేస్తుంది. ధ్యానం విషయంలోనూ ఈ సూత్రమే వర్తిస్తుంది.

యువ మనసులను చక్కదిద్దడానికై ఈ విశ్వవిద్యాలయంలో అందుకు అనుగుణములైన పెక్కు టెక్నిక్‌లు కనుగొనబడ్డాయి. ఈ పరిశోధన ప్రక్రియ నేటికీ నిర్విరామంగా కొనసాగుతోంది. జ్ఞాపకశక్తిని పెంచడం, ప్రజ్ఞను పెంపొందించడం, సంస్కారాల క్షాళన వంటి పెక్కు పనులకు ఈ టెక్నిక్‌లు ఉపయోగిస్తాయి. వాత,పిత్త,కఫ ప్రకృతులకు అనుగుణంగా కూడ ఈ టెక్నిక్‌లను ఉపయోగిస్తారు.

విశ్వవిద్యాలయ కులాధిపతి నిర్దేశనంలో–విద్యార్థులే కాక అధ్యాపకులు, ఉద్యోగులు, అధికారులు అందరూ ఈ సాధనలో పాల్గొంటున్నారు. ఇలా నియమబద్ధంగా సాధన చేయడం వల్ల వ్యక్తిత్వానికి ఎన్నెన్నో వరాలు లభిస్తున్నాయి. తమ వ్యక్తిత్వాలలో యుగ ఋషి పరమపూజ్య గురుదేవుల సంకల్పం ఫలిస్తూన్నట్లు వీరు అనుభూతి పొందుతున్నారు.

## ఈ ధ్యాన గంగ ఒక మహా తీర్థం

ఈ ధ్యాన గంగలో స్నానం చేయడానికై విద్యార్థులతో పాటు శాంతికుంజ్‌లోని పరిజనులు, బయటనుండి వచ్చిన గాయత్రీ పరివార్ స్వజనులూ కూడ వస్తున్నారు. విశ్వవిద్యాలయంలో ప్రవహిస్తూన్న ఈ ధ్యాన గంగను మించిన తీర్థం మరొకటి లేదని వారంతా నిర్ణయించుకుంటున్నారు. ఇందులో స్నానం చేసే వారి మనస్సులు సహజంగా ఊర్ధ్వ లోకాలలో విహరిస్తాయి. HHH

**యుగ పరివర్తన కోసం జాగృత ఆత్మలను తయారుచేసే కర్మాగారం – శాంతికుంజ్.**

## శాంతికుంజ్ సమాచారం

# భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష బహుముఖ విస్తరణ

1994నుండి శాంతికుంజ్ దేశమంతటిలో నిర్వహిస్తున్న భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షకు నేడు కాయకల్పం జరుగుతోంది. ఒక విద్యార్థిద్వారా కనీసం పదిమంది ఇతరులకు చేరడం-అనే లక్ష్యంతో అది పురోగమిస్తోంది. ఈ విషయమై జూన్ నెలలో జరిగిన కార్యకర్తల శిక్షణ శిబిరంలో విస్తృతంగా సమాలోచన జరిగింది. కొత్త ఆలోచనలు వెలికివచ్చాయి.

శాంతికుంజ్ కేంద్ర కార్యాలయంలో ఒక డేటా బ్యాంక్ ఏర్పరచబడింది. ఈ పరీక్షపట్ల ప్రతి సంవత్సరం అభిరుచి చూపుతూన్న సుమారు 5000 విద్యాలయాల చిరునామాలు అందులో నమోదు చేయబడ్డాయి. ఇప్పుడు వీటి సంఖ్య 10,000లకు చేరుతోంది. ఈ విద్యాలయాల ప్రిన్సిపాళ్లకూ, అభిరుచి ఉన్న అధ్యాపకులకూ శాంతికుంజ్ లేఖ ద్వారా అభినందనలు తెలిపి, భావి కార్యక్రమాలకు మార్గదర్శనం చేసింది.

### విద్యాలయాలలో ఒకరోజు శిబిరాలు

ఈ విద్యాలయాలన్నింటిలో ఒకరోజు శిబిరాలు నిర్వహించే పథకం తయారయింది. విద్యాలయాల పని గంటలలోనే ఈ శిబిరాలు జరుగుతాయి. వాటిలో అధ్యాపకులూ, విద్యార్థులూ అందరూ పాల్గొంటారు. భారతీయ సంస్కృతి, దేవసంస్కృతి విశ్వవిద్యాలయం, జాతి గౌరవములకు సంబంధించిన అంశాలను ఆ శిబిరాలలో తెలుపుతారు. శిక్షణతో విద్యను జోడించడం ద్వారా వ్యక్తి నిర్మాణం ఎలా జరుగుతుందో వివరిస్తారు. ఇందువల్ల తర్వాతి సంవత్సరాలలో పరీక్షలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

ఈ పథకం అమలుకై - ముందుగా జిల్లా స్థాయిలో ఒక కార్యశీలమైన ప్రజ్ఞాపీఠంలో 2 1/2 రోజుల శిబిరం జరగాలి. ఇందుకోసం మార్గదర్శకాలు తయారవుతున్నాయి. విద్యాలయాలలో ఒకరోజు శిబిరాలను నిర్వహించే కార్యకర్తలకు ఈ శిబిరంలో ప్రశిక్షణ ఇస్తారు. ఆతర్వాత దేశంలోని 250 జిల్లాలలో ఒక్కొక్క జిల్లాలో అయిదేసి ఒకరోజు శిబిరాలు నిర్వహిస్తారు. అలా ఈ సంవత్సరం దేశమంతటిలో సుమారు 1250 శిబిరాలు జరుగుతాయి. ఒక్కొక్క శిబిరంలో 200 మంది విద్యార్థులూ, 5గురు అధ్యాపకులూ పాల్గొన్నా-సుమారు 2 1/2 లక్షలమంది పిల్లలు సంపర్కంలోకి వస్తారు. ఈ శిబిరాల ద్వారా వారి స్థాయికి తగిన సాహిత్యం కూడ అందించబడుతుంది. ఈ విద్యాలయాలన్నీ భవిష్యత్తులో మనం స్థాపించే కళాశాలలకు అంగములుగా అయి, దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంతో ప్రత్యక్షంగా సంబంధం ఏర్పరచుకోవచ్చు.

### ప్రార్థనా మండపాలలో సద్వాక్యాలు

ఇలా శిబిరాలు జరిగిన విద్యాలయాలలో, శాంతికుంజ్ లేఖ ద్వారా సంపర్కం చేసిన విద్యాలయాలలో దిగువ ప్రక్రియలు అమలు జరపాలి. అలా విద్యార్థుల ద్వారా వారి గృహాలలో మనం ప్రవేశించగలుగుతాము-

1. జ్ఞాన పరీక్ష ఆదాయంలోని మిగులుతో కాని, ప్రత్యేకంగా సేకరించిన ధనంతో కాని - ప్రతి విద్యాలయంలోని సభా మండపంలో సద్వాక్యాలను వ్రాయించాలి. ఇందుకోసం ఎవరైనా స్పాన్సర్‌ను కూడ చూడవచ్చు. ఇందువల్ల ప్రార్థనా మండపం వాతావరణం మంచి అభిరుచితో నిండుతుంది. ప్రేరణ ఇచ్చే ఆ వాక్యాలు బాల బాలికల లేత మనస్సులను ప్రభావితం చేస్తూ ఉంటాయి. ఉదాహరణకు - "నీ విలువ తెలుసుకో. నీవు ప్రపంచంలోని మహత్తర వ్యక్తినని విశ్వసించు''-అనే వాక్యం ఎంతోమంది పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని నిర్మాణం చేస్తుంది. ఆంగ్లభాషకు ప్రాధాన్యం ఇచ్చే విద్యాలయాలలో ఈ వాక్యాలను హిందీలోనూ, ఇంగ్లీషులోనూ వ్రాయవచ్చు. ఈ వాక్యాలు శాంతికుంజ్‌లో లభిస్తాయి.

**సంకల్పం వెనువెంట శక్తి ప్రవహిస్తుంది.**

2. ప్రార్థనా మండపంలో సద్వాక్యాలు వ్రాయబడినందుకు సత్ఫలితాలు లభించసాగితే - తరగతి గదులలో కూడ 6-8 సద్వాక్యాలు - గది పరిమాణాన్ని బట్టి - వ్రాయించవచ్చు. ఇందుకోసం దాతల నుండి ధనాన్ని సేకరించవచ్చు. లేదా, పరిజనులు తమలో తాము ధనం సేకరించవచ్చు. గోడలకు వెల్ల వేసేటపుడు ఈ వాక్యాలకు రంగులు వేయించవచ్చు.

## విద్యాలయాలలో కాగడా చిత్రాలు, యుగసాహిత్యం

3.ఆతర్వాత ప్రార్థనా మండపంలో కాని, విద్యాలయం ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద కాని, ముఖ్య స్థలాలలో కాని కాగడా చిత్రాన్ని తగిలింపజేసే ప్రయత్నం చేయాలి. దాని అర్థాన్ని కూడ తెలపాలి. పరమేశ్వరుడు ప్రకాశస్వరూపుడు. ఒకే వెలుగు నుండి మానవులంతా ఉదయించారని అన్ని మతాలూ చెపుతున్నాయి. కనుక- ఈ కాగడా జ్ఞానానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. మతతత్వమనీ, కాషాయీకరణ అనీ చెప్పి, ఎవరూ ఈ ప్రక్రియను అడ్డుకోరు. మధ్యలో కాగడా బొమ్మ, చుట్టూ వివిధ మతాల చిహ్నాల బొమ్మలూ కూడ ఉంచవచ్చు. అలాంటి స్టిక్కర్ మనవద్ద ఉంది.

4. ఆ తర్వాత ఈ విద్యాలయాలలో గురుదేవుల సాహిత్యాన్ని దానంగా స్థాపన చేయాలి. మొదట్లో ఎంపిక చేసిన కొన్ని సులభమైన పుస్తకాలను స్థాపన చేయాలి. విద్యపై వివిధ భావాలను సంకలనం చేస్తూ గ్రంథం ఒకటి తయారవుతోంది. తద్వారా బాలబాలికలు సూత్రప్రాయంగా నైతిక విలువలనూ, ఆదర్శాలనూ నేర్చుకోగలుగుతారు. క్రమంగా ఒక్కొక్కటిగా పెద్ద గ్రంథాలనూ, వాఙ్మయాన్నికూడ స్థాపించవచ్చు.

## విద్యాలయాలలో పోటీలు

5. ఆ విద్యాలయాలలో క్రమక్రమంగా ప్రాణాయామం, యోగం, వ్యాయామం, గాయత్రీ మంత్ర ప్రభావం వంటి విషయాలపై పోటీలు నిర్వహించాలి. ఈ పోటీలవల్ల విద్యార్థులలో ఆధ్యాత్మిక విషయాలలో అభిరుచి ఏర్పడుతుంది. ఈ పిల్లల తల్లిదండ్రులకు ఈ విషయాలు తెలిస్తే, వారి అభిరుచి కూడ పెరుగుతుంది. పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఈ విషయాలపై గ్రంథాలను ప్రదానం చేయాలి. లామినేట్ చేసిన కాగడా చిత్రాన్ని కూడ బహుమతిగా ఇవ్వాలి. అలా ఈ చిత్రం పిల్లల ఇళ్లలోకి చేరుతుంది. ఇతర విద్యార్థులు కోరితే, వారి ఇళ్లలో కూడ కాగడా చిత్రాన్ని స్థాపన చేయవచ్చు.

6. కార్యశీలమైన శక్తిపీఠాలలో నగరస్థాయిలో జ్ఞానపరీక్ష తరపున "కెరీర్ కౌన్సిలింగ్" (వృత్తి సలహా)పై నెలకు ఒకటి రెండు మారులు గోష్ఠులు నిర్వహించవచ్చు. దీనివల్ల క్రొత్తవారు సంపర్కంలోకి వస్తారు. దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం వివరాలను అందరికీ అందించవచ్చు.

## విద్యాలయాల దత్తత

7. ప్రతి జిల్లాలో కనీసం 5 విద్యాలయాలలో ఒకరోజు శిబిరం జరపవచ్చు. ఇందులో పారిశుద్ధ్య, శ్రమదాన వర్గం, వ్యసన విముక్తి ర్యాలీ, సాయంత్రం దీపయజ్ఞం జరపవచ్చు. ఇలా ప్రతి నెలలో ఏదో ఒక ప్రవృత్తిపై ఎంపిక చేసిన విద్యాలయాలలో కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

ఇలా మన పరిజనులు ఒకటినుండి అయిదు విద్యాలయాలను దత్తత తీసుకునే పని ప్రారంభించడం మన లక్ష్యం. క్రమంగా ఆ విద్యాలయాలకు మిషన్‌ను పరిచయం చేయాలి. ఆ విద్యాలయం గాయత్రీ పరివార్ దత్తత తీసుకున్న సంస్థగా క్రమంగా రూపొందాలి. చూస్తూ ఉండగానే - ఈ విప్లవాగ్ని దేశమంతటికీ తన జ్వాలలను విస్తరిస్తుంది.

**గమనిక :**

యుగశక్తి గాయత్రి సెప్టెంబరు 2005 సంచిక 46వ పుటలోని 8వ అంశాన్ని ఇలా సవరించి చదువుకోవాలి - "ప్రతి రాష్ట్రంలో మూడు శ్రేణులలో ప్రథమ స్థానాలను గెలుచుకున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రతినెలా (పని మాసములు పదిమాసములు) 200 రూపాయల ఉపకార వేతనం ఇవ్వబడుతుంది." HHH

**స్వాధ్యాయం జరపని వ్యక్తి గొప్పవాడు కాలేడు, జ్ఞాని కాలేడు.**

# వార్తలు

## విశాఖలో 51లక్షల సామూహిక గాయత్రీమంత్రజపం

మదురై అశ్వమేధ యజ్ఞం సందర్భంగా విశాఖపట్టణంలో శ్రీహరిపురం గుల్లలపాలెంలోగల శ్రీహరిహర క్షేత్రంలో శ్రీజగదీష్ అశోఫా సంకల్పించిన "దశదిన 51లక్షల సామూహిక గాయత్రీ మంత్రజప సాధన" గురుపూర్ణిమనాడు ఉదయం ప్రభాత ఫేరీతో ప్రారంభమయింది. రోజంతా సామూహిక మంత్రజపం, సాయంత్రం హారతి, భక్తి కార్యక్రమాలు జరిగాయి. ప్రతిరోజూ హారతి ముందు "నాదయోగ సాధన" వినిపించబడింది.

30 సాయంత్రం 500 మంది మహిళలతో భవ్య కలశయాత్ర జరిగింది. శ్రీ బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ, డా॥తుమ్మూరిల ఆధ్వర్యంలో వేయి దీపాలతో దీపయజ్ఞం జరిగింది.

31న జరిగిన నవకుండీయ గాయత్రీ యజ్ఞంలో శ్రీ బ్రిజ్‌మోహన్ గౌడ్ జీ, డా॥తుమ్మూరి, శ్రీ అనంత ప్రకాశ గాయత్రి స్వామి ప్రవచనాలు ఇచ్చారు.

శ్రీమతులు సావిత్రి, వసంతకుమారి, ప్రేమకుమారి, రూపవాణి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడంవల్ల కార్యక్రమాలకు ప్రజలనుండి అనూహ్యమైన స్పందన లభించింది.

పూర్ణాహుతిలో 51 లక్షల గాయత్రీ మంత్రజపం అర్పించబడింది.

రాయఘడ, పార్వతీపురం, శ్రీకాకుళం, కురుపాం, మేరంగి, తగరపువలస, తాళ్లదమ్ములనుండి కూడ పరిజనులు వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీయుతులు హేమచంద్ర రావు, అవతారం రాజు, బి.ఎన్.రావు, ఇంద్రజీత్ సింగ్, పుష్యమిత్ర, ఎమ్.రామకృష్ణ స్వామి, ఈ.హరినారాయణ, సంతోష్ అగ్నిహోత్రి, కె.ఆర్.శర్మ, మహేశ్వరి, ధన్‌జీ భాయి, శ్రీమతి లక్ష్మి సహకరించారు. మాతృమండలి, వికాసతరంగిణి, సాయి భజన మండలులు సహకారం అందించాయి. శ్రీయుతులు బి.బి.రాం, గణేశ్ పుస్తకశాల నిర్వహించి, యుగ సాహిత్యానికి బహుళ ప్రాచుర్యం కలిగించారు.

విశాఖలో జరిగిన ఇతర కార్యక్రమాలు – జూన్3న కంచరపాలెంలోని శ్రీ శ్రీరాములు గృహంలో గాయత్రీ యజ్ఞం. జూన్ 17న విశాఖ కార్యాలయంలో గాయత్రీ యజ్ఞం. జూన్ 22న సిరిపురం వద్ద శ్రీ ఆదిరాజు కృష్ణమోహన్ గృహంలో గాయత్రీ యజ్ఞం. జూన్ 26న అల్లిపురంలో శ్రీ పి.అప్పారావు గృహంలో గాయత్రీ యజ్ఞం. జూలై 27న కార్యాలయంలో విశేష గాయత్రీ యజ్ఞం. జూలై 28న వేపగుంటలో శ్రీ శ్రీరామం గృహంలో యజ్ఞం, పుంసవనం, అక్షరాభ్యాసం, ఆగస్టు 6న నరసింహనగర్‌లో

### చీరాలలో వైభవంగా ఆర్షవాఙ్మయ జ్ఞానరథ యాత్ర

గురుపూర్ణిమ సందర్భంగా చీరాలలో గాయత్రీ పరివార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్షవాఙ్మయ జ్ఞానరథ యాత్ర వైభవోపేతంగా జరిగింది. జ్ఞానరథంలో గురుదేవులు రచించిన వేద ఉపనిషత్తుల వ్యాఖ్యానాలు, వాఙ్మయం 70 గ్రంథాలు, వారి ఇతర గ్రంథాలు ప్రదర్శించారు. యాత్ర పొడవునా ప్రజలు హారతులు ఇచ్చి రథానికి స్వాగతం పలికారు.

అనంతరం స్థానిక కళ్యాణమండపంలో గురుపూర్ణిమ ఉత్సవం జరిగింది. పలువురు అధ్యాపకులకు విద్యార్థులు పాదపూజ చేశారు. ట్రస్ట్ వారికి సన్మానం చేసింది. సభకు శ్రీ డి.వి.ఆర్.మూర్తి అధ్యక్షత వహించారు. శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

అంతకుముందు తొమ్మిది రోజుల పాటు ట్రస్ట్ కార్యాలయంలోను ఎమ్.జి.హెచ్. కాలనీ శ్రీ వేదమాత గాయత్రీమహిళా మండలి ఆధ్వర్యంలోను గురుదేవుల ఆత్మకథ పారాయణ జరిగింది.

గురుపూర్ణిమ నాడు ఉదయం ట్రస్ట్ కార్యాలయంలో శ్రీయుతులు డి.వి.ఆర్.మూర్తి, డి.బాపయ్య త్రికుండీ యజ్ఞం నిర్వహించారు.

శ్రీయుతులు కె.జనార్దన్, ఎన్.శ్రీనివాస్, బి.మల్లికార్జునరావు, సి.హెచ్.చలపతిరావు, శ్రీమన్నారాయణ, ఎన్.విశ్వనాథం, పి.శ్రీనివాస్, పి.భాస్కర్, ఎ.చిన్నబ్బిశెట్టి, ఎస్.మోహనకృష్ణ, సత్యనారాయణ గుప్త, శ్రీమతులు రమాదేవి, కృష్ణకుమారి, రమాదేవి, పి.అమరవాణి, సరోజిని, సువర్ణ కార్యక్రమానికి సహకరించారు.

**గతాన్ని పూజించే బదులు వర్తమానాన్ని పూజించండి.**

శ్రీఎమ్.మురళీకృష్ణ గృహంలో దీపయజ్ఞం, జన్మదిన సంస్కారం.

పై కార్యక్రమాలను శ్రీమతులు సావిత్రి, వసంత, లీలావతి, శ్రీ హేమచంద్ర రావు నిర్వహించారు.

## రెడ్డిపల్లిలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం

ఆగస్టు 8న విశాఖజిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో శ్రీవైదా గురునాథరావు ఆధ్వర్యంలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీమతి ఎమ్.రూపవాణి, శ్రీ పి.వి.పండా యజ్ఞాన్ని నిర్వహించారు. 120 మంది పాల్గొన్నారు.

శ్రీవైదా గురునాథరావు పద్మనాభం మండలంలో విస్తృతంగా మిషన్ ప్రచారం జరుపుతున్నారు.

## భీమిలిలో దుర్గాగాయత్రి శక్తిపీఠం పంచమ వార్షికోత్సవం

భీమిలిలో ఆగస్టు 7న శ్రీదుర్గా గాయత్రి శక్తిపీఠం పంచమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవార్లకు విశేష అలంకరణ జరిగింది. శ్రీమతి భారతి పూజ నిర్వహించారు. శ్రీబి.గణపతి శాస్త్రి ఆధ్వర్యంలో డా॥చంద్రశేఖరం పంచాయతన పూజ జరిపారు. శ్రీయుతులు గురుమూర్తి, పుష్యమిత్ర, శ్రీమతి రూపవాణి పంచకుండీయ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. శ్రీయుతులు పి.వి.పండా, కృష్ణమూర్తి, అవతారం రాజు, శ్రీమతి లక్ష్మి సహకరించారు. 300 మంది పాల్గొన్నారు.

వార్షికోత్సవం సందర్భంగా డా॥చంద్రశేఖరం ఆకాశవాణిలో పరమపూజ్య గురుదేవుల సంకల్పాలపై ప్రసంగించారు.

## మదురై అశ్వమేధ శక్తికలశానికి ఖమ్మం రైల్వేస్టేషన్‌లో స్వాగతం

మదురై అశ్వమేధ యజ్ఞ శక్తికలశం శాంతికుంజ్ నుండి బయలుదేరి, ఢిల్లీ, భోపాల్, నాగపూర్ మున్నగు స్థలాలలో స్వాగత సత్కారాలు పొంది ఖమ్మం చేరింది.

ఖమ్మం రైల్వేస్టేషన్‌లో శక్తి కలశానికి భవ్య స్వాగతం లభించింది. శ్రీయుతులు రాజేంద్రసింగ్ యదువంశీ, డా॥తుమ్మూరి, హీర్‌సింగ్ రాజపురోహిత్, వి.రాంరెడ్డి, రావూరి వీరయ్య చౌదరి, శంకర నాయక్, వనమా సురేష్, పి.మాధవ్, ఎస్.ప్రతాప్, వి.గోవర్ధన్, రాజగోపాలం, సిరిపురపు శంకరయ్య, రామకృష్ణారావు, వై.సత్యనారాయణ, ఎమ్.అర్జున రావు, బి.అశోక్ కుమార్, శ్రీమతి అనంతలక్ష్మి కలశానికి హారతి ఇచ్చారు. కలశంవెంట ఉన్న 250 మంది కార్యకర్తలకు భోజన వసతి కల్పించారు.

## ఇల్లెందులో ఆరోగ్య సంరక్షణ ఉద్యమం

వర్షాలు కురుస్తూ ఉండడంతో – అందువల్ల ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ప్రచార ఉద్యమం ప్రారంభమయింది. పరివార్ కార్యాలయంలో ఆగస్టు2న కొత్తగూడెం డివిజన్ మందుల తనిఖీ అధికారి శ్రీ టి.కైలాసం ఉద్యమాన్ని ప్రారంభించారు. అతిసారం, మెదడువాపు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు దరిచేరకుండా తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సంస్థ జిల్లా కన్వీనర్ శ్రీ సతీష్ కండేల్‌వాల్, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎస్.ఎమ్.అబ్బర్, కార్యదర్శి శ్రీ సి.హెచ్.లింగయ్య, శ్రీయుతులు గోపు జగన్నాథం, ఈశ్వర్, శ్యాం, వెంకన్న, టి.రజనీకాంత్, శశాంకా శ్యామ్, ఎస్.వి.పరబ్, టి.అశోక్, శ్రీమతి క్యాతం సరోజిని కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వేములవాడలో గురుపూర్ణిమ ఉత్సవం

గురుపూర్ణిమ సందర్భంగా వేములవాడలో జిల్లా కార్యకర్తలు 100 మంది త్రికుండీ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఇరువురు గురుదీక్ష తీసుకున్నారు. నాటి రాత్రి దీపయజ్ఞం జరిగింది. శ్రీమతి పులి లక్ష్మి, శ్రీయుతులు మధుకర్, మనోహర్ సహకరించారు.

జూన్ 17న మారుపాక, మల్యాల, కొత్తపేటలలో గాయత్రీ జయంతి ఉత్సవాలు జరిగాయి.

వేములవాడ మండలంలో అయిదు వివాహాల సందర్భంలో "గృహమే కదా స్వర్గసీమ" మెమెంటోలు అందజేశారు.

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షలో కరీంనగర్ జిల్లాలో బోయినిపల్లి నర్మదకు సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానం లభించింది.

**మన జ్ఞానాన్ని పెంచని సాహిత్యం మాటల గారడీ.**

కరీంనగర్ (రూరల్) వావిలాలపల్లెలో చుండి కృష్ణకృప - వెంకట లలితాంబ దంపతుల గృహంలో జూలై 17న ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది.

పై కార్యక్రమాలు డా॥పులి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగాయి.

## నెల్లూరులో జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానం

గురుపూర్ణిమ సందర్భంగా నెల్లూరు మోడరన్ స్కూల్‌లో భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది, స్కూలు కరస్పాండెంట్ శ్రీవిజయ కుమార్, జ్ఞానపరీక్ష రాష్ట్ర కన్వీనర్ శ్రీ బి.హనుమంత రెడ్డి ఉత్సవంలో పాల్గొన్నారు.

## విజయవాడలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

గురుపూర్ణిమ సందర్భంగా విజయవాడ కార్యాలయంలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. 170 మంది పాల్గొన్నారు. 20న అఖండ గాయత్రీ జపం జరిగింది.

విజయవాడ కేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఇతర కార్యక్రమాలు-

జూలై 1న పాల్వంచలోని కె.టి.పి.ఎస్.డాక్టర్స్ క్వార్టర్స్‌లోని డా॥సుజాత శ్రీనివాస్ గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం. జూలై3న విజయవాడలోని పటేల్ ప్లైవుడ్ షాపులో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం. జూలై 17న విజయవాడ గవర్నరుపేటలోని శ్రీమురళీకృష్ణ ఎలెక్ట్రానిక్స్ షాపులో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం. జూలై 17న విజయవాడలోని శ్రీడి.రమేశ్ కుమార్ గృహంలో, శ్రీడి.మురళిగారి డిటిపి సెంటర్‌లో, శ్రీమతి నిర్మల గృహంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞాలు. జూలై30న విజయవాడలోని శ్రీఎమ్.చంద్రశేఖర్ గృహంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం. జూలై 31న విజయవాడలోని శ్రీ ఎన్.రఘునాథ రావు గృహంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం, జూలై 31న హనుమాన్ జంక్షన్‌లోని సాయిబాబా ఆలయంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం.

## చింతలపూడిలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

గురుపూర్ణిమ సందర్భంగా చింతలపూడిలోని లక్ష్మారెడ్డిగారి మిల్లు ఆవరణలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం వైభవంగా జరిగింది. శ్రీ జి.లింగారెడ్డి, శ్రీమతి ఎన్.సుధ యజ్ఞం నిర్వహించారు. శ్రీమతులు జి.సుజాత, టి.యామినీపూర్ణ తిలక, జి.వరలక్ష్మి, ఓ.ప్రభావతి, పద్మశ్రీ సహకరించారు. 150మంది పాల్గొన్నారు.

జూలై 15న శ్రీ బి.రామమోహనరావు గృహంలో శ్రీ జి.లింగారెడ్డి ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు.

## పాలకొల్లు నర్సాపురంలో సంస్కారాలు, దీపయజ్ఞాలు

జూలై 27న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నర్సాపురంలోని సి.డబ్లియు బి.రామమోహనరావు గృహంలో జన్మదిన సంస్కారం, దీపయజ్ఞం జరిగాయి.

జూలై 25న పాలకొల్లు నర్సాపురంలలోని పి.నరసింహారావు గృహంలో జన్మదిన సంస్కారం, దీపయజ్ఞం జరిగాయి.

శ్రీ జి.లింగారెడ్డి పై కార్యక్రమాలను నిర్వహించారు.

H H H

## భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష సమితి నిర్ణయాలు అనే శీర్షికన సెప్టెంబర్ మాసపత్రికలో పరీక్ష ఫీజును పదిరూపాయల నుండి పన్నెండు రూపాయలకు పెంచారు అని ఉంది. అది సరిగాదు. గత రెండు సంవత్సరాలుగా పరీక్ష ఫీజ్ ప్రతి విద్యార్థికి రూ 15/- (పదిహేనురూపాయలు)గా ఉంది. ఎలాంటి మార్పు లేదని గమనించవలసినదిగా మనవి.

జిల్లా కమిటీలు, గాయత్రి పరిజనులు మరియు భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షకు సహకరించే వారందరికి తెలియ చేయుట యేమనగా ఎవరైనా పరీక్ష వ్రాయకుండా పుస్తకాలు, ప్రశ్నాబ్యాంకు కావలసిన వారికి విడిగా సెట్‌కు రూ 15/- ప్రకారం అమ్మగలరు. జిల్లాకమిటీలకు కావలసిన సెట్స్ వెంటనే స్టేట్ కన్వీనర్ గారిని అడిగి తెప్పించుకోగలరు. పరీక్ష 19-11-05నాడు వుంది కనుక సమయం తక్కువగా వున్నందున వెంటనే తెప్పించుకోగలరు ఏ సమాచారము కావలసిన స్టేట్ కన్వీనర్‌గారిని సంప్రదించగలరు.

బి. హనుమంతరెడ్డి

**చూస్తున్న పొరుగువాణ్ణి ప్రేమించలేని వాడు చూడని దేవుణ్ణి ఎలా ప్రేమించగలడు**

# యుగశక్తి గాయత్రీ కేంద్రంలో

## దేవ మానవుల ఆవిర్భావానికి దోహదంచేసే గ్రంథాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ధైర్యం విడవకండి | 2.00 | 27. | మరణం తర్వాత మన స్థితి ఏమిటి | 5.00 |
| 2. | మానసిక సంతులనము | 2.00 | 28. | ప్రజ్ఞా పురాణ కథలు | 8.00 |
| 3. | మన గౌరవ గరిమ | 2.00 | 29. | గో సంరక్షణయే మన సంరక్షణ | 8.00 |
| 4. | సద్గురు వచనామృతం | 2.00 | 30. | గాయత్రీ హవనవిధి | 8.00 |
| 5. | గాయత్రి ఉపాసన | 3.00 | 31. | ప్రార్థన ప్రత్యక్ష చమత్కారాలు | 8.00 |
| 6. | గాయత్రి రామాయణము | 3.00 | 32. | క్రాంతి శిఖరం | 8.00 |
| 7. | గాయత్రి స్మృతి | 2.00 | 33. | యుగ యజ్ఞ పద్ధతి | 10.00 |
| 8. | ఆరోగ్య జీవన రహస్యం | 3.00 | 34. | నేను ఏమిటి | 10.00 |
| 9. | నిత్యజీవితంలో తులసి | 2.00 | 35. | ఏకాంత సహచరులు | 10.00 |
| 10. | సంస్కారాల పుణ్య పరంపర | 4.00 | 36. | కల్ప సాధన | 12.00 |
| 11. | మార్పు యొక్క మహత్తర క్షణాలు | 4.00 | 37. | ఆత్మకథ | 25.00 |
| 12. | సందేహాలు సమాధానాలు | 5.00 | 38. | నారీ మహత్య ప్రకరణము | 15.00 |
| 13. | గృహలక్ష్మి ప్రతిష్ట | 4.00 | 39. | శ్రీమద్భాగవత కథ | 18.00 |
| 14. | ప్రాణాంతక వ్యసనాలు | 4.00 | 40. | కుండలినీ మహా విజ్ఞానము | 18.00 |
| 15. | పవిత్ర జీవనము | 4.00 | 41. | గాయత్రి మహా విజ్ఞానము మొదటి భాగం | 30.00 |
| 16. | ఋగ్వేద భూమిక | 4.00 | 42. | గాయత్రి మహా విజ్ఞానము రెండవ భాగం | 30.00 |
| 17. | గాయత్రి మంత్ర లేఖనం | 5.00 | 43. | గాయత్రి మహా విజ్ఞానము మూడవ భాగం | 25.00 |
| 18. | గహనో కర్మణో గతిః | 5.00 | 44. | అమృతకలశం | 25.00 |
| 19. | చాలీసా చిత్రావళి | 5.00 | 45. | వేదముల దివ్య సందేశము | 40.00 |
| 20. | ప్రతిభావంతులారా లేవండి ముందుకు రండి | 5.00 | 46. | 24 శక్తి ధారలు | 30.00 |
| 21. | మూలికా చికిత్సా శాస్త్రము | 5.00 | 47. | సూర్య విజ్ఞానము | 18.00 |
| 22. | స్వాతంత్ర్య సంగ్రామ సేనాని | 5.00 | 48. | తల్లి దీవెన (మాతాజీ సూక్తులు) | 2.00 |
| 23. | సమయదానమే యుగధర్మం | 5.00 | 49. | ఉపాసన సాధన | 10.00 |
| 24. | జీవన సాధనకు బంగారు సూత్రాలు | 5.00 | 50. | కర్మఖాండ భాస్కర | 80.00 |
| 25. | యజ్ఞం ఒక సమగ్ర శాస్త్రము | 5.00 | 51. | మాతాజీ దివ్యచరిత్ర | 40.00 |
| 26. | గురుదీక్ష | 5.00 | 52. | వంటింటి వైద్యములు | 5.00 |

**పోస్టేజి, ప్యాకింగ్ అదనం.**